
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 132

శుక్రవారం 2-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**'బేర్' బాజా!**

ఫెడ్ పావు శాతం రేట్ల కోత. సెన్సెక్స్ 463 పాయింట్లు డౌన్ -బిజినెస్‌లో



**స్టీవ్ స్మిత్ అద్భుత సెంచరీ**

యాషెస్ మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 284 ఆలౌట్ - స్పోర్ట్స్‌లో

# నదీ జలాలపై మా వైఖరి సరైనదే

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల అభిప్రాయం**

**సామరస్య ధోరణితోనే ఇరు రాష్ట్రాల ప్రయోజనాల పరిరక్షణ**

**ప్రగతి భవన్‌లో కేసీఆర్‌తో జగన్ మర్యాదపూర్వక భేటీ**

-వివరాలు 2లో



గురువారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమైన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# అప్పులుంటే అసెంబ్లీ కట్టకూడదా?

- ఎర్రమంజిల్ భవనం శిథిలావస్థకు చేరింది
- ప్రభుత్వం అసెంబ్లీ నిర్మిస్తే చట్ట వ్యతిరేకం ఎలా అవుతుంది?
- ఎర్రమంజిల్ కేసులో పిటిషనర్లను ప్రశ్నించిన హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వానికి అప్పు లుంటే నిర్మాణ రంగంలో అభివృద్ధి పనులు చేయకూడదా?, అప్పులుంటే అసెంబ్లీ భవనాలు కట్టరాదని ఏవిధంగా ఉత్తర్వులివ్వాలో తెలపాలని ఎర్రమంజిల్ భవన కూల్చివేత కేసులో పిటిషనర్లను హైకోర్టు మరోసారి ప్రశ్నించింది. ఎర్రమంజిల్ భవనం శిథిలావస్థకు చేరిందని, ప్రభుత్వం అసెంబ్లీ సముదాయ భవనాల్ని నిర్మిస్తే ఏవిధంగా చట్ట వ్యతిరేకం అవుతోందో చెప్పాలని వారిని ఆదేశించింది. ఎర్రమంజిల్ భవన ప్రదేశంలో అసెంబ్లీ భవనాల్ని నిర్మించాలనే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై గురువారం విచారణ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం పైవిధంగా ప్రశ్నించింది. పిటిషనర్ తరపు లాయర్ చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ.. తెలంగాణ మిగతా 2వ పేజీలో ▶

# ఒక్క రోజులో 12 టీఎంసీలు

**శ్రీశైలం జలాశయానికి పోటెత్తుతున్న కృష్ణా వరద**

- 1.93 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 43 టీఎంసీలకు చేరిన నిల్వ
- జూరాలకు 1.85 లక్షల క్యూసెక్కుల మేర వరద
- కల్వకుర్తి పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు షురూ
- గోదావరికి కొనసాగుతున్న వరద.. ఎల్లంపల్లిలోకి స్థిరంగా ప్రవాహాలు
- చెరువుల్లోకి నీటి చేరిక.. నిండుకుండలుగా 2వేల చెరువులు



సాక్షి, హైదరాబాద్

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన కొనసాగుతున్న వర్షాలతో వరద పోటెత్తుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదులుతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటోంది. గురువారం ఉదయానికి 37వేల క్యూసెక్కులు (3.36 టీఎంసీలు)గా నమోదైన ప్రవాహం సాయంత్రానికి ఏకంగా 1.93 లక్షల క్యూసెక్కులకు (17.54టీఎంసీలు) పెరిగింది. 24 గంటల వ్యవధిలో ప్రాజెక్టులోకి ఏకంగా 12 టీఎంసీల మేర కొత్త నీరు వచ్చి చేరింది. వచ్చి చేరుతున్న వరదతో ప్రస్తుతం ప్రాజెక్టులో నిల్వ 215 టీఎంసీలకు గానూ 43 టీఎంసీలకు చేరింది. ఇక గోదావరిలోనూ వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది.

**శ్రీశైలానికి జలకళ**

పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టికి స్థిరంగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఏకంగా 1.60లక్షల క్యూసెక్కుల (14.54 టీఎంసీలు) ప్రవాహం వస్తుండటంతో అక్కడి నుంచి 2.13లక్షల క్యూసెక్కుల (19.36 టీఎంసీలు) నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ నీరంతా నారాయణపూర్‌కు చేరుతుండగా, అక్కడి నుంచి 1.94 లక్షల క్యూసెక్కుల (17.63 టీఎంసీలు) నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు 1.85లక్షల క్యూసెక్కుల (16.81టీఎంసీలు) మేర ప్రవాహం వస్తోంది. దీంతో జూరాల నుంచి 24 గేట్ల ద్వారా 1,57,185 క్యూసెక్కులు (14.28 టీఎంసీలు), విద్యుదుత్పత్తి ద్వారా 26,238 క్యూసెక్కులు (2.38 టీఎంసీలు) నదిలోకి వదులుతున్నారు. ఇక నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా ద్వారా 1,300 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ 315 క్యూసెక్కులు, జూరాల కుడి, ఎడమ కాల్వలకు 1,900 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి దిగువకు వస్తున్న నీరంతా శ్రీశైలానికి చేరుతోంది. గురువారం సాయంత్రం శ్రీశైలానికి 1.93లక్షల క్యూసెక్కుల (17.54టీఎంసీలు) ప్రవాహం వస్తోంది. బుధవారం ఉదయం కేవలం 804 అడుగుల మట్టంలో 31టీఎంసీల మేర నీటి నిల్వలుండగా, అది ఒక్క రోజులోనే 822 అడుగులకు పెరిగి మిగతా 2వ పేజీలో ▶

# చల్లని కబురు

- ఆగస్టు, సెప్టెంబర్‌లలో సాధారణ వర్షపాతం
- తాజా నివేదికలో వెల్లడించిన భారత వాతావరణ శాఖ
- ఆగస్టులో 220 మిల్లీమీటర్లు.. సెప్టెంబర్‌లో 161 మిల్లీమీటర్లు
- 8% అటు, ఇటుగా వర్షం: హైదరాబాద్ వాతావరణ శాఖ

సాక్షి, అమరావతి బ్యూరో/హైదరాబాద్: వానాకాలం ప్రథమార్ధం (జూన్, జులై)లో నైరుతి రుతుపవనాలు కాస్త నిరాశ పరిచినప్పటి ద్వితీయార్ధంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని, వచ్చే రెండు నెలలు వర్షాలకు కొదవుండదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) భరోసా ఇచ్చింది. ప్రతి ఏటా నైరుతి సీజనుకు ముందు ఒకసారి, 2నెలల తర్వాత మరోసారి వర్షాల పరిస్థితిపై మిగతా 2వ పేజీలో ▶

**జాధవ్‌ను కలుసుకోవచ్చు!**

- కుల్‌భూషణ్‌తో భారత దౌత్యాధికారుల భేటీకి పాక్ ఓకే -5లో






# బిన్‌లాడెన్ కుమారుడు హమ్జా హతం..!

- అల్‌కాయిదా కీలక నేతగా ఎదుగుతున్న హమ్జా
- వైమానిక దాడుల్లో హతమైనట్లు తెలిపిన అమెరికా అధికారులు
- ఘటనపై నోరు మెదపని అధ్యక్షుడు ట్రంప్

5లో



# కాఫీ డే అప్పులు 5,200 కోట్లు..!

- ఏడాది వ్యవధిలోనే రెట్టింపు
- 75 శాతం పైగా ప్రమోటర్ షేర్లు తనఖాలోనే
- మిగతా గ్రూప్ సంస్థల రుణాలపైనా సందేహాలు
- కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఫైలింగ్స్‌తో వెలుగులోకి..

బిజినెస్‌లో








# ఇక ఢిల్లీలో 'ఉన్నావ్' విచారణ

- యూపీ నుంచి బదిలీ చేయాలని ఆదేశించిన సుప్రీంకోర్టు
- బాధితురాలికి రూ. 25 లక్షల తాత్కాలిక పరిహారం
- ప్రమాదంపై దర్యాప్తు ముగించేందుకు 7 రోజులే గడువు
- ప్రధాన కేసు విచారణనూ 45 రోజుల్లో ముగించాలి
- కుల్దీప్ సెంగార్‌ను పార్టీ బహిష్కరించిందన్న బీజేపీ నేతలు

- వివరాలు 5లో

**'మెడికల్' బిల్లుకు రాజ్యసభ ఓకే**

- ఎంసీఐ స్థానంలో ఇక నేషనల్ మెడికల్ కమిషన్
- 25 మంది సభ్యులు; వారిలో 11 మంది రాష్ట్రాల ప్రతినిధులు.. రెండు సవరణల కోసం మరోసారి లోక్‌సభకు వెళ్లనున్న బిల్లు

- వివరాలు 5లో

## డిగ్రీ ప్రవేశాలకు త్వరలో మరో దశ కౌన్సెలింగ్

- ఈ నెల 5, 6 తేదీల్లో ఇంట్రా కాలేజీ కౌన్సెలింగ్
- ఆ తరువాతే డిగ్రీ ప్రవేశాలకు మరో దశ కౌన్సెలింగ్
- అదే ఇక చివరి అవకాశం.. ఆ తరువాత స్పాట్ అడ్మిషన్లు?
- స్పాట్లో చేరే వారికి రీయింబర్స్‌మెంట్ వర్తించదు: ప్రభుత్వం

-వివరాలు 3లో

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు షెడ్యూల్



- ఎమ్మెల్యే కోటాలో స్థానాలకు ఎన్నిక ఆగస్టు 26న
- తెలంగాణలో ఒకటి, ఏపీలో మూడు స్థానాలకు..
- ఆగస్టు 7న నోటిఫికేషన్ విడుదల

-వివరాలు 2లో






కేంద్ర మంత్రి అర్జున్‌ముండాకు సమ్మక్క- సారలమ్మ జాతర ఆహ్వాన పత్రికను అందిస్తున్న మంత్రి కొప్పుల, ఎంపీ నామా తదితరులు

## మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించండి

### కేంద్రాన్ని కోరిన మంత్రి కొప్పుల ఈశ్వర్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు రావాల్సిందిగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్‌ముండాను సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆహ్వానించారు. ఈమేరకు గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలసి ఆహ్వానపత్రాన్ని అందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు మేడారం జాతర జరుగుతుందన్నారు. దీని నిర్వహణకు దాదాపు రూ.110 కోట్లు అవసరమవుతాయని, రాష్ట్ర గిరిజన శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలను కేంద్రమంత్రికి అందజేశారు.

**వసతి గృహ నిర్మాణాలకు నిధులివ్వండి**

ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని వసతి గృహాల నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో టీఆర్‌ఎస్ ఎంపీలతో కలసి కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి రాందాస్ అథవాలేకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీ టు పీజీ మిషన్‌లో భాగంగా ప్రతి పేదకు ఉచిత విద్య అందించాలన్న సంకల్పంతో పెద్ద సంఖ్యలో గురుకుల పాఠశాలలను నెలకొల్పుతుందన్నారు. కేంద్రం తరపున తప్పకుండా సహకారం అందుతుందని అథవాలే హామీ ఇచ్చినట్లు కొప్పుల గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## పోక్సో కేసులకు ప్రత్యేక కోర్టులు

### పోక్సో బిల్లుపై చర్చలో టీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



**సాక్షి, న్యూఢిల్లీ:** పోక్సో చట్టం పరిధిలో నమోదయ్యే కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి, తగిన మౌలిక వసతులు కల్పించాలని కేంద్రాన్ని టీఆర్‌ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. లైంగిక దాడులు, అత్యాచారాల నుంచి బాలలకు రక్షణ కల్పించే (పోక్సో) బిల్లుపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బాలలపై అత్యాచారాలు పెరిగిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుల్లో శిక్షల రేటు గడిచిన పదేళ్లలో తగ్గిపోవడం ఆందోళనకరమన్నారు. 2006లో మొత్తం కేసుల్లో శిక్షలు పడిన కేసుల సంఖ్య 32.6 శాతం కాగా.. 2016లో 28.2 శాతం మాత్రమే ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య ఇదేకాలంలో 81.3 శాతం నుంచి 89.6 శాతానికి ఎగబాకిందని వివరించారు. ఫిర్యాదు దాఖలు చేసే ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, ముఖ్యంగా దోషులకు రాజకీయ అండ లభించడం వల్ల కేవలం 4 శాతం కేసులే నమోదవుతున్నాయని వివరించారు. అత్యాచారాలపై పిల్లల్లో అవగాహన కల్పించాలని, వారు ధైర్యంగా ఫిర్యాదు చేసేలా చైతన్యవంతులను చేయాలని కేంద్రాన్ని కోరారు.

## మిషన్ భగీరథకు నిధులివ్వండి

### రాజ్యసభలో టీఆర్‌ఎస్ ఎంపీ లక్ష్మీకాంతరావు



**సాక్షి, న్యూఢిల్లీ:** ఇంటింటికీ నల్లా నీరు ఇచ్చే లక్ష్యంతో తెలంగాణలో ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకానికి నిధులు విడుదల చేయాలని కేంద్రాన్ని టీఆర్‌ఎస్ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు కోరారు. గురువారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. రూ.42 వేల కోట్ల అంచనా వ్యయంతో భగీరథ పనులు ప్రారంభించారని, 80 శాతం నిధులను పలు సంస్థల ద్వారా రుణంగా పొందినట్లు తెలిపారు. మిషన్ భగీరథ కార్యక్రమానికి కేంద్రం నుంచి సాయం చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ కూడా రూ.19,205 కోట్లు మిషన్ భగీరథ కార్యక్రమానికి ఇవ్వాలని ప్రతిపాదించిందని ఆయన గుర్తుచేశారు. అనేకసార్లు ఈ విషయంపై విజ్ఞప్తి చేసినా ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులివ్వలేదన్నారు.

## ఆధ్యాత్మిక పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోండి

### కేంద్రాన్ని కోరిన ఎంపీ బీబీపాటిల్



**సాక్షి, న్యూఢిల్లీ:** స్వదేశ్ దర్శన్ పథకం కింద తెలంగాణలో ఆధ్యాత్మిక టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అనుమతులు మంజూరు చేయాల్సిందిగా టీఆర్‌ఎస్ ఎంపీ బీబీపాటిల్ కోరారు. గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. తెలంగాణలో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాల కేంద్రంగా ఆధ్యాత్మిక టూరిజం సర్క్యూట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కేంద్ర మంత్రిత్వ శాఖకు ప్రణాళికలు పంపారని గుర్తు చేశారు. అయినా ఈ విషయంలో ఇప్పటివరకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో చొరవ తీసుకొని వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు.

## రాష్ట్రాల హక్కులను కాపాడాలి

### రాజ్యసభలో ఎంపీ బడుగుల లింగయ్య



**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్రం సమాఖ్య వ్యవస్థను గౌరవిస్తూ రాష్ట్రాల హక్కులను కాపాడాలని టీఆర్‌ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. తీవ్రవాద చర్యలకు పాల్పడే వ్యక్తులను గుర్తించేందుకు, వారి ఆస్తులను జప్తు చేసేందుకు తెచ్చిన ఈ బిల్లును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థలుగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా తీవ్రవాద కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ బిల్లు ద్వారా వాటి ఆట కట్టించేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. అయితే తీవ్రవాదుల గుర్తింపు, అరెస్టు, దర్యాప్తు ప్రక్రియపై ముందుగా ఎన్‌ఐఏ రాష్ట్ర డీజీపీకి సమాచారం అందించి, రాష్ట్రాల హక్కులను కాపాడాలని సూచించారు.

## రేపు బీడీఎల్‌కు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**పటాన్‌చెరు:** రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం భానూర్‌లోని బీడీఎల్ పరిశ్రమను సందర్శించనున్నారు. బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) పరిశ్రమ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో రక్షణ మంత్రి పాల్గొంటారని సంస్థ ఏజీఎం విక్రమ్ తెలిపారు. వేడుకల్లో భాగంగా హైదరాబాద్ కంచన్‌భాగ్‌లో నిర్వహించే కార్యక్రమాలకు రక్షణ మంత్రి హాజరుకానున్నారని చెప్పారు. 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఆయన భానూర్‌లోని బీడీఎల్‌కు వస్తారని, 12 గంటలకు వెళ్లిపోతారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా బీడీఎల్‌లో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జిల్లా ఎస్పీ చంద్రశేఖర్ గురువారం బీడీఎల్ టౌన్ షిప్‌ను సందర్శించారు. స్థానిక పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం హెలిప్యాడ్ ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు.

## ఆ వివరాలు 'హాక్ ఐ'లో నమోదు చేసుకోండి: డీజీపీ



**సాక్షి, హైదరాబాద్:** మెరుగైన భద్రత కోసం ఇంట్లో అద్దెకుండేవారు, పేయింగ్ గెస్టులు, పని మనుషుల పూర్తి వివరాలు తీసుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. ఆ వివరాలను హాక్ ఐ యాప్‌లో నమోదు చేసుకోవాలని గురువారం ట్వీట్ చేశారు. ఎలాంటి నేరాలు జరిగినా, ఈ వివరాలతో వారి ని పట్టుకోవడం సులభతరమవుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు బాధ్యత గల పౌరులుగా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

---

కాలుష్యానికి ఎలక్ట్రిక్ షాక్..

# వచ్చేస్తున్నాయి బ్యాటరీ బస్సులు!

**సాక్షి, హైదరాబాద్:** నగరంలో కాలుష్యం సంగతి మనకు తెలిసిందే.. వాహనాల సంఖ్య 60 లక్షలు దాటింది.. మెట్రో రైలు వచ్చాక.. వ్యక్తిగత వాహనాల విని

**నెల రోజుల్లో నగరానికి 309 బస్సులు**

యోగం కాస్త తగ్గినా.. అది ఆశించిన స్థాయిలో లేదు.. నెమ్మదిగా ఈ పరిస్థితి మారనుంది. ఎందుకంటే.. మరో నెల రోజుల్లో సిటీ రోడ్లపై 309 ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీయనున్నాయి. దీని వల్ల వాతావరణ కాలుష్య స్థాయి కొంత తగ్గుతుందని భావిస్తున్నారు..



**334లో 309 నగరానికే..**



వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో ఎలక్ట్రిక్ బస్సులను గరిష్ట సంఖ్యలో ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించి ఇటీవల రాయితీలను ప్రకటించింది. తాజాగా 'ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ ఇండియా(ఫేమ్)' పథకం రెండోదశలో భాగంగా తెలంగాణ ఆర్టీసీ పంపిన ప్రతిపాదనల మేరకు కేంద్రం 334 బ్యాటరీ బస్సులను మంజూరు చేసింది. గతంలో ఇదే పథకం కింద నగరానికి వంద బ్యాటరీ బస్సులను మంజూరు చేసినా.. 40 మాత్రమే వచ్చాయి. అన్నీ ఏసీవే కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి నడుపుతున్నారు. ఇప్పుడు వచ్చే 334 బస్సుల్లో 309 బస్సులను జంటనగరాల్లో సిటీ బస్సులుగా వాడతారు. మిగిలినవాటిని వరంగల్‌లో నడపాలని ఆర్టీసీ భావిస్తోంది.

**ఆర్టీసీకి కూడా ఊరట..**

ఆర్టీసీ కొంతకాలంగా కొత్త బస్సులు కొనటం లేదు. నిధులు లేకపోవటం వంటి సమస్యలు ఉన్నాయి. దాదాపుగా మనంతే జనాభా ఉన్న బెంగళూరులో 6,500 బస్సులుంటే, సిటీలో వాటి సంఖ్య 3,600. ఇప్పుడు ఈ ఎలక్ట్రిక్ బస్సుల రాకతో పరిస్థితి కొంచెం మెరుగుపడనుంది. ఏసీ బస్సులకు పెద్దగా ఆదరణ లేని నేపథ్యంలో నాన్ ఏసీ బస్సులనే తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. తొలిసారిగా నగరంలో నాన్ ఏసీ బ్యాటరీ బస్సులు రోడ్డెక్కబోతున్నాయి. ఇంతకుముందు లాగే ఈసారి కూడా అద్దె ప్రాతిపదికనే తీసుకోనున్నారు.

**ఖరీదు రూ. 1.75 కోట్లు..**

ఒక్కో బ్యాటరీ బస్సు ధర రూ.1.75 కోట్లు. గతంలో తీసుకున్న ఏసీ బస్సు ధర రూ.2.50 కోట్లు. అప్పట్లో కేంద్రం ఒక్కో బస్సుకు రూ.కోటి (33 శాతం ధర) చొప్పున రాయితీ ప్రకటించింది. ఇప్పుడు తీసుకోబోయే నాన్ ఏసీ బస్సుకు రూ.50 లక్షల చొప్పున రాయితీ ఇస్తోంది. ఆర్టీసీ వద్ద నిధులు లేకపోవటంతో ఖరీదైన ఈ బస్సులను కొనటం కష్టంగా మారింది. దీంతో ఆ రాయితీని ప్రైవేటు సంస్థలకు మళ్లించి వాటి నుంచి అద్దె ప్రాతిపదికన బస్సులను సమకూర్చుకుంటోంది. ఫలితంగా వాటి నిర్వహణ, డ్రైవర్ ఖర్చులన్నీ ప్రైవేటు సంస్థనే భరిస్తుంది. కి.మీ.కు నిర్ధారిత మొత్తాన్ని ఆర్టీసీ ఆ సంస్థకు చెల్లిస్తుంది.

# నదీ జలాలపై మా వైఖరి సరైనదే

- ఏపీ, తెలంగాణ సీఎంలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేసీఆర్
- విభజన అనంతరం ఈ పని ఎప్పుడో జరిగి ఉండాల్సిందని జగన్ వెల్లడి
- చర్చలు కొనసాగించాలని ఇరు రాష్ట్రాల సీఎంల నిర్ణయం
- ప్రగతి భవన్‌లో కేసీఆర్‌తో వైఎస్ జగన్ మర్యాదపూర్వక భేటీ

**సాక్షి, హైదరాబాద్:** నదీ జలాల విషయంలో తాము ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరి ముమ్మాటికీ సమంజసమైనది, సరైనదని ఏపీ, తెలంగాణ సీఎంలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కె.చంద్రశేఖర్‌రావు అభిప్రాయపడ్డారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో కేసీఆర్‌తో జగన్ సమావేశమయ్యారు. ఆయన వెంట ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ పక్షనేత పీవీ మిథున్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. సుహృద్భావ వాతావరణంలో రెండు గంటలకు పైగా చర్చలు జరిగాయి. గోదావరిలో ప్రస్తుతం వెల్లువెత్తిన వరద అంశం ఇద్దరి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. గోదావరిలో పోటెత్తుతున్న వరద గురించి గతంలో చర్చల సందర్భంగా అనుకున్నదే నిజమని తేలుతోందని వారు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

**సామరస్య ధోరణితో ముందుకెళ్లాలి**

తెలంగాణలో కొత్తగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు నీళ్లు పుష్కలంగా వచ్చిన విషయం కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేసీఆర్ మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... కృష్ణా, గోదావరి నదుల విషయంలో సామరస్యపూర్వక ధోరణితో ముందుకు వెళితే తప్ప ఉభయ రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించుకోలేమని జగన్, కేసీఆర్ అభిప్రాయపడ్డారు. విభజన అనంతరం ఉభయ రాష్ట్రాలు తమ సమస్యలపై ఎప్పటి నుంచో సామరస్య ధోరణితో ముందుకు వెళ్లి ఉంటే ప్రజలకు ఎంతో మేలు జరిగేదని జగన్ చెప్పారు. విభజన సమస్యలపై ఇప్పటికే రెండు రాష్ట్రాల అధికారుల మధ్య జరుగుతున్న చర్చలు, తర్వాత చేపట్టాల్సిన చర్యలపై సీఎంలు మాట్లాడుకున్నారు. వాటిపై ఇలాగే చర్చలు కొనసాగించాలని నిర్ణయించారు. జగన్ ప్రగతి భవన్‌కు చేరుకున్నప్పుడు కేసీఆర్ ఎదురేగి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. భేటీ ముగిసిన అనంతరం జగన్ విదేశీ పర్యటన విజయవంతం కావాలని కేసీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు.



## నరసింహన్‌తో జగన్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. దాదాపు గంట పాటు జరిగిన ఈ భేటీలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య సంబంధాలు, వర్తమాన రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం.

## భారత్‌లోకి రహస్యంగా..!

**ట్యూటికోరన్/న్యూఢిల్లీ:** మాల్దీవుల మాజీ ఉపాధ్యక్షుడు అహ్మద్ అదీబ్ అబ్దుల్ గఫ్ఫార్‌ను భారత్‌లో ప్రవేశించకుండా అధికారులు అడ్డుకున్నారు. బోటులో 9 మంది సిబ్బందితో కలసి సముద్ర మార్గం ద్వారా భారత్‌లో ప్రవేశించాలని అతడు ప్రయత్నించినట్లు అధికారులు వెల్లడించారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా రావడంతో ఆయన్ను కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. అతడు భారత్‌కు వస్తున్నట్లు తమకే సమాచారం అందలేదని జిల్లా పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గఫూర్ భారత్‌లో ప్రవేశించడంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. విదేశీయులు భారత్‌లోకి రావడానికి కొన్ని అధికారిక మార్గాలు ఉన్నాయని ఆ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ అన్నారు. గఫూర్ వాటి నుంచి కాకుండా వేరే మార్గంలో రహస్యంగా భారత్‌లో ప్రవేశించేందుకు ప్రయత్నించారన్నారు. భారత్‌లో ప్రవేశించేందుకు అతడికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

# చల్లని కబురు

▶ మొదటి పేజీ తరువాయి

రూపొందించే దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ) అంచనాలను ఐఎండీ గురువారం విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, దాదాపు 100% (8% అటు ఇటుగా) సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఆ నివేదికలో వెల్లడించింది. ఈ ఆగస్టు నెలలో 99%, సెప్టెంబరులో అంతకు మించి వర్షం కురుస్తుందని స్పష్టం చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల తటస్థంగా ఉన్న ఎల్‌నినో పరిస్థితులు క్రమంగా బలహీనపడి లానినా (అనుకూల) పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇవి రుతుపవనాల సీజను ముగిసే దాకా కొనసాగుతాయని ఐఎండీ వివరించింది. వారం రోజుల నుంచి ఉపరితల ఆవర్తనం, ద్రోణులు, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్ల ఈ సీజనులో చెప్పుకోదగిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్ల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

**ఆగస్టు, సెప్టెంబర్‌లపైనే ఆశలు**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం కూడా.. ఆగస్టు నెలలో 220 మిల్లీమీటర్లు, సెప్టెంబర్లో 161 మిల్లీమీటర్లు వర్షపాతం మొత్తంగా 100% నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. లేదంటే 8% హెచ్చుతగ్గులు కూడా ఉండొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకే రెడ్డి తెలిపారు. వాస్తవానికి ఈ వానాకాలం సీజన్ ఒడిదొడుకులతో ప్రారంభమైంది. జూన్ మొదటి వారంలో రావాల్సిన నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించాయి. జూన్ 21న రాష్ట్రమంతటా విస్తరించినప్పటికీ.. ఆశించినస్థాయిలో వర్షాలు పడలేదు. బలమైన అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తన ద్రోణులు ఏర్పడలేదు. దీంతో నైరుతి రుతుపవనాలు బలహీనంగా తయారయ్యాయి. అప్పుడప్పుడు వర్షం కురియటంతో 2నెలల్లో కూడా సాధారణ వర్షపాతం నమోదుకాలేదు. జులై నెలలో మూడు వారాలు గడిచే సరికి రాష్ట్రంలో 38% లోటు వర్షపాతం ఏర్పడింది. జులై చివరివారంలో వరుణుడు కరుణించటంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రంలో జూన్, జులై నెలల్లో కలిపి 375.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సిఉంది. కానీ 309.1 మిల్లీమీటర్ల వర్షపాతమే కురిసింది. రెండు నెలల సగటులో 18% లోటు వర్షపాతం ఉంది. కొమురంభీ ఆసిఫాబాద్ (16%), వరంగల్ అర్బన్ (6%), జగిత్యాల (4%)ల్లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన 30 జిల్లాల్లో కూడా లోటు వర్షపాతమే ఉంది.

**50 ఏళ్ల సగటు అంచనాతో..**

వానాకాలం ద్వితీయార్థంలో ఉన్న 2నెలల సాధారణ వర్షపాతాన్ని ఖరారు చేసేందుకు 50ఏళ్ల సగటును పరిగణనలోకి తీసుకున్నారు. 2నెలల్లో కలిపి 381 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఏ జిల్లాలో కూడా ప్రమాదకర పరిస్థితులు లేవు. 16 జిల్లాలు సాధారణ స్థాయిలో (+19% నుంచి −19%) ఉన్నాయి. మరో 11 జిల్లాలు లోటు −20% నుంచి 50%)లో ఉన్నాయి. ఈ లోటంతా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భర్తీ కావాల్సి ఉంది. అదేక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో సింహభాగం నిండలేదు. ఇవి నిండితేనే వరిసాగు గట్టెక్కే పరిస్థితులు ఉంటాయి. ఇదిలాఉండగా వర్షాలు ఆలస్యమైనా.. 98% సాధారణ వర్షపాతం సీజన్ ప్రథమార్థంలో నమోదవుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు అప్పట్లో ప్రకటించారు. కానీ అందుకు భిన్నమైన పరిస్థితులు రాష్ట్రంలో ఏర్పడ్డాయి. 2నెలల్లో కూడా లోటు వర్షపాతమే పడింది. అయితే ద్వితీయార్థానికి వాతావరణశాఖ అధికారుల చెబుతున్న అంచనాలు, పునఃప్రణాళిక ఏమేరకు నిజం అవుతుందా లేదా అనే ఆందోళన కూడా లేకపోలేదు.

# ఒక్క రోజులో 12 టీఎంసీలు

▶ మొదటి పేజీ తరువాయి

నిల్వ 43 టీఎంసీలకు చేరింది. ఒక్క రోజులో 12 టీఎంసీల కొత్త నీరొచ్చి చేరింది. గతేడాది ఇదే సమయానికి శ్రీశైలంలో 158 టీఎంసీలు ఉండగా, ఈ ఏడాది 115 టీఎంసీల మేర తక్కువగా నిల్వ ఉంది. అయితే ప్రస్తుతం ఎగువ నుంచి స్థిరంగా వరద వస్తుండటం, ఈ వరద మరో పది రోజుల పాటు కొనసాగినా ప్రాజెక్టులో నీటినిల్వలు భారీగా పెరగనున్నాయి. శ్రీశైలానికి వరద వస్తుండటంతో కల్వకుర్తి స్టేజ్–1 ద్వారా 3 పంపులను ఆరంభించి 2,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు.

**స్థిరంగా గోదావరి వరద**

ఇక గోదావరి బేసిన్‌లో మేడిగడ్డ వద్ద 2.50 లక్షల క్యూసెక్కుల (22.72 టీఎంసీలు) మేర వరద నమోదైంది. ఇక ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి స్థిరంగా వరద కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నం 21వేల క్యూసెక్కుల (1.9 టీఎంసీలు) మేర ప్రవాహం రాగా, అది సాయంత్రానికి 8,472 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం ఎల్లంపల్లిలో నిల్వ 20 టీఎంసీలకు గానూ 9 టీఎంసీలకు చేరింది. ఎల్లంపల్లిలోకి ప్రవాహాలు వస్తుండటంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌస్‌లను నిలిపివేశారు.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా.. (నిల్వ-టీఎంసీల్లో) (ఫ్లో క్యూసెక్కుల్లో)**

| ప్రాజెక్టు | పూర్తి నీటినిల్వ | ప్రస్తుత నీటినిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 109.02 | 1,60,000 | 2,13,453 |
| నారాయణపూర్ | 37.646 | 32.06 | 1,96,000 | 1,94,940 |
| జూరాల | 9.657 | 9.17 | 1,85,000 | 1,88,542 |
| శ్రీశైలం | 215.807 | 43 | 1,93,200 | 2,400 |
| నాగార్జునసాగర్ | 312.045 | 126.30 | 0 | 1001 |
| కడెం | 7.60 | 6.14 | 2,023 | 431 |
| ఎల్లంపల్లి | 20.18 | 8.87 | 21,138 | 0 |
| ఎస్సారెస్పీ | 90.31 | 5.66 | 338 | 232 |

**నిండుతున్న చెరువులు**

ఇక రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. కృష్ణా, గోదావరి బేసిన్‌లోని 43,840 చెరువుల్లో 2వేల చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఏకంగా 665 చెరువులు ఏకంగా అలుగులు పారుతున్నాయి. ఇందులో గోదావరి బేసిన్‌లోని చెరువులే 612 ఉండగా, కృష్ణాబేసిన్లో 53 చెరువులున్నాయి. మరికొన్ని రోజులు విస్తారంగా వర్షాలు కురిసే నేపథ్యంలో 50% పైగా నిండిన 2,595 చెరువులు మరికొన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో నిండే అవకాశాలున్నాయి.



జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

# అప్పులుంటే అసెంబ్లీ కట్టకూడదా?

▶ మొదటి పేజీ తరువాయి

ఆవిర్భావం జరిగే నాటికి రాష్ట్ర అప్పులు సుమారు రూ.70 వేల కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.1.90 లక్షల కోట్లకు పెరిగాయని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాష్ట్రానికి అప్పులుంటే నిర్మాణాలు చేయకూడదా, కేంద్రానికి కూడా అప్పులు ఉంటాయని, ఈ పరిస్థితుల్లో కేంద్రం కూడా నిర్మాణ రంగంలో ఏమీ చేయకూడదా అని ప్రశ్నించింది. ప్రతిపాదనలు, ప్రణాళికలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తనకు తోచినట్లుగా చేస్తోందని మరో న్యాయవాది రచనారెడ్డి చెప్పడంపై ధర్మాసనం.. హైకోర్టులో రాజకీయ ప్రసంగాల మాదిరిగా చెప్పవద్దని, ఉద్వేగభరితంగా చెప్పడానికి ఇదేమీ ప్రజావేదిక కాదని వ్యాఖ్యానించింది. ఇంకో న్యాయవాది నళిన్ కుమార్ వాదిస్తూ.. ప్రభుత్వం అసెంబ్లీ భవనాల్ని నిర్మిస్తే తమకేమీ అభ్యంతరం లేదని, వారసత్వ పురాతనమైన ఎర్రమంజిల్ భవనాన్ని కూల్చి ఆ ప్రదేశంలో నిర్మాణాలు చేస్తామనే అంశాన్నే వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎర్రమంజిల్ భవనం శిథిలావస్థకు చేరింది కదా.. అని ప్రశ్నించిన ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

## జెరూసలేం పర్యటనకు బయలుదేరిన ఏపీ సీఎం వైఎస్ జగన్

**5వ తేదీన తాడేపల్లికి తిరిగి రాక**

**సాక్షి, హైదరాబాద్:** ఏపీ సీఎం వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి జెరూసలేం పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఆయన ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు షెడ్యూల్

- ఎమ్మెల్యే కోటాలో స్థానాలకు ఎన్నిక ఆగస్టు 26న
- తెలంగాణలో ఒకటి, ఏపీలో మూడు స్థానాలకు..
- ఆగస్టు 7న నోటిఫికేషన్ విడుదల

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం షెడ్యూలు జారీ చేసింది. తెలంగాణ శాసనమండలిలో ఎమ్మెల్యే కోటాలోని ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి పదవీకాలం జూన్ 3, 2021 వరకు ఉండగా.. ఆయన సభ్యత్వం జనవరి 16, 2019న అనర్హతకు గురైనందున ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి ఆగస్టు 26న ఎన్నిక నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం తాజా షెడ్యూలులో పేర్కొంది. ఆగస్టు 7న ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీకానుంది. నామినేషన్లకు 14వ తేదీ వరకు గడువుంది. అలాగే ఆగస్టు 16 వరకు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణకు 19వ తేదీ గడువుగా నిర్దేశించారు. ఆగస్టు 26న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

**ఏపీలో మూడు స్థానాలకు**

ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ముగ్గురు సభ్యుల రాజీనామా నేపథ్యంలో ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఎమ్మెల్సీలు కరణం బలరామకృష్ణమూర్తి, ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), కోలగట్ల వీరభద్రస్వామిలు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన నేపథ్యంలో జూన్ 6, 2019న రాజీనామా చేశారు. వీరి పదవీకాలం మార్చి 29, 2023 వరకు ఉండగా మధ్యలోనే రాజీనామా చేయడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ ఎన్నిక ఆగస్టు 26న నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు జారీచేసింది.

ఇదం జగత్



## దివ్యాంగుడికి కేటీఆర్ ఆపన్నహస్తం



**సాక్షి, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన సందీప్‌కుమార్ అనే దివ్యాంగునికి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన వంతు సహాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. శారీరక వైకల్యమున్నప్పటికీ నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో ఏమాత్రం వెనకడుగు వేయని సందీప్, సొంతంగా కంప్యూటర్ ఆపరేట్ చేయడం నేర్చుకోవడమే కాకుండా స్వయంగా ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను ఉపయోగించే విధానాన్ని నేర్చుకున్నాడు. ఈ నైపుణ్యంతోనే ఉపాధికి సంబంధించి తనకు ఏదైనా సహాయం చేయాలంటూ కేటీఆర్‌కు ట్వీట్ చేశాడు. గురువారం తెలంగాణ భవన్‌లో సందీప్‌ను కలుసుకున్న సందర్భంగా సొంతంగా ట్విట్టర్ అకౌంట్ తెరవడం, సామాజిక మాధ్యమాలను ఉపయోగించడాన్ని తెలుసుకుని కేటీఆర్ ఆశ్చర్యపోయారు. కుమారుడికి ఏదైనా దారి చూపాలంటూ అతని తల్లి లక్ష్మి కోరడంతో వారి గ్రామంలోనే సందీప్‌కు డేటా ఎంట్రీ ద్వారా ఉపాధి అవకాశాన్ని కల్పించేందుకు సహాయపడతానని కేటీఆర్ హామీనిచ్చారు. సందీప్ కుటుంబం పేదరికంలో ఉండటంతో గృహ నిర్మాణ పథకం కింద ఒక ఇంటిని కేటాయిస్తామని హామీనిచ్చారు. కేటీఆర్‌ను కలుసుకోవడం పట్ల సందీప్ సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

## అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను సస్పెండ్ చేయాలి: తమ్మినేని



**సాక్షి, హైదరాబాద్:** ఆయుర్వేద వైద్య విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏసీపీ స్థాయి అధికారితో పాటు సీఐ, కానిస్టేబుళ్లు విద్యార్థినుల పట్ల దురుసుగా వ్యవహరించినా, ఉద్దేశ పూర్వకంగా అలా చేసి ఉండకపోవచ్చని డీజీపీ సమర్థించుకోవడం బాధ్యతారాహిత్యమని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. చార్మినార్ ఆయుర్వేద ఆసుపత్రిని ఎర్రగడ్డలోని డా.బీఆర్ అంబేడ్కర్ ఆయుర్వేద కాలేజీకి తరలించొద్దని ధర్నా చేస్తున్న విద్యార్థినులను మగ పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. చార్మినార్ ఆసుపత్రిని అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయండి

### ప్రభుత్వాన్ని కోరిన బీసీ సంక్షేమ సంఘం



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. గురువారం సచివాలయంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషితో సమావేశమయ్యారు. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల కొరతతో పలు కార్యక్రమాలు స్తంభించిపోతున్నాయని తెలిపారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ఉద్యోగుల కొరత ఉందన్నారు. గ్రూప్ 1, 2, 3, 4 కేటగిరీల్లో పెద్ద సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నందున వాటిని వీలైనంత త్వరితంగా భర్తీ చేస్తేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. మరోవైపు పదవీ విరమణ చేసిన ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలని, వారితో శాఖాపరంగా సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన గణాంకాలను ప్రభుత్వానికి సమర్పించారు. సీఎస్‌తో జరిగిన సమావేశంలో బీసీ సంఘం ప్రతినిధులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, కోట్ల శ్రీనివాస్, రామకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కమిషన్ బిల్లు అప్రజాస్వామికం

### టీపీసీసీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు పూర్తిగా అప్రజాస్వామికంగా ఉందని, పేద ప్రజలను వైద్యానికి దూరం చేసే ఈ బిల్లు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే విధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. టీపీసీసీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఆధునిక మెడిసిన్‌ను ప్రోత్సహించకుండా యోగా గురువులిచ్చే మందులను ప్రోత్సహించే విధంగా బిల్లు ఉందని, మెడికల్ కౌన్సిల్‌ను రద్దు చేయడం వెనుక కూడా దురుద్దేశం ఉందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని ఆసుపత్రుల పరిస్థితి దారుణంగా ఉందని, నిధుల కొరతతో ఆసుపత్రులు చతికిలబడి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో వైద్య విద్యార్థులు చేసే పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని కవ్వంపల్లి చెప్పారు.

## గవర్నర్‌కు కాగ్ నివేదిక

**సాక్షి, హైదరాబాద్:** కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) గురువారం 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితి, పద్దులు, బడ్జెట్ కేటాయింపులు, నిధుల వినియోగంపై రూపొందించిన ఆడిట్ నివేదికను గవర్నర్ నరసింహన్‌కు సమర్పించింది. రాజ్యాంగంలోని 151వ అధికరణను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ పద్దులపై కాగ్ ఈ నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. త్వరలో జరగనున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నివేదికను ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టనుంది.

## ‘సీఎం హెచ్చరికలు ఆందోళనకరం’

**సాక్షి, హైదరాబాద్:** కరెంట్ బిల్లులు కట్టకపోతే స్థానిక సంస్థలు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, సర్పంచ్‌లు, చైర్‌పర్సన్‌తో పాటు అధికారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ హెచ్చరించడం ఆందోళనకరమని పట్నం (తెలంగాణ పట్టణ ప్రాంతాల అభివృద్ధి వేదిక) ఖండించింది. స్థానిక సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి, ప్రత్యేక కేటాయింపులు చేయాలని సీపీఎం నేత నర్సింహారావు డిమాండ్ చేశారు. హైదరాబాద్ వాటర్ వర్క్స్, సేవరేజ్ బోర్డు, కార్పొరేషన్లు మున్సిపల్ పట్టణాలకు రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రాపర్టీ ట్యాక్స్, నీటి సరఫరా బిల్లులు చెల్లింపులు చేయకుండా వందల కోట్లు బకాయిలు పడ్డాయని పేర్కొన్నారు.

## ఎస్టీయూ అధ్యక్షుడిగా పర్వతరెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) అధ్యక్షుడిగా ఎం.పర్వతరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్ తెలిపారు. ఇప్పటివరకు ఎస్టీయూ అధ్యక్షుడిగా ఉన్న బి.భుజంగరావు జూలై 31న రిటైరవ్వడంతో ఆయన స్థానంలో పర్వతరెడ్డిని ఎన్నుకున్నామన్నారు. గురువారం పర్వతరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## రైతు కుటుంబాలకు 14 కోట్ల పరిహారం

**సాక్షి, హైదరాబాద్:** ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 14.58 కోట్ల పరిహారాన్ని విడుదల చేసింది. అప్పులు, వ్యవసాయంలో నష్టాలు రావడంతో బలవన్మరణానికి పాల్పడిన 243 మంది అన్నదాతల కుటుంబాలకు సాయం అందజేసే ఉత్తర్వులను గురువారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్వర్ తివారి జారీ చేశారు. ఆర్డీఓ, డీఎస్పీ, వ్యవసాయశాఖ అధికారితో కూడిన త్రిసభ్య కమిటీ గుర్తించిన ఆయా కుటుంబాలకు ఈ పరిహారం అందనుంది.

## ఇద్దరు సైనికులకు నగదు పురస్కారం

**సాక్షి, హైదరాబాద్:** విధి నిర్వహణలో అసాధారణ సేవలందించి సేనల్ పతకానికి ఎంపికైన ఇద్దరు సైనికులకు గతంలో మంజూరు చేసిన నగదు పురస్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యంతో పోరాడుతూ ప్రాణాలర్పించిన వీర సైనికుడు మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ భార్య నస్రీన్ ఖాన్‌కు గతంలో సేనల్ పథకం కింద రూ.23,250 నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం చెల్లించింది. తాజాగా ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంచింది. మిగిలిన రూ.29,76,750లను ఆమెకు చెల్లించాలని ఆదేశిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి అధర్ సిన్హా గురువారం ఉత్తర్వులిచ్చారు. మరో సైనికుడు అక్కుల బాలకృష్ణకు సైతం ఇదే తరహాలో రూ.29,76,750 నగదు పురస్కారాన్ని చెల్లించాలని మరో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# అభివృద్ధిపై విస్తృత ప్రచారం

### ప్రభుత్వ కార్యక్రమాలపై హైదరాబాద్ ప్రజలకు వివరించండి

- రాజధానిలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కేటీఆర్ సూచన
- ఈ నెల 10లోగా గ్రేటర్‌లో సభ్యత్వం ముగించాలి...
- 10 నుంచి 20 నాటికి బస్తీ, డివిజన్ కమిటీలు వేయాలి
- ప్రతి కమిటీలో కనీసం 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు
- నాలుగు ఎంపీ సీట్ల పరిధిలో సభ్యత్వ నమోదుపై సమీక్ష



సభ్యత్వం తీసుకున్నందుకు వెంకటరమణకు ఫోన్ చేసి ధన్యవాదాలు తెలుపుతున్న కేటీఆర్. చిత్రంలో మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై హైదరాబాద్ నగర ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు చేరుకున్నాయని, కాళేశ్వరం వల్ల నగర నీటి అవసరాలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉంటుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపు వల్లే నగరంలో తాగునీటితోపాటు విద్యుత్ కొరత లేదని చెప్పారు. రాజకీయంగానూ నగరంలో టీఆర్‌ఎస్‌కు ఎదురులేదని, ప్రజల్లోనూ పార్టీపట్ల అభిమానం ఉందన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యేలకు సూచించారు. గురువారం తెలంగాణ భవన్‌లో సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాలవారీగా కేటీఆర్ సమావేశం నిర్వహించారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా సభ్యత్వ నమోదు జరుగుతున్న తీరును ఆయన సమీక్షించారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాలకు 50 వేల సభ్యత్వ నమోదు పుస్తకాలు చేరుకున్నాయని, చాలా వరకు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతున్నదని కేటీఆర్‌కు ఎమ్మెల్యేలు తెలియజేశారు. అన్ని పుస్తకాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, సగానికిపైగా పుస్తకాలు డిజిటలీకరణ కేంద్రాలకు చేరుకున్నాయని వారు తెలిపారు. ఈ నాలుగు ఎంపీ నియోజకవర్గాల పరిధిలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 10లోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేలకు కేటీఆర్ సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వ నమోదును లక్ష్యంగా నిర్దేశించారు. ఈ పది రోజుల్లో పూర్తిస్థాయిలో సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసేలా చూడాలని ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలను ఆదేశించారు. ఈ నెల 10 నుంచి 20లోగా బూత్, డివిజన్ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. నగరంలో దాదాపు 2 వేల నోటిఫైడ్ స్లమ్స్ ఉన్నాయని, ఈ మేరకు ప్రతి బస్తీకి ఒక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. 20వతేదీ నాటికి బస్తీ కమిటీలతోపాటు డివిజన్ కమిటీలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కమిటీలో అందరూ క్రియాశీలక సభ్యులే ఉండాలన్నారు. కనీ సం 15 మంది సభ్యులు, గరిష్టంగా 33 మంది సభ్యులు కమిటీలో ఉండవచ్చని కేటీఆర్ చెప్పారు. ఈ కమిటీల్లో కనీసం 50 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారే ఉండాలన్నారు. కమిటీల ఏర్పాటులో భాగంగా అనుబంధ సంఘాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే లక్ష్యం పూర్తి చేసిన జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో త్వరలోనే కమిటీలు వేయాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, సుధీర్‌రెడ్డిలకు సూచించారు. లక్ష మంది సభ్యత్వ లక్ష్యంతో పనిచేస్తున్న మేడ్చల్ నియోజకవర్గంలోనూ చురుగ్గా సభ్యత్వం నడుస్తున్నదని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. ఈ సమావేశం నుంచే పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభ్యులుగా చేరిన కొందరితో కేటీఆర్ స్వయంగా మాట్లాడారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. సభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నదని, కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా హైదరాబా ద్‌లోని కొండాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న అంజయ్యనగర్‌లో టీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకున్న వెంకటరమణ అనే వ్యక్తితో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి సభ్యత్వ నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంత్రు లు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# అందరికీ ‘రూ.10 లక్షలు’ ఇవ్వండి

- సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క డిమాండ్
- రాష్ట్రంలోని అన్ని కుటుంబాలను ఒకేవిధంగా చూడాలి
- లేదంటే రూ.10 లక్షల కోసం ప్రజలను సమాయత్తం చేస్తాం



**సాక్షి, హైదరాబాద్:** కులం, ఆదాయంతో సంబంధం లేకుండా సీఎం కేసీఆర్ తన స్వగ్రామం చింతమడకలో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించిన విధంగానే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) నేత మల్లు భట్టివిక్రమార్క డిమాండ్ చేశారు. చింతమడక గ్రామస్తులకు రూ.10 లక్షలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా హాల్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ఖజానా నుంచి ఖర్చు చేసే ప్రతి పైసా తన, పర భేదం లేకుండా రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని ఖర్చు చేయాలన్నారు. రాగద్వేషాలకు అతీతంగా పాలన చేస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని కుటుంబాలను ఒకేవిధంగా చూడాలని కాంగ్రెస్‌పార్టీ కోరుతోందన్నారు. అలాచేయని పక్షంలో రాష్ట్ర ప్రజల్లో ప్రభుత్వంపై ద్వేషం పెరిగి అశాంతి నెలకొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అవసరమైతే ఆ పథకానికి ‘చింతమడక 10 లక్షల పథకం’అని పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు పెట్టుబడి కింద ఆ డబ్బులు ఉపయోగపడతాయని చెప్పారు. కేసీఆర్‌కు ఓట్లేసే కుటుంబాలకే ఈ పథకాన్ని వర్తింపజేయడం అన్యాయమన్నారు. రాష్ట్రంలోని అర్హులైన అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని పొందేలా ప్రజలను సమాయత్తం చేస్తామని భట్టి చెప్పారు.

**ప్రాజెక్టుల వివరాలన్నీ చూపించండి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వస్తున్న గోదావరి నీటిని చూపేందుకు మీడియా ప్రముఖులు, ఎడిటర్లను కాళేశ్వరం తీసుకెళ్లాలని సీఎం నిర్ణయించిన నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలనూ చూపించాలని భట్టి డిమాండ్ చేశారు. అంచనాలు, టెండర్లు, ప్రాజెక్టు కోసం తీసుకున్న అప్పులు, బ్యాంకులకు ఇచ్చిన గ్యారంటీలు, ప్రాజెక్ట్ డీపీఆర్‌ను మీడియా ప్రముఖులకు చూపాలని కోరారు.

**నిర్వాసితుల గోడు వినాలి**

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతుల వ్యథను కూడా మీడియా ప్రతినిధులకు చూపించాలని కోరారు. సరైన పునరావాస చర్యలు తీసుకోకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను మీడియా గమనించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు తమ ప్రాంతం నుంచి వెళ్తుందనే పేరే తప్ప మంథని, రామగుండం, పెద్దపల్లి ప్రజలకు ప్రయోజనం లేదని, కాళేశ్వరం ముక్తేశ్వరం ఎత్తిపోతల పథకం పేరుతో నాటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రారంభించిన 60 శాతం మేర పనులైన పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

# వాపును చూసి బలుపు అనుకుంటున్నారు

- బీజేపీపై టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ధ్వజం
- బీజేపీ నేతలకు దమ్ముంటే కాళేశ్వరానికి జాతీయ హోదా తేవాలని సవాల్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని, టీఆర్‌ఎస్ స్థాయికి ఆ పార్టీ చేరుకోలేదని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్ అన్నారు. నాలుగు ఎంపీ సీట్లు గెలవగానే బీజేపీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వాపును చూసి బలుపు అనుకుంటున్నారని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటున్నారన్నారు. రాష్ట్రంలో మత రాజకీయాలకు స్థానం లేదన్న విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ గ్రహించాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తెప్పించడం చేతకాని రాష్ట్ర బీజేపీ నేతలు అధికారం గురించి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలకు దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇప్పించాలని సవాల్ విసిరారు. తెలంగాణకు ఉపయోగపడే ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధులు తెస్తే తప్ప బీజేపీ నేతలను ఎవరూ నమ్మరన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణలో జరుగుతున్నట్టుగా సంక్షేమం అమలవుతోందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ కూడా ఐసీయూలోనే ఉందన్న విషయాన్ని లక్ష్మణ్ గ్రహించాలన్నారు. గురువారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ, సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై లక్ష్మణ్ అనవసరంగా నోరు పారేసుకోవద్దని హెచ్చరించారు. గాలి మాటలతో కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శిస్తే తెలంగాణలో బీజేపీ బలపడదన్న విషయాన్ని లక్ష్మణ్ గ్రహిస్తే మంచిదన్నారు. కేంద్ర మంత్రులు, అధికారులు టీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరును మెచ్చుకుంటుంటే లక్ష్మణ్ మాత్రం విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథను మెచ్చుకుంటూ ఆయనకు నోబెల్ బహుమతి ఇచ్చినా తప్పు లేదని ఇటీవలే కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి స్థాయి అధికారి బిపిన్ చంద్ర పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 103 స్థానాల్లో డిపాజిట్లు దక్కలేదని, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో 8 జెడ్పీటీసీ సీట్లు మాత్రమే గెలిచిందన్నారు. గతంలో బీజేపీకి ఐదుగురు ఎమ్మెల్యేలుంటే ఇప్పుడు కేవలం ఒక స్థానానికి పరిమితమయ్యారన్నారు.

# మహిళా గ్రూపుల ఉమ్మడి వ్యవసాయం

### ప్రణాళికలు రూపొందించాలని ‘సెర్ప్’కు మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలు



**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర పెరుగుతున్నందున వారి ద్వారా ఉమ్మడి వ్యవసాయం చేసేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా కారం, పసుపు వంటి వ్యవసాయ రంగ ఉత్పత్తులను ఎగుమతి చేసే కార్యక్రమాలను మహిళా సంఘాల ద్వారా చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర పెరిగిందని గ్రామాల్లో పూర్తిగా వారే అన్ని సాగు పనులు నిర్వహిస్తున్నందున ఆసక్తి ఉన్న మహిళా గ్రూపులను ఎంపిక చేసి ఉమ్మడిగా వ్యవసాయం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కూరగాయలు, మాంసం విక్రయాలు వంటివి మహిళా సంఘాలు నిర్వహించేలా చూడాలని, సేంద్రియ సాగును పెంచాలని సూచించారు. గురువారం సచివాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యక్రమాలపై మంత్రి సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమాలను విస్తరించాలని, మహిళా సాధికారతతోపాటు, వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా మార్చాలన్నారు. మహిళా గ్రూపులను, అందులోని సభ్యులను గుర్తించి వారి సామర్థ్యం, ఆసక్తి ప్రకారం వారికి పథకాలను అమలు చేసే బాధ్యత అప్పగించాలన్నారు. ఎక్కువ మందికి ఉపాధి కల్పించేలా ఉండాలని, అన్ని మహిళా గ్రూపులు కచ్చితంగా క్రియాశీలకం ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. గ్రూపులలోని ప్రతి మహిళకు రుణం అంది తద్వారా వారు అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. ఈ ఏడాది 1680 గ్రామాల్లో ‘న్యూట్రీ విలేజ్’కార్యక్రమం మొదలుపెట్టినట్టు, వచ్చే ఏడాది ప్రతి మండలంలోనూ ఈ కార్యక్రమం అమలు కావాలని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఫుడ్ ప్రాసెస్ రంగం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

**స్త్రీనిధి సభ్యురాలు మరణిస్తే అంత్యక్రియలకు తక్షణ ఆర్థిక సాయం..**

స్త్రీనిధి లోన్ సురక్ష పథకం విస్తరణలో భాగంగా ఎవరైనా సభ్యురాలు దురదృష్టవశాత్తు మరణిస్తే అదే రోజు అంత్యక్రియలకు వెంటనే రూ.5 వేలు సహాయాన్ని అందిస్తున్నట్టు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈ సదుపాయం గురువారం నుంచే అమలులోకి వస్తున్నట్టు ప్రకటించారు.

# ప్రక్షాళన ‘సాగు’తోంది!

- పట్టాదార్ పాస్‌బుక్కుల కోసం రైతాంగం ఎదురుచూపులు
- పెండింగ్‌లోనే 3.43 లక్షల ఖాతాల పాస్ పుస్తకాలు..
- తేలని 3.73 లక్షల ఖాతాల భవితవ్యం

**సాక్షి, హైదరాబాద్:** రెండేళ్ల క్రితం మొదలైన భూ రికార్డుల ప్రక్షాళన ఇంకా కొలిక్కి రాలేదు. ఇది నిరంతర ప్రక్రియే అయినా.. పాత సమస్యలను అధిగమించడంలో రెవెన్యూ యంత్రాంగం చతికిలపడింది. ఇప్పటికీ 94 శాతం మాత్రమే రికార్డుల నవీకరణ జరిగింది. పార్ట్–బీ కేటగిరీలో చేర్చిన ఖాతాలను పరిష్కరించేలా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో 3.73 లక్షల ఖాతాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 61,13,916 ఖాతాలుండగా.. వివాదరహిత భూములుగా గుర్తించిన 57,69,933 ఖాతాలకు సంబంధించి డిజిటల్ సంతకాలు జరిగాయి. ఇందులో ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ (పట్టణ) జిల్లాలు ముందంజలో ఉన్నాయి. ఈ జిల్లాల పరిధిలో క్లియర్ ఖాతాలుగా తేల్చిన వాటిలో ఏకంగా 98% మేర డిజిటల్ సంతకాలు పూర్తయ్యాయి. రికార్డుల ప్రక్షాళనలో వికారాబాద్, ములుగు, మేడ్చల్ జిల్లాలు బాగా వెనుకబడ్డాయి. ఈ జిల్లాల్లో కేవలం 90 శాతం మాత్రమే డిజిటల్ సంతకాలయ్యాయి. దీంతో ఈ జిల్లాల్లోని రైతాంగం పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం తహసీల్దార్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది.

**ఆధార్ వివరాలివ్వని 1.74 లక్షల మంది**

పాస్ పుస్తకాల జారీకి తప్పనిసరిగా భావించే ఆధార్ వివరాలను సమర్పించకపోవడంతో 1.74 లక్షల పట్టాదార్లకు పాస్‌బుక్కులు జారీకాలేదు. అలాగే ఆధార్ సంఖ్యను ఇచ్చినా కూడా 1.69 లక్షల ఖాతాలకు డిజిటల్ సంతకాలు పెండింగ్‌లో ఉండడంతో ఆధార్ ఇవ్వని/ఇచ్చిన 3.43 లక్షల ఖాతాల పాస్ పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు మ్యుటేషన్లు, పౌతీ, నోషనల్ ఖాతాలు పెండింగ్, ఖాతాల సవరణల పెండింగ్‌లో ఉండడం కూడా పాస్ పుస్తకాల జారీ ఆలస్యం కావడానికి కారణంగా రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

**కొలిక్కిరాని పార్ట్–బీ వ్యవహారం..**

భూ యాజమాన్య హక్కులపై స్పష్టతనివ్వకపోవడంతో లక్షలాది మంది రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పార్ట్–బీ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారం తేల్చకపోవడంతో రెవెన్యూ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కేటగిరీ భూములపై మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ఎడతెగని జాప్యం జరుగుతోంది. తొలి విడతలో వివాదరహిత భూములకు మాత్రమే పాస్ పుస్తకాలను జారీ చేసిన సర్కారు.. పార్ట్–బీ కేటగిరీలో ప్రభుత్వ భూములు/ఆస్తులు, అటవీ భూములు, దేవాదాయ తదితర భూములతో పాటు, వ్యవసాయేతర భూములను చేర్చింది. భూవిస్తీర్ణంలో తేడా, కోర్టు కేసులు, కుటుంబసభ్యుల భూపంపకాల్లో విస్తీర్ణంలో వ్యత్యాసం, అసైన్డ్ చేసిన భూమికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి తేడా, ఫారెస్టు, రెవెన్యూ శాఖల మధ్య తగాదా, ఫారెస్టు, పట్టా భూముల మధ్య వివాదస్పదమైన వాటిని కూడా పార్ట్–బీలో నమోదు చేసింది. వీటిని సత్వరమే సవరించి పరిష్కారమార్గం చూపాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం.. పెట్టుబడి సాయం అందించాలనే తొందరలో ఈ కేటగిరీ భూముల జోలికి వెళ్లలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 3,73,051 ఖాతాలకు మోక్షం కలగలేదు.

**భూ రికార్డుల ప్రక్షాళన గణాంకాలివే**

| | |
|---|---|
| మొత్తం వ్యవసాయ ఖాతాలు: | 61,13,916 |
| డిజిటల్ సంతకాలు చేసినవి: | 57,69,933 |
| డిజిటల్ సంతకాలు కానివి: | 3,43,983 |
| పార్ట్ బీ ఖాతాలు: | 3,73,051 |
| వ్యవసాయేతర/ ప్రభుత్వ భూముల ఖాతాలు: | 6,84,529 |

# రెండో స్థానంలో మేమే.. కాదు మేమే!

### రాష్ట్రంలో జాతీయ పార్టీల పోరు

- కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రకటనలతో రక్తి కడుతున్న రాజకీయం
- రాష్ట్రంలో హస్తం పార్టీ పనైపోయిందంటున్న కమలనాథులు
- బీజేపీ 4 సీట్లు వాపే.. బలుపు కాదని కాంగ్రెస్ కౌంటర్
- ‘వాళ్లే తేల్చుకోనీ’ అంటున్న గులాబీ దళం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల మధ్య పోరు ఆసక్తికరంగా సాగుతోంది. టీఆర్‌ఎస్‌కు తామంటే తామే ప్రత్యామ్నాయమంటూ కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడుతున్న తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఇరుపార్టీల నేతల పోటాపోటీ ప్రకటనలు, మాటల యుద్ధాలతో కొన్ని రోజులుగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఈ రెండు పార్టీల ‘ప్రత్యామ్నాయ’ప్రతిపాదనలు, అది ఖరారు చేసుకునేందుకు పడుతున్న ఆపసోపాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయమని చెప్పుకునేందుకు రెండు పార్టీల నేతలు ఎక్కడా తగ్గకుండానే తమ ప్రయత్నాలు కొనసాగిస్తుండడం గమనార్హం.

**ఐసీయూ, టులెట్ బోర్డులు**

లోక్‌సభ ఎన్నికల్లో 4ఎంపీ స్థానాలను గెలవడంతోపాటు కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన జోష్‌లో ఉన్న బీజేపీ.. త్వరలోనే రాష్ట్రంలో పాగా వేస్తామని ధీమాగా చెబుతోంది. టీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని, ఆ పార్టీని నాలుగు దిక్కులకు పంపేందుకే తమ పార్టీకి చెందిన నలుగురు ఎంపీలు గెలిచారని బీజేపీ నేతలంటున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కు టులెట్ బోర్డు పెట్టుకోవాల్సిందేనని, ఆ పార్టీ ఐసీయూలో ఉందని వ్యాఖ్యానించడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందనే సంకేతాలిచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణపై దృష్టి కేంద్రీకరించారని, త్వరలోనే పెద్ద ఎత్తున చేరికలుంటాయని, అందులో కాంగ్రెస్‌తో పాటు టీఆర్‌ఎస్ నేతలు కూడా ఉంటారనే చాలా కాలంగా బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో బిజీగా ఉన్న బీజేపీ నేతలు తాము చాపకింద నీరులా విస్తరిస్తున్నామనే సంకేతాలను ప్రజల్లోకి పంపడంలో కొంత మేర సఫలీకృతమయ్యారనే భావన రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. తాము టార్గెట్ చేస్తే గురి తప్పదని, ఎట్టి పరిస్థితుల్లో 2023 నాటికి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని బీజేపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

**తిప్పికొడుతున్న కాంగ్రెస్**

బీజేపీ ప్రత్యామ్నాయ వ్యూహాలను తమ క్షేత్ర స్థాయి బలంతో తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ కూడా అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. బీజేపీకి క్షేత్రంలో బలం లేదని, 4 ఎంపీలు లాటరీలో గెలిచారని, అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ కేవలం నాలుగంటే నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లోనే గెలిచిందనే విషయాన్ని గమనించాలని వారంటున్నారు. అదే ఎన్నికల్లో తాము 29% ఓట్లు సాధించామని, టీఆర్‌ఎస్‌ను ధీటుగా ఎదుర్కొన్నామని అంటున్నారు. అంతకు ముందు జరిగిన సర్పంచ్ ఎన్నికలు, అంతకన్నా ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు, సీట్లు రాష్ట్రంలో బీజేపీ పరిస్థితికి అద్దంపడుతున్నాయని ఎద్దేవా చేస్తున్నారు. కేంద్రంలో అధికారం ఉండి, 4 ఎంపీ స్థానాల్లో గెలిచినంత మాత్రాన బీజేపీది వాపే కానీ.. బలుపు కాదని, తెలంగాణలో ఆ పార్టీ పప్పులు ఉడకవని అంటున్నారు. ఎప్పటికైనా టీఆర్‌ఎస్‌ను తామే ఓడిస్తామని, ఆ శక్తి తమకు మాత్రమే ఉందని, ఈ విషయం రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తేలిపోతుందని కాంగ్రె స్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

**ఆ.. మాకెందుకులే!**

ఈ విమర్శలను టీఆర్‌ఎస్ నిశ్శబ్దంగా గమనిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ప్రతికూల ఫలితాల కారణంగా అక్కడక్కడా బీజేపీపై చెణుకులు విసురుతున్న గులాబీ నేతలు ఆ రెండు పార్టీలే తేల్చుకోనీ అనే ధోరణిలోనే వెళ్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టి సందర్భంగా మున్సిపల్ ఎన్నికలలో సింహభాగం తామే గెల్చుకుంటామని, రెండో స్థానంలో ఎవరుంటారనేది ఆ రెండు పార్టీలే తేల్చుకోవాలన్నారు. ఇదే ధోరణిలో రాష్ట్రస్థాయి నేతల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న టీఆర్‌ఎస్ కేడర్ వరకు.. కాంగ్రెస్, బీజేపీల వ్యవహారశైలిని చూసీ చూడనట్టే వ్యవహరిస్తున్నారు.

**ఇద్దరూ జత కడుతున్నారు**

ఇదిలా ఉంటే.. అధికార టీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే క్రమంలో రెండు జాతీయ పార్టీలు ఆసక్తికర అంశాలను లేవనెత్తుతున్నాయి. టీఆర్‌ఎస్‌తో కలిసి కాంగ్రెస్ పని చేస్తోందని బీజేపీ, టీఆర్‌ఎస్–బీజేపీలది నకిలీ యుద్ధమని కాంగ్రెస్ నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. టీఆర్‌ఎస్–బీజేపీల బంధంపై చాలా కాలం నుంచి కాంగ్రెస్ ఆరోపణలు చేస్తుండగా, తమ బలం పెరగకుండా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు టీఆర్‌ఎస్‌తో జత కడుతున్నారని బీజేపీ కొంతకాలంగా విమర్శిస్తోంది. మొత్తం మీద అధికార టీఆర్‌ఎస్‌కు రాజకీయ ప్రత్యర్థులుగా నిరూపించుకునేందుకు ఈ రెండు పార్టీలు అనుసరిస్తున్న వ్యూహాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి.

# డూడుల్ గీయండి... లక్షలు పట్టండి

**న్యూఢిల్లీ:** విద్యార్థులూ.. మీరు చక్కగా బొమ్మలు వేయగలరా? అయితే గూగుల్ ఓ కొత్త ఆఫర్‌తో మీ ముందుకు వచ్చింది. మీరంతా గూగుల్ వెబ్‌సైట్ తెరవగానే గూగుల్ లోగోపైన డూడుల్ చూసే ఉంటారు. ఏ రోజు ప్రాముఖ్యతను ఆ రోజు చిన్న కార్టూన్ రూపంలో అది సూచిస్తుంది. ఇప్పుడు మీరు గీయబోయే చిత్రం ఆ డూడుల్ స్థానంలో కనిపించనుంది. నవంబర్ 14న 'బాలల దినోత్సవాన్ని' పురస్కరించుకొని ప్రత్యేకంగా తయారు చేయనున్న డూడుల్‌కు కార్టూన్లు వేయాల్సిందిగా గూగుల్ కోరుతోంది. ఇది కేవలం మీ డూడుల్ కనిపించేలా చేయడమే కాదండోయ్.. అయిదు లక్షల క్యాష్‌ను కూడా మోసుకొస్తుంది. 'నేను పెద్దయ్యే సరికి.. నేనేం ఆశిస్తున్నానంటే' అన్న అంశం మీద డూడుల్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. ఈ అంశం కింద, మీకు ఉన్న ఏ ఆలోచనకైనా రూపం ఇవ్వచ్చు. ఉదాహరణకు చంద్రుడి మీద జీవితం ఎలా ఉంటుంది? భూమ్మీద కాలుష్యం లేకపోతే ఎలా ఉంటుంది? భూమి అంతా సాధు జంతువులతో నిండిపోతే ఎలా ఉంటుంది ? వంటి ఏ అంశం మీదైనా డూడుల్ తయారు చేయవచ్చు.డూడుల్‌లో కచ్చితంగా 'జీఓఓజీఎల్‌ఈ' అన్న గూగుల్ స్పెల్లింగ్ ఉండాలి.

**ఎంపిక ఇలా...:** మొదట మీరు గీసిన చిత్రాలన్నింటినీ గూగుల్ బృందం ఎంపిక చేస్తుంది. ఈ బృందంలో బాగా డూడుల్స్ తయారుచేసే నేహా డూడుల్స్ మేడం, యూట్యూబ్‌లో టాలెంట్ చూపించే ప్రజక్త కోళి, మనందరికీ ఇష్టమైన ఛోటా భీమ్ బొమ్మ గీసిన రాజీవ్ చికాల కూడా ఉన్నారు. వీరంతా మేటిగా ఉన్న 20 చిత్రాలను ఎంపిక చేస్తారు. వీటిని అక్టోబర్ 21 నుంచి నవంబర్ 6 వరకు పబ్లిక్ ఓటింగ్‌లో ఉంచుతారు. గెలిచిన వారికి 5 లక్షల స్కాలర్‌షిప్‌తో పాటు రూ. 2 లక్షల విలువైన సాంకేతికతను మీ పాఠశాలకు ఇస్తారు.



వర్షపు నీరు భారీస్థాయిలో ముంచెత్తడంతో చెరువును తలపిస్తున్న గుజరాత్‌లోని వడోదర పట్టణ రహదారులు. గుజరాత్‌తోపాటు జమ్మూ కశ్మీర్, రాజస్తాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోనూ భారీవర్షాలు కురిశాయి

# 'మెడికల్' బిల్లుకు రాజ్యసభ ఆమోదం

- ఎంసీఐ స్థానంలో ఇక నేషనల్ మెడికల్ కమిషన్
- 25 మంది సభ్యులు; వారిలో 11 మంది రాష్ట్రాల ప్రతినిధులు



ఎన్‌ఎంసీని వ్యతిరేకిస్తూ ఢిల్లీలో రాస్తారోకోలో పాల్గొన్న వైద్యులు

**న్యూఢిల్లీ:** వివాదాస్పద నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) బిల్లుకు గురువారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. వైద్య విద్యకు సంబంధించి అతిపెద్ద సంస్కరణగా ప్రభుత్వం అభివర్ణిస్తున్న ఈ బిల్లులో.. అవినీతికి ఆలవాలంగా మారిందని ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనను పొందుపర్చారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్యులు నిరసన తెలుపుతున్నారు. ఈ బిల్లును 'ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956'కు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చారు. అన్నాడీఎంకే వాకౌట్ చేయగా మూజువాణి ఓటుతో బిల్లును రాజ్యసభ ఆమోదించింది. లోక్‌సభలో ఇప్పటికే ఈ బిల్లు ఆమోదం పొందినప్పటికీ.. తాజాగా రెండు సవరణలకు లోక్‌సభ ఆమోదం తెలపాల్సి ఉన్న నేపథ్యంలో మరోసారి ఈ బిల్లు లోక్‌సభకు వెళ్లనుంది. బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్.. 'నకిలీ వైద్యులకు అడ్డుకట్ట వేసేలా ఈ బిల్లు ఉంది. తప్పుడు వైద్య విధానాలకు పాల్పడేవారికి సంవత్సరం జైలుశిక్షతో పాటు, రూ. 5 లక్షల జరిమానా విధించే ప్రతిపాదన బిల్లులో ఉంది. ఇప్పటివరకు అలాంటివారికి ఎంసీఐ నామమాత్రపు జరిమానా మాత్రమే విధించేది' అని తెలిపారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన మూడేళ్లలో నెక్స్ట్(నేషనల్ ఎగ్జిట్ టెస్ట్)ను నిర్వహించడం ప్రారంభిస్తామన్నారు. ఎన్‌ఎంసీలో రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం లేదన్న ఎంపీల విమర్శలపై స్పందిస్తూ.. మొత్తం 25 మంది సభ్యుల్లో 11 మంది రాష్ట్రాల ప్రతినిధులేనన్నారు. నెక్స్ట్ పరీక్షను మెడికల్ పీజీ ఎంట్రన్స్ పరీక్షగా, అలాగే విదేశాల్లో ఎంబీబీఎస్ చేసిన వారికి స్క్రీనింగ్ పరీక్షగా పరిగణిస్తామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్ల(సీహెచ్‌పీ) వ్యవస్థను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిందని, అభివృద్ధి చెందిన దేశాలు సైతం ఆ వ్యవస్థను అమలు చేస్తున్నాయని, భారత్ కూడా ఆ దిశగా వెళ్తోందని చెప్పారు. ఎన్‌ఎంసీలోని 25 మంది సభ్యుల్లో 21 మంది వైద్యులేనని, వారు సీహెచ్‌పీల అర్హతలను నిర్ణయిస్తారని హర్షవర్ధన్ వివరించారు. బిల్లును స్థాయీసంఘానికి పంపాలని తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. వైద్య విద్య అభ్యసించని 3.5 లక్షలమంది నాన్ మెడికల్ సిబ్బందికి ఆధునిక వైద్యం అందించే వైద్యులుగా లైసెన్స్ ఇవ్వాలన్న ప్రతిపాదనను కాంగ్రెస్ సభ్యుడు ఆజాద్ వ్యతిరేకించారు.

### బిల్లులోని ముఖ్యాంశాలు

- ఇప్పటివరకు అమల్లో ఉన్న ఎంసీఐకి స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. వందమందికి పైగా సభ్యులు ఉండే ఇందులో 70 శాతం మందిని ఎన్నుకుంటారు. ఇక కొత్తగా వచ్చిన ఎన్‌ఎంసీలో 25 మందే సభ్యులుగా ఉంటారు. వారిలో అత్యధికుల్ని కేంద్రమే నామినేట్ చేస్తుంది.
- కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ ఎన్‌ఎంసీ చైర్ పర్సన్ పేరుని, తాత్కాలిక సభ్యుల పేర్లను సిఫారసు చేస్తుంది.
- కొత్త కమిషన్‌లో 8 మంది ఎక్స్ అఫీషియో సభ్యుల్లో నలుగురు వైద్య విద్యకు సంబంధించిన వివిధ బోర్డుల అధ్యక్షులు ఉంటారు. మరో ముగ్గురిని ఆరోగ్యం, ఫార్మా, హెచ్‌ఆర్‌డీ శాఖలే సిఫారసు చేస్తాయి.
- ఎంసీఐ సమావేశం కావాలంటే వందమందికిపైగా ఉన్న సభ్యుల్లో 15 మంది హాజరైతే సరిపోయేది. వారు తీసుకున్న నిర్ణయాలు చెల్లుబాటు అయ్యేవి. జాతీయ వైద్య కమిషన్‌కు సంబంధించి 25 మందిలో 13 మంది హాజరైతేనే కీలక నిర్ణయాలు తీసుకోగలరు.
- ఎన్‌ఎంసీ సభ్యులందరూ విధిగా తమ ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించాలి.
- ఎంసీఐ కాలపరిమితి అయిదేళ్లయితే ఎన్‌ఎంసీ కాలపరిమితి నాలుగేళ్లు. తాత్కాలిక సభ్యులు రెండేళ్లకి ఒకసారి మారతారు.
- కమిషన్ చైర్మన్‌ను, అందులో సభ్యుల్ని తొలగించే అధికారం పూర్తిగా కేంద్రానిదే.
- ఎంబీబీఎస్, మెడికల్ పీజీకి సంబంధించి అన్ని ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీ 50 శాతం సీట్లలో ఫీజుల నియంత్రణ కమిషన్ చేతుల్లోనే ఉంటుంది.



- వైద్య విద్యలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి, మెడికల్ ప్రాక్టీస్ అనుమతికి సంబంధించి ఎంబీబీఎస్ చివరి ఏడాది నిర్వహించే పరీక్షనే అర్హతగా పరిగణిస్తారు. దీనిని నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్) పేరుతో నిర్వహిస్తారు. విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించిన విద్యార్థులు భారత్‌లో ప్రాక్టీస్ చేయాలంటే స్క్రీనింగ్ టెస్ట్‌కి హాజరుకావాలి. ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో వైద్య విద్యనభ్యసించాలంటే ఇకపై నీట్‌తో పాటుగా నెక్స్ట్ పరీక్ష కూడా రాయాల్సి ఉంటుంది.
- దేశంలోని హోమియో, యునాని, ఆయుర్వేదం కోర్సులు చదివిన వారు కూడా ఒక బ్రిడ్జ్ కోర్సు ద్వారా అల్లోపతి వైద్యాన్ని చేయవచ్చు.

## కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖర్గే!



**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ తదుపరి అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత మల్లిఖార్జున్ ఖర్గేను ఎన్నుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. అధ్యక్ష పదవికి చేసిన రాజీనామాను వెనక్కుతీసుకునేందుకు రాహుల్ గాంధీ ససేమిరా అంటున్న నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడం అనివార్యమైంది. పార్లమెంటు సమావేశాల అనంతరం ఆగస్టు 8 లేదా 10న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) భేటీ జరిగే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. అక్కడే రాహుల్ గాంధీ రాజీనామాను ఆమోదించడం, కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరగుతుందని పేర్కొన్నాయి. ఆగస్టు 15న పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ కొత్త అధ్యక్షుడే జెండా వందనం చేస్తారన్నాయి. పార్లమెంటు సమావేశాల తరువాత సీడబ్ల్యూసీ భేటీ ఉంటుందని పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా సైతం గురువారం ప్రకటించారు. కానీ భేటీ తేదీలను ఆయన వెల్లడించలేదు. భేటీలో రాహుల్ గాంధీ కూడా పాల్గొంటారని చెప్పారు. కాగా, పార్లమెంటు సమావేశాలను ఆగస్టు 9న వరకు పొడిగించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.

## గూఢచర్య ఆరోపణలపై పాక్‌లో భారతీయుడి అరెస్ట్



రాజు లక్ష్మణ్

**లాహోర్:** దేశంలో గూఢచర్యానికి పాల్పడుతున్నాడనే ఆరోపణలపై పాకిస్తాన్ ఓ భారతీయుడిని అరెస్ట్‌చేసింది. తానో గూఢచారినని రాజు లక్ష్మణ్ ఒప్పుకున్నాడని, అతడిని పంజాబ్ ప్రావిన్స్‌లోని డేరా ఘాజీ ఖాన్ జిల్లాలోని రాఖీగజ్ ప్రాంతంలో అరెస్ట్‌చేసినట్లు పాక్ పోలీసులు వెల్లడించారు. ఇతర వివరాలు రాబట్టేందుకు లక్ష్మణ్‌ను పోలీసులు గుర్తుతెలియని ప్రాంతానికి తరలించారు. బెలూచిస్తాన్ ప్రావిన్స్ నుంచి డేరా ఘాజీ ఖాన్ జిల్లాలోకి లక్ష్మణ్ ప్రవేశిస్తుండగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలపై గతంలో భారత మాజీ నేవీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ను బెలూచిస్తాన్ ప్రాంతంలోనే పాక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కేరళ ప్రజలపై 'వరద పన్ను'

**తిరువనంతపురం:** గత ఏడాది ఆగస్టు నెలలో భారీ వరదలతో అతలాకుతలమైన కేరళ పునర్నిర్మాణానికి అదనపు ఆదాయాన్ని సమీకరించడానికి ప్రజలపై వరద పన్ను విధించేందుకు 2019–20 బడ్జెట్‌లో కేరళ ప్రభుత్వం తీర్మానించింది. ఈ నిర్ణయంతో గురువారం నుంచి వస్తు సేవలపై ఒక శాతం పన్ను విధింపు అమల్లోకి వచ్చింది. రాబోయే రెండేళ్ల కాలానికి అమల్లోకి వచ్చే 'కేరళ ఫ్లడ్ సెస్'ద్వారా ఏటా రూ. 600 కోట్ల అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం దృష్టి సారించిందని అధికార వర్గాలు వెల్లడించాయి. కొత్త పన్ను ద్వారా సమీకరించిన మొత్తం రాష్ట్ర పునర్నిర్మాణం, వరద బాధితులకు పరిహారం చెల్లించడానికి ఉపయోగిస్తారు.

## నాకే ఫైన్ వేస్తారా ?

**ఫిరోజాబాద్:** హెల్మెట్ లేకుండా ప్రయాణించినందుకు పోలీసులు ఫైన్ వేయడంతో ఓ లైన్‌మెన్ పోలీస్‌స్టేషన్‌కే విద్యుత్ కట్ చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. లినేపర్‌కు చెందిన లైన్‌మెన్ శ్రీనివాస్ హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాన్ని నడపడంతో ఆ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అధికారులు మంగళవారం రూ. 500 జరిమానా విధించారు. దీనికి ప్రతీకారం తీర్చుకోవడానికి అదే రోజు సాయంత్రం రూ. 6.66 లక్షల కరెంటు బిల్లు బకాయి ఉందంటూ పోలీస్‌స్టేషన్‌కు ఆ లైన్‌మెన్ కరెంట్ కట్ చేశాడని సబ్ డివిజనల్ అధికారి (ఎస్‌డీఓ) రణ్‌వీర్ సింగ్ తెలిపారు. దీంతో పోలీసు అధికారులు విద్యుత్ విభాగ అధికారులతో మాట్లాడి రాత్రికి కరెంట్ వచ్చేలా చేసుకున్నారు.

# పోక్సో బిల్లుకు పార్లమెంటు ఓకే

**అరుదైన కేసుల్లో దోషులకు మరణశిక్ష**

**న్యూఢిల్లీ:** 'లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ (పోక్సో) (సవరణ) బిల్లు–2019'ని పార్లమెంటు గురువారం ఆమోదించింది. చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించి అత్యంత అరుదైన కేసుల్లో దోషులకు మరణ శిక్ష విధించేందుకు కూడా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయి. ఈ బిల్లును రాజ్యసభ గత నెల 29నే ఆమోదించగా, లోక్‌సభలో బిల్లు గురువారం పాసయ్యింది. మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతీ ఇరానీ ఈ బిల్లును ఆమోదం కోసం ప్రవేశపెడుతూ చిన్నారులపై నేరాలను లింగభేదం లేకుండా ఒకేలా చూసేందుకు ఈ బిల్లును తెచ్చామని అన్నారు. 'చిన్నారులతో నీలి చిత్రాలు' (చైల్డ్ పోర్నోగ్రఫీ)కి ఈ బిల్లులో నిర్వచనం కూడా చేర్చి, మరిన్ని ఎక్కువ దుశ్చర్యలను నేరం కిందకు వచ్చేలా చేశారు. పార్టీలకు అతీతంగా అనేకమంది ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు. దేశంలో 43 కోట్ల మంది చిన్నారులు ఉన్నారనీ, లింగభేదం లేకుండా వారందరికీ న్యాయపరంగా అదనపు భద్రతను ఈ బిల్లు కల్పిస్తుందని ఆమె తెలిపారు. చర్చ అనంతరం మూజువాణి ఓటుతో బిల్లును లోక్‌సభ ఆమోదించింది.

**నపుంసకులుగా మార్చాలి: కిరణ్ ఖేర్**

ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్‌ఎల్‌పీ సభ్యుడు హనుమాన్ బేనీవాల్ మాట్లాడుతూ పోక్సో చట్టం కింద దోషులుగా తేలిన వారిని బహిరంగంగా ఉరి తీయాలనీ, అప్పుడే ఇలాంటి నేరాలు చేయాలనుకునే వారికి భయం కలుగుతుందని డిమాండ్ చేశారు. నేరస్తులకు ఉరిశిక్ష విధించడం సాధ్యం కాకపోతే వారిని నపుంసకులుగా మార్చేలా నిబంధనలు ఉండాలని బీజేపీ ఎంపీ కిరణ్ ఖేర్ సూచించారు.

# బిన్ లాడెన్ కుమారుడు హతం!

- అల్‌కాయిదా కీలక నేతగా ఎదుగుతున్న హమ్జా
- వైమానిక దాడుల్లో హతం!
- నోరు మెదపని అమెరికా అధ్యక్షుడు



**వాషింగ్టన్:** ఒసామా బిన్ లాడెన్ కుమారుడు, అల్‌కాయిదా కీలక నేత హమ్జా వైమానిక దాడుల్లో హతమైనట్లు అమెరికా అధికారులు బుధవారం వెల్లడించారు. హమ్జా మరణించినట్లు ముగ్గురు అమెరికా అధికారులు స్పష్టం చేశారని, అయితే ఈ ఘటన ఎక్కడ, ఎప్పుడు జరిగిందనే విషయాలను వారు వెల్లడించలేదని ఎన్‌బీసీ న్యూస్ పేర్కొంది. దీని వెనుక అమెరికా హస్తం ఉందా అనే విషయంపై కూడా స్పష్టత లేదు. గత రెండేళ్లుగా సాగుతున్న ఓ ఆపరేషన్‌లో భాగంగా హమ్జా హతమైనట్లు న్యూయార్క్ టైమ్స్ కూడా చెప్పింది. ఎన్‌బీసీ కథనాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. అంగీకరించలేదు.. కనీసం ఖండించనూ లేదు. అల్‌కాయిదాలో కీలక నేతగా ఎదుగుతున్న హమ్జాను పట్టించిన వారికి దాదాపు రూ.7 కోట్లు బహుమతిగా ఇస్తామని 2019 ఫిబ్రవరిలో అమెరికా ప్రకటించడానికి ముందే అతడు మరణించినట్లు ఎన్‌బీసీ, న్యూయార్క్ టైమ్స్ కథనాలను బట్టి తెలుస్తోంది. లాడెన్ 20 మంది సంతానంలో 15వ కుమారుడైన హమ్జా.. లాడెన్ మూడో భార్య కొడుకు. కాగా, హమ్జాకు 30 ఏళ్ల వయసున్నట్లు భావిస్తున్నారు. జిహాద్‌కు పట్టపు యువరాజుగా పేర్కొంటున్న హమ్జా.. అమెరికాపై దాడులు చేయాల్సిందిగా తరచూ వీడియోలు, ఆడియోల రూపంలో పిలుపునిస్తూ ఉండేవాడు. తన తండ్రి లాడెన్‌ను చంపినందుకు ప్రతీకారం తీర్చుకోవాలని చెప్పేవాడు. హమ్జా ఎక్కడున్నాడనే విషయం అధికారికంగా తెలియకపోయినప్పటికీ ఇరాన్‌లో గృహనిర్బంధంలో ఉన్నాడని, అఫ్గానిస్తాన్‌లో ఉన్నాడని, పాకిస్తాన్, సిరియాలో తలదాచుకునే వాడని భావిస్తూ ఉండేవారు. లాడెన్‌ను 2011లో మట్టుబెట్టిన అనంతరం అతడి ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న ఫైళ్ల ఆధారంగా అల్‌కాయిదాను ముందుండి నడిపేందుకు హమ్జాను జాగ్రత్తగా పెంచుతున్నట్లు అమెరికా అధికారులు గుర్తించారు.

## 'ట్రిపుల్ తలాక్'కు రాష్ట్రపతి ఆమోదం



**న్యూఢిల్లీ:** 'ట్రిపుల్ తలాక్' బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బుధవారం ఆమోదం తెలిపారు. ఈ బిల్లును గతనెల 25న లోక్‌సభ, 30న రాజ్యసభ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 21 నుంచి కొనసాగుతోన్న ఆర్డినెన్స్ స్థానంలో ఈ చట్టం అందుబాటులోకి రానుంది. ఇకపై ఫోన్, ఎస్సెమ్మెస్, వాట్సాప్ లేదా ఇతర ఏ మార్గంలో తలాక్ చెప్పినా అది నేరమే. ఈ చట్టం ప్రకారం తలాక్ చెల్లదు. బాధితురాలు, ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు వారెంట్ లేకుండానే నిందితులపై కేసు నమోదు చేసే అవకాశం పోలీసులకు కలగనుంది.

# 23 నిమిషాల్లో ముంబై టు పుణె

**ప్రభుత్వ ప్రాజెక్టుగా ముంబై-పుణే హైపర్‌లూప్**



**ముంబై:** ముంబై–పుణె మధ్య నిర్మించనున్న హైపర్‌లూప్‌ను ప్రభుత్వ మౌలిక వసతి ప్రాజెక్టుగా ప్రకటించే ప్రతిపాదనకు మహారాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. భూమిపై నిర్మించే ఓ గొట్టంలో అత్యంత వేగంతో ప్రయాణించేందుకు ఈ హైపర్‌లూప్‌ను నిర్మించాలని ప్రణాళిక ఉంది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి పుణెలోకి వాకాడ్ వరకు నిర్మించే ఈ హైపర్‌లూప్ అందుబాటులోకి వస్తే, ముంబై–పుణె మధ్య 117.5 కి.మీ. దూరాన్ని కేవలం 23 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. రూ.70 వేల కోట్ల వ్యయంతో, రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పుణె మహానగరాభివృద్ధి సంస్థ చేపడుతోంది. తొలి దశలో పుణె మహానగర పరిధిలోనే 11.8 కిలోమీటర్లపాటు హైపర్‌లూప్‌ను రూ. 5 వేల కోట్ల వ్యయంతో నిర్మించి, ప్రయోగాత్మకంగా పరీక్షిస్తారు. అంతా సవ్యంగా ఉంటే రెండో దశలో మిగతా దూరం మొత్తం హైపర్‌లూప్‌ను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టుకు అనుమతులు సత్వరంగా లభించడం కోసం దీనిని ప్రభుత్వ మౌలిక వసతి ప్రాజెక్టుగా ప్రభుత్వం తాజాగా గుర్తించింది.

## ఐక్యరాజ్యసమితిలో సెప్టెంబర్‌లో మోదీ ప్రసంగం



**ఐక్యరాజ్యసమితి:** ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ సమావేశాల్లో భారత ప్రధాని మోదీ మరోసారి ప్రసంగించనున్నారు. ఐక్యరాజ్యసమితి 74వ వార్షిక జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సెప్టెంబర్ 28వ తేదీ ఉదయం ప్రధాని మోదీ ప్రసంగం ఉండనుంది. ఈ సమావేశాల్లో పాల్గొని ప్రసంగించే ప్రపంచ దేశాధినేతల షెడ్యూల్‌ను యూఎన్ గురువారం ప్రకటించింది. దీని ప్రకారం సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు సాధారణ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల కోసం 112 దేశాల అధ్యక్షులు, 48 మంది ప్రభుత్వాధినేతలు, 30 మంది విదేశాంగ శాఖ మంత్రులు న్యూయార్క్ చేరుకోనున్నారు. ఈ పర్యటన లోనే మోదీ మరికొన్ని ఉన్నత స్థాయి సదస్సులకు హాజరు కానున్నారు. మోదీ మొదటిసారి 2014లో ఐరాసలో ప్రసంగించారు.

# జాధవ్‌ను కలుసుకోవచ్చు!

- ఎట్టకేలకు న్యాయసహాయం!
- కుల్‌భూషణ్‌తో భారత దౌత్యాధికారుల భేటీకి పాక్ ఓకే



**న్యూఢిల్లీ:** పాక్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత మాజీ నేవీ అధికారి కుల్‌భూషణ్ జాధవ్‌కు ఎట్టకేలకు న్యాయసహాయం పొందే అవకాశం దక్కింది. భారత దౌత్యాధికారులు జాధవ్‌ను శుక్రవారం కలుసుకోవచ్చని భారత విదేశాంగశాఖకు పాక్ గురువారం సమాచారమిచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం భారత్ దౌత్యాధికారులు జాధవ్‌ను కలుసుకోవచ్చునని పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మహమ్మద్ ఫైజల్ చెప్పారు. గూఢచర్యం, ఉగ్రవాదం ఆరోపణలపై పాక్ సైనిక కోర్టు జాధవ్‌కు వేసిన మరణశిక్షను పునః పరిశీలించాలని ఇటీవల అంతర్జాతీయ కోర్టు చెప్పింది.

**న్యాయ సహాయం అంటే..**

1963 వియన్నా ఒప్పందం ప్రకారం రెండు స్వతంత్ర దేశాల మధ్య న్యాయ సహాయ సంబంధాలు ముఖ్యం. వియన్నా ఒప్పందంలోని ఆర్టికల్ 36 ప్రకారం ఏదైనా దేశం విదేశీ వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుంటే వారి హక్కుల్ని కాపాడడానికి ఆలస్యం చేయకుండా అరెస్ట్‌కు సంబంధించిన విషయాన్ని ఆ దేశ రాయబార కార్యాలయానికి సమాచారం అందించాలి. అరెస్ట్‌కి కారణాలు వివరించాలి. తనకు లాయర్ కావాలని నిర్బంధంలోని వ్యక్తి కోరితే ఆ ఏర్పాటు చేయాల్సిందే.

**భారత్‌కు ఎలా ప్రయోజనం ?**

ఇన్నాళ్లూ ఏకపక్షంగా విచారణ జరిపి జాధవ్ గూఢచారి అని పాక్ ముద్రవేసింది. లాయర్‌ని నియమిస్తే జాధవ్ వైపు వాదన ప్రపంచానికి తెలుస్తుంది. అతని అరెస్ట్ వెనుక నిజానిజాలు వెలుగు చూస్తాయి. పాకిస్తాన్ కుటిలబుద్ధిని బయటపెట్టే అవకాశం భారత్‌కు లభిస్తుంది.

## 200 యూనిట్లలోపు కరెంట్ ఫ్రీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో కరెంట్ బిల్లుల మోత ఆగిపోనుంది. నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం ఉన్న ప్రజలు ఇకపై కరెంట్ బిల్లు చెల్లించాల్సిన పనిలేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ప్రకటించారు. వచ్చే ఏడాది ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఈ నజరానా అందించారు. 201 నుంచి 400 యూనిట్ల వినియోగం ఉన్న వాళ్లు సగం విద్యుత్ బిల్లు చెల్లిస్తే సరిపోతుందని శుక్రవారం ఢిల్లీలో జరిగిన మీడియాసమావేశంలో కేజ్రీవాల్ స్పష్టంచేశారు. విద్యుత్ సబ్సిడీల కోసం రాష్ట్ర సర్కారు ఏటా రూ.2వేల కోట్లు భరించనుంది.

## బీజేపీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్య

**భువనేశ్వర్:** ఒడిశా శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే ఒకరు ముస్లిం మహిళలనుద్దేశించి అభ్యంతరకరంగా మాట్లాడారు. ముంబై, కోల్‌కతాల్లోని వేశ్యావాటికల్లో ముస్లిం మహిళలదే హవా అని అసెంబ్లీలో బీజేపీ ఉపనాయకుడు బీసీ సేథి వ్యాఖ్యానించారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్, బీజేడీ సభ్యుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందిన విషయంపై చర్చిస్తూ సేథి పై విధంగా మాట్లాడారు. దీంతో కాంగ్రెస్, అధికార బిజు జనతాదళ్ (బీజేడీ) సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. రికార్డులనుంచి సేథి మాటలను తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో మళ్లీ సేథి జీరో అవర్‌లో స్పందించారు. 'వార్తాపత్రికలు, మేగజీన్లు చేసిన సర్వేల్లో వెల్లడైన వాస్తవాలనే నేను చెబుతున్నా. సర్వే వివరాలను చెప్పడంలో తప్పేముంది. ప్రత్యేకంగా ఏ వర్గాన్నో నేను తక్కువచేసి మాట్లాడటంలేదు. ముంబై, కోల్‌కతాల్లోని రెడ్‌లైట్ ఏరియాల్లో ముస్లిం మహిళలదే హవా అని ఆయా సర్వేల ఫలితాలు వెల్లడిస్తున్నాయి' అని అన్నారు.

# ఇక ఢిల్లీలో 'ఉన్నావ్' విచారణ

- యూపీ నుంచి బదిలీ చేయాలని ఆదేశించిన సుప్రీంకోర్టు
- బాధితురాలికి 25 లక్షల తాత్కాలిక పరిహారం
- ప్రధాన కేసు విచారణను 45 రోజుల్లో ముగించాలని ఆదేశం



సుప్రీంకోర్టుకు వచ్చిన సీబీఐ జాయింట్ డైరెక్టర్ సంపత్ మీనా

**న్యూఢిల్లీ:** ఉన్నావ్ అత్యాచార ఘటనకు సంబంధించి నమోదైన మొత్తం ఐదు కేసులనూ ఉత్తరప్రదేశ్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. అలాగే బాధితురాలికి తక్షణమే రూ. 25 లక్షల తాత్కాలిక పరిహారం అందజేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని నిర్దేశించింది. గత ఆదివారం ఉన్నావ్ అత్యాచార బాధితురాలి కారును ట్రక్కు ఢీకొట్టిన ఘటనపై దర్యాప్తును వారం రోజుల్లోనే పూర్తి చేయాలని కూడా సీబీఐకి సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఉన్నావ్ అత్యాచర ఘటన ప్రధాన కేసు విచారణను ప్రారంభించిన నాటి నుంచి 45 రోజుల్లోపే పూర్తి చేయాలని కూడా సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు అత్యాచారం చేసిన బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్‌ను తమ పార్టీ నుంచి బీజేపీ బహిష్కరించింది. కాగా, బాధితురాలికి భద్రత కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు ఆమె భద్రత కోసం గతంలో కేటాయించిన ముగ్గురు పోలీస్ సిబ్బందిని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. కానీ ఇది సరిపోదనీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, డీజీపీ ఓపీ సింగ్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) డిమాండ్ చేస్తోంది. 2017లో కుల్దీప్ సెంగార్ తనపై అత్యాచారం చేశాడని 2018లో ఉన్నావ్‌కు చెందిన యువతి ఆరోపించగా, పోలీసులు ఆమె తండ్రినే అరెస్టు చేసి లాకప్‌లోనే ఆయన చనిపోయేలా చేయడం తెలిసిందే. బాధిత యువతి గత ఆదివారం తన ఇద్దరు సమీప బంధువులు, లాయర్‌తో కలిసి కారులో ప్రయాణిస్తుండగా, ఆ కారును ట్రక్కుతో ఢీకొట్టి వారందరినీ చంపే ప్రయత్నం జరిగింది. యువతి బంధువులైన ఇద్దరు మహిళలు మరణించగా, యువతి, ఆమె లాయర్ తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం లక్నోలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనపై విచారణను ఇప్పటికే ప్రారంభించిన సీబీఐ, 10 మందిపై హత్యా నేరం మోపింది.

**సత్వర విచారణ కోసం ఏకపక్ష ఆదేశాలు**

ఉన్నావ్ అత్యాచార కేసు పరిస్థితులు, అసాధారణ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని, విచారణను వేగవంతం చేసే ఉద్దేశంతో నిందితుల తరపు వాదనలు వినకుండానే తాము ఏకపక్ష ఆదేశాలు ఇస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ఒకవేళ ఏవైనా అసాధారణ పరిస్థితులు ఉంటే మాత్రమే ప్రమాద ఘటనపై దర్యాప్తును ముగించేందుకు సీబీఐకి అదనంగా మరో వారం రోజులపాటు గడువు ఇస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం వెల్లడించింది. అన్ని కేసులనూ ఢిల్లీలోని తీస్ హజారీ కోర్ట్స్‌లోని జడ్జి ధర్మేశ్ శర్మ విచారిస్తారని చెప్పింది. ఓ రహస్య సమావేశం అనంతరం సుప్రీం జడ్జీలు ధర్మేశ్ శర్మ పేరును ఖరారు చేశారు. ఈ ఆదేశాలను మార్చాలని లేదా రద్దు చేయాలని వచ్చే ఏ పిటిషన్‌నూ విచారణకు స్వీకరించబోమంది.

## కుల్దీప్‌పై బీజేపీ వేటు



ఉన్నావ్ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు, బీజేపీపై విమర్శలు వస్తుండటంతో ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్‌ను బీజేపీ తమ పార్టీ నుంచి బహిష్కరించింది. బీజేపీ యూపీ అధ్యక్షుడు స్వతంత్ర దేవ్ సింగ్ ఈ విషయాన్ని ప్రకటించారు. కుల్దీప్‌ను బహిష్కరించాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుందనీ, ఆ విషయాన్ని ప్రకటించాల్సిందిగా బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా స్వతంత్ర సింగ్‌కు ఫోన్‌లో చెప్పారని పార్టీ వర్గాలు తెలిపాయి. కుల్దీప్ ఇప్పటికే జైల్లో ఉన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ బీజేపీలో ఓ నేరస్తుడికి అధికారం ఇచ్చినట్లు ఎట్టకేలకు ఆ పార్టీ ఒప్పుకుందన్నారు.

## రాజస్తాన్ నుంచి రాజ్యసభకు మన్మోహన్ !

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ రాజస్తాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశం ఉందని పార్టీవర్గాలు వెల్లడించాయి. జూన్ 14తో ఆయన పదవీకాలం ముగిసింది. జూన్ 24న రాజస్తాన్‌కు చెందిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు మదన్ లాల్ సైని కన్నుమూయడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. కాంగ్రెస్‌కు రాజస్తాన్‌లో మెజారిటీ ఉండడంతో మన్మోహన్‌సింగ్‌ను అక్కడ నుంచి ఎన్నుకోవాలని చూస్తోంది. ఒక వేళ మన్మోహన్ ఈ స్థానం నుంచి ఎన్నికైతే ఆయన 2024 ఏప్రిల్ 3 వరకు కొనసాగనున్నారు. ఆగస్టు 26న ఉత్తరప్రదేశ్‌లోని ఓ స్థానంతో పాటు రాజస్తాన్‌లో కూడా ఎన్నిక జరుగుతుందని ఎన్నికల కమిషన్ ఇప్పటికే ప్రకటించింది. గత అయిదు సార్లు మన్మోహన్ అస్సాం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

సాక్షి
శుక్రవారం, ఆగస్టు, 2

## 'కాఫీ కింగ్' విషాదాంతం

దాదాపు నాలుగు దశాబ్దాలుగా భిన్న తరాలకు చెందిన లక్షలాదిమందికి మధురమైన క్షణాలను పంచుతూ, వారి జీవితాల్లో ఒక తీయని జ్ఞాపకంగా చెరగని ముద్ర వేసుకున్న సంస్థ 'కెఫే కాఫీ డే'. అందుకే ఆ సంస్థ వ్యవస్థాపకుడు వీజీ సిద్దార్థ ఆచూకీ లేకుండా పోయారన్న వార్త ఎందరినో దిగ్భ్రాంతికి గురిచేసింది. చివరకు వారంతా భయపడినట్టే 36 గంటల తర్వాత సిద్దార్థ విగతజీవుడై కనబడ్డారు. సంస్థ ఉద్యోగులనూ, బోర్డు సభ్యులనూ ఉద్దేశించి ఆయన రాసినట్టు చెబుతున్న ఒక లేఖ ఆయనదేనని ఇంకా ధ్రువీకరించకపోయినా, అందులో ప్రస్తావించిన అంశాలు ఆందోళన కలిగిస్తాయి. ఆయన సన్నిహిత మిత్రులు, బంధువులు మాత్రమే కాదు... వ్యాపారరంగంలో ఆయన్ను చాలా దగ్గర నుంచి చూసినవారు సైతం సిద్దార్థ సమర్థత గురించి, ఆ రంగంలో ఆయన దీక్ష, పట్టుదల గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడతారు. ఆయన ఆధ్వర్యంలోని సంస్థల ఉద్యోగులకు కూడా ఎప్పుడూ ఆయన ఇన్ని కష్టాల్లో ఉన్నారని తెలియలేదు. ఇంకా చెప్పాలంటే ఆయన తెలియనివ్వలేదు. కానీ ఆ లేఖ గమనిస్తే ఆయన ఎదుర్కొన్న ఒత్తిళ్లు ఎలాంటివో, ఆయన ఎంత నిస్సహాయంగా మిగిలిపోయారో అర్థమవుతుంది. విఫల వ్యాపారవేత్తగా మిగిలిపోయానన్న ఆవేదన అందులో కనిపిస్తుంది. సంస్థ నిలదొక్కుకోవడానికి, అది లాభాల బాట పట్టడానికి ఆయన చేసిన కృషి పెద్దగా ఫలించకపోవడం, అందుకోసం చేసిన అప్పులు అపరిమితంగా పెరిగిపోవడం, ఈలోగా ప్రైవేటు ఈక్విటీ(పీఈ) సంస్థల నుంచి, రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరగడం, ఆదాయపు పన్ను శాఖ(ఐటీ) అధికారుల వేధింపులు వంటివి ఆయన తనువు చాలించాలని నిర్ణయించుకోవడానికి దారితీసి ఉండొచ్చునని లేఖలోని అంశాలు చెబుతున్నాయి. సహజంగానే ఐటీ శాఖ తమపై వచ్చిన ఆరోపణల్ని ఖండించింది. పైపెచ్చు ఆయన దగ్గర నల్లధనం పట్టుబడిందని ఆరోపించింది. ఈ ఆరోపణలపై తన వైఖరేమిటో చెప్పేందుకు సిద్దార్థ లేరు. కానీ ఆయనకున్న అప్పుల కన్నా ఆస్తుల విలువ చాలా ఎక్కువ గనుక బకాయిల గురించి ఆయన బెంబేలెత్తే సమస్యే లేదన్నది సన్నిహితుల వాదన.

ఏ రంగంలోనైనా నిపుణత సాధించి, ఉన్నత శిఖరాలు అందుకునేవారికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. విజేతలను అందరూ ఆరాధనా భావంతో చూస్తారు. కానీ ఆ విజేతల ఆంతరంగిక పరిస్థితి వేరు. ఆ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి వారు నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి. ఎక్కడ వెనక్కి తగ్గినా వైఫల్యం తలుపుతట్టడానికి సిద్ధంగా ఉంటుంది. అది చదువా, ఉద్యోగమా, వ్యాపారమా, వ్యవసాయమా, క్రీడలా, రాజకీయాలా అన్న అంశాలతో నిమిత్తం లేదు. ఏ రంగం వారికైనా ఇది తప్పదు. జయాపజయాలను సమంగా స్వీకరించే స్థితప్రజ్ఞత, నిత్యం సవాళ్లను ఎదుర్కొనే సాహసం సహజంగా అలవడేవి కాదు. చుట్టూ ఉన్న పరిస్థితులతో, వ్యక్తులతో పోరాడుతూనే...తనపై తాను పోరాటం చేసుకుంటే తప్ప ఇవి సాధ్యపడవు. తాము న్న రంగంలో చిత్తశుద్ధితో, నిజాయితీతో పనిచేస్తూ సమున్నతంగా ఎదగడానికి శ్రమించేవారందరికీ ఇది వర్తిస్తుంది. సిద్దార్థ అటువంటివారు. ఆయన నిజాయితీపరుడు గనుకే, విలువలను నమ్ముకున్నవాడు గనుకే, సున్నితమనస్కుడు గనుకే ఒక్కుమ్మడిగా చుట్టుముట్టిన సమస్యలతో ఒత్తిళ్లకులోనై ఉసురు తీసుకోవడానికి సిద్ధపడి ఉంటారు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటివారికి ఈ బెడద ఉండదు. వారు విజేతలుగా తమను తాము చిత్రించుకోవడానికి శ్రమిస్తారు. అందుకోసం అన్ని రకాల చీకటి పనులకూ పాల్పడతారు. పాపం బద్దలైందని తెలిశాక దూరతీరాలకు పారిపోతారు.

సిద్దార్థ రాసినట్టు చెబుతున్న లేఖలో ప్రస్తావనకొచ్చిన వేధింపుల అంశాన్ని ఐటీ శాఖ ఖండిస్తున్నది. కానీ దాంతో ఏకీభవించేవారు తక్కువ. ఇప్పుడే కాదు... ఎన్నాళ్లుగానో ఒక్క ఐటీ శాఖపైన మాత్రమే కాదు, నియంత్రణ వ్యవస్థలన్నిటి వ్యవహారశైలిపైనా ఆరోపణలున్నాయి. దేశంలో కార్పొరేట్ తిమింగలాలుగా పేరుబడ్డ పది పదిహేను శాతంమంది రాజకీయ ప్రాపకంతో కులాసాగా ఉంటారు. వారి జోలికెవరూ పోరు. మధ్య, కింది స్థాయిలవారికి మాత్రం నిత్యం ఒత్తిళ్లు, వేధింపులు తప్పవు. ఇవన్నీ పైవారికి తెలిసే జరుగుతున్నాయని అనలేం. ఈ మధ్యే ఐటీ శాఖలో పలు ఆరోపణలున్నాయన్న కారణంతో 20మంది ఉన్నతాధికారులను కేంద్రం రిటైర్ చేసింది. 'కెఫే కాఫీ డే'కు ఎదురైన వైఫల్యాలకు గల కారణాలను కేవలం సిద్దార్థలోనే చూడటం కూడా సరికాదు. మన దేశంలో ఇంకా అంతగా వేళ్లూనుకోని ఖరీదైన కాఫీ క్లబ్‌ల సంస్కృతిని ఆధారంగా చేసుకుని రూపొందించుకున్న వ్యాపార నమూనా ఆయన అనుకున్నట్టుగా విస్తరించి ఉండకపోవచ్చు. కానీ ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుమోసిన సంస్థలకంటే మెరుగ్గా ఆయన నిలదొక్కుకోగలిగారు. ఆ సంస్కృతిని పెంచగలిగారు. 'కెఫే కాఫీ డే'తో పోలిస్తే ఇతర సంస్థలు మన దేశంలో నామమాత్రంగా మిగిలిపోయాయి. అయినా మూడు నాలుగేళ్లుగా ఆ సంస్థకు నష్టాలు తప్పడం లేదు. ఇది కేవలం ఆ సంస్థకు మాత్రమే పరిమితమైన స్థితి కాదు. మన ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఒడిదుడుకులు సకల రంగాల్లోనూ ప్రతిఫలిస్తున్నాయి. ఆటోమొబైల్ రంగంతో సహా అన్నీ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. జీఎస్టీ బకాయిలు భారీయెత్తున పోగడుతున్నాయి. ఉపాధి అవకాశాల లేమి, వేతనాల్లో కోతలు, అనిశ్చిత వగైరాల వల్ల వినిమయం బాగా తగ్గింది. వెనకా ముందూ చూసి ఖర్చు పెట్టే స్థితి వచ్చింది. ఒకప్పుడు 'కెఫే కాఫీ డే'లవంటి ఖరీదైన దుకాణాలకు వెళ్లడం తమ హోదాకు చిహ్నంగా భావించినవారు ఒకటికి రెండుసార్లు ఆలోచించకతప్పడం లేదు. నియంత్రణ వ్యవస్థలు ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. బకాయిలున్నవారందరినీ ఒకే గాటన కట్టి, అందరినీ నేరగాళ్లుగా చూసే వైఖరిని విడనాడాలి. అప్పుడు సిద్దార్థవంటి వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు నిబ్బరంతో ముందడుగు వేయడానికి వీలవుతుంది.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి శు.పాడ్యమి ఉ.6.54 వరకు, తదుపరి, విదియ తె.4.26 వరకు (తెల్లవారితే శనివారం), నక్షత్రం ఆశ్లేష ప.12.11 వరకు, తదుపరి మఖ, వర్జ్యం రా.11.22 నుంచి 12.54 వరకు, దుర్ముహూర్తం ఉ.8.14 నుంచి 9.05 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.21 వరకు, అమృతఘడియలు... ఉ.10.40 నుంచి 12.10 వరకు.

**సూర్యోదయం :** 5.42
**సూర్యాస్తమయం:** 6.30
**రాహుకాలం :** ఉ. 10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# నిఘా నీరసిస్తే 'సమాచారం' సమాధే!


దిలీప్ రెడ్డి

**పార్లమెంటు ఆమోదించిన తాజా సవరణ ద్వారా సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చి పారదర్శకతకు సర్కారు పాతరేయ జూస్తోంది. రాజ్యాంగం ప్రసాదించిన 'పౌరులు తెలుసుకునే' ప్రాథమిక హక్కుకే ఇది భంగం. సమాచార హక్కు అమలు సాకారానికి లభించిన చట్టభద్రతకి ఇక గండి పడనుంది. డెబ్బయ్యేళ్ల స్వతంత్ర చరిత్రలో, దాదాపు ఒకటిన్నర దశాబ్దాల పోరు తర్వాత ఆర్టీఐ రూపంలో దేశ ప్రజలకు దక్కిన అరుదైన వ్యవస్థకు తూట్లు మొదలయినట్టే! చట్టం అమల్లోకి వచ్చి దాదాపు 15 సంవత్సరాలవుతున్న తరుణంలో ఈ పరిస్థితి రావడం దురదృష్టకరం. పలువురు సందేహిస్తున్నట్టు ప్రస్తుత సవరణ ఈ చట్టాన్ని బలహీనపరచకూడదు. బలోపేతం చేయాలి.**

## సమకాలీనం

ప్రభుత్వాలు, పాలకపక్ష పెద్దలిచ్చే సంకేతాల్ని బట్టే చట్టాలు అమలవుతాయి, అధికార యంత్రాంగం పనిచేస్తుంది. పౌరులాశించిన పరిపాలనా ఫలాలు లభిస్తాయి. సంకేతాలే మాత్రం భిన్నంగా ఉన్నా, ఫలితం సున్నా, ఇక అంతే సంగతులు! యుగాలుగా ఇది నడుస్తున్న చరిత్ర అవటం వల్లే సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం అమలు పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఎన్నో సందేహాలు! పార్లమెంటు ఆమోదించిన తాజా సవరణ ద్వారా ఈ చట్టాన్ని నీరుగార్చి పారదర్శకతకు సర్కారు పాతరేయ జూస్తోందన్న విమర్శ. రాజ్యాంగం ప్రసాదించిన 'పౌరులు తెలుసుకునే' ప్రాథమిక హక్కుకే ఇది భంగం. హక్కు అమలు సాకారానికి లభించిన చట్టభద్రతకిక గండి పడనుంది. డెబ్బయ్యేళ్ల స్వతంత్ర చరిత్రలో, దాదాపు ఒకటిన్నర దశాబ్దాల పోరు తర్వాత ఆర్టీఐ రూపంలో దేశ ప్రజలకు దక్కిన అరుదైన వ్యవస్థకు తూట్లు మొదలయినట్టే! చట్టం అమల్లోకి వచ్చి దాదాపు ఒకటిన్నర దశాబ్దాలవుతున్న తరుణంలో ఈ పరిస్థితి రావడం దురదృష్టకరం. ప్రస్తుత చట్ట సవరణ ఏ కోణంలో చూసినా, సమాచార వెల్లువను పటిష్ట పరచకపోగా ఈ ప్రక్రియను పలుచన చేయడానికే ఆస్కారముంది. చట్టం అమల్లోకి వచ్చిన కొత్తలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డా. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆర్టీఐ అమలుకు అనువైన భూమికను సిద్ధం చేశారు. నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్ కందాకు చెప్పి అధికారులకు, పౌర సంఘాల కార్యకర్తలకు, జర్నలిస్టులకు ప్రత్యేకంగా చట్టంపై శిక్షణ ఇప్పించారు. పౌరుల్లో అవగాహనకు ప్రత్యేక నిధులతో ప్రచార సామాగ్రి రూపొందించి, సదస్సులు పెట్టించారు. జాప్యం లేకుండా కమిషన్ ఏర్పరచి అమలు ప్రారంభించారు. ఒక సందర్భంలో ఎల్లంపల్లి సాగునీటి ప్రాజెక్టుపై విపక్ష సభ్యులు రభస చేస్తే, '... రాజకీయం చేయకండి, నిజంగా సమాచారం తెలుసుకోవడమే మీ ఉద్దేశమైతే, పది రూపాయలు వెచ్చించి ఆర్టీఐ దరఖాస్తు చేసినా మీకు సమాచారం లభిస్తుంద'ని శాసనసభావేదిక నుంచి భరోసా ఇచ్చారు. మొత్తం అధికార వ్యవస్థకే ఆ మాట ఒక బలమైన సంకేతమైంది.

### అడ్డుకున్నా ఆగని తొలి సవరణ

సమాచార హక్కు చట్ట సవరణ బిల్లును పార్లమెంటు ఇటీవలే ఆమోదించింది. ఉభయసభల్లోనూ ఈ సమావేశాల్లోనే బిల్లుకు ఆమోదం లభించింది. ఇక రాష్ట్రపతి ముద్రపడి, గెజెట్లో ప్రచురితమవడంతో చట్ట సవరణ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రధానంగా ఈ చట్ట సవరణ... కేంద్రంలో, రాష్ట్రంలో ఉండే సమాచార కమిషనర్ల హోదా, పదవీకాలం, వేతనాల మార్పులకు సంబంధించింది. అవన్నీ అధికంగా ఉన్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా వాటిని హేతుబద్ధం చేసేందుకేనని బిల్లు ముసాయిదా లక్ష్యాలు–ఉద్దేశాల్లో కేంద్రం వెల్లడించింది. కానీ, అది సహేతుకంగా లేదు. 'తాడిచెట్టెందుకెక్కావు?' అంటే 'దూడ గడ్డికోసం'అని తడుముకుంటూ చెప్పే జవాబంత అసంబద్ధంగా ఉంది. 2005లో ఏర్పడ్డ నాటినుంచి ఆర్టీఐ చట్టానికి ఇదే తొలి సవరణ. ఇంతకు ముందు మూడు, నాలుగు మార్లు వేర్వేరు విషయాల్లో సవరణకు జరిగిన యత్నాలు ఫలించలేదు. పాలనలో కీలకమైన 'నోట్‌ఫైల్స్'ను ఈ చట్టపరిధి నుంచి తప్పించే విఫల యత్నమూ జరిగింది. చట్టాన్ని మార్చడానికి ఆయా సందర్భాల్లో కేంద్రంలోని ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలను పౌరసమాజం ఎప్పటికప్పుడు ప్రతిఘటించింది. సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే నిరాహార దీక్షకు దిగి ఇటువంటి ఓ ప్రతిపాదనను లోగడ అడ్డుకున్నారు. ప్రతిసారీ చట్ట సవరణకు చేసిన ప్రతిపాదనలు ఏదో రూపంలో చట్టాన్ని బలహీనపరచి, పారదర్శకతకు భంగం కలిగిస్తాయని పౌర సమాజం కలవరపడింది. సవరణ వద్దని వివిధ స్థాయిల్లో ఉద్యమించింది. అందువల్ల, కేంద్రం చేసిన ఏ సవరణ ప్రయత్నమూ ఇంతకాలం ఫలించలేదు. ఒకసారైతే, కేంద్ర మంత్రివర్గం ఆమోదించినా జనాగ్రహానికి జడిసి, సవరణ బిల్లు ముసాయిదాను పార్లమెంటుకు తెచ్చే సాహసం చేయలేకపోయింది ప్రభుత్వం. ఈ సారి కూడా చట్టాన్ని సవరించకూడదని, తద్వారా సమాచార కమిషన్లు బలహీనపడి, చట్టం అమలు నీరుగారిపోతుందని ప్రజాసంఘాలు వ్యతిరేకించినా చట్ట సవరణ ప్రక్రియ ఆగలేదు. పార్లమెంటులో విపక్షం వ్యతిరేకించినా ప్రభుత్వ పట్టుదల వల్ల ఉభయసభల ఆమోదంతో ఆర్టీఐ చట్ట సవరణ జరిగిపోయింది.

### సమాన హోదాలతో సమస్యేమిటి?

చట్ట ప్రకారం అఖిల భారతస్థాయి కేంద్ర సమాచార కమిషన్‌లోని ముఖ్య సమాచార కమిషనర్ హోదాను కేంద్ర ఎన్నికల ముఖ్య కమిషనర్ హోదాతో సమానంగా నిర్ణయించి, అమలు చేస్తున్నారు. ఆయా ప్రభుత్వాలు రూపొందించే రూల్స్‌లో కాకుండా ఈ అంశాల్ని మౌలికమైన చట్టంలోనే పొందుపరిచారు. ఇది 2005 నుంచి ఇలాగే ఉంది. మిగతా కేంద్ర సమాచార కమిషనర్ల హోదాను ఇతర ఎన్నికల కమిషనర్లతో సమంగా నిర్ణయించి, వేతనాలు, భత్యాలూ అదే లెక్కన చెల్లిస్తున్నారు. ఇంకొక లెక్క ప్రకారం... కేంద్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ హోదా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమానం. దాని వల్ల, ఆర్టీఐ కేంద్ర సమాచార ముఖ్య కమిషనర్ హోదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదాతో సమానమౌతోందని, ఇది సముచితం కాదనేది కేంద్ర ప్రభుత్వ వాదన. భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థ కాగా ఆర్టీఐ కమిషన్ చట్టబద్ధ సంస్థ మాత్రమే అని కేంద్రం అంటోంది. అదే విధంగా రాష్ట్రాల్లోని ఆర్టీఐ ముఖ్య సమాచార కమిషనర్లకు కేంద్ర ఎన్నికల కమిషనర్‌తో సమానమైన, రాష్ట్రాల్లోని ఆర్టీఐ కమిషనర్లకు రాష్ట్రాల్లో ఉండే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)తో సమానమైన హోదాను, జీత భత్యాలను ఇప్పటి వరకున్న చట్టం కల్పించింది. పైగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అయిదేళ్లు గాని, 65 ఏళ్ల వయసు వచ్చే వరకు గానీ, ఏది ముందయితే అప్పటివరకు కేంద్ర–రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్లు పదవిలో ఉంటారు. చట్టం వచ్చిన కొత్తలో ఆదరాబాదరాగా ఇటువంటి నిర్ణయం తీసుకున్నారని, ఇది సరికాదంటూ కేంద్ర ప్రభుత్వం పనిగట్టుకొని ప్రస్తుత సవరణ తెచ్చింది. ఈ సవరణతో ఇప్పుడు... ఆయా కమిషనర్ల హోదాలు, జీత భత్యాలు, పదవీ కాలం వంటివి నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దఖలవుతోంది. ఇకపై రాష్ట్రాల సమాచార కమిషనర్లకు సంబంధించిన హోదా, పదవీకాలం, జీత భత్యాలు కూడా కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కమిషన్ల ఏర్పాటు, కమిషనర్ల నియామకాలు, వాటి నడక, నిర్వహణ... అంతా కూడా ఇకపై కేంద్ర ప్రభుత్వం చెప్పుచేతల్లోకి వచ్చినట్టే! ఇక్కడే వివాదం తలెత్తుతోంది. ప్రస్తుత సవరణల వల్ల చట్టం అమలుకు, పారదర్శకతకు వచ్చే అదనపు ప్రయోజనం ఏమీ లేదని, పైగా నష్టం జరుగుతుందనేది చట్ట సవరణ వ్యతిరేకిస్తున్న వారి వాదన. అటువంటిదేమీ ఉండదని, అనవసర హోదాలు, అస్పష్టతలు తొలగి మరింత పకడ్బందిగా చట్టం అమలుకు ఈ సవరణ పనికొస్తుందనే దొల్ల వాదనను కేంద్ర వర్గాలు వినిపించాయి. రాజ్యాంగ సంస్థ హోదాలను చట్టబద్ధ సంస్థల్లోని వారికి కల్పించకూడదనే నిషిద్ధం కూడా ఎక్కడా లేదు. ఇప్పటికే కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) వంటి రాజ్యాంగ సంస్థలే కాకుండా జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్చార్సీ), జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ), లోక్‌పాల్ వంటి చట్టబద్ధ సంస్థల చైర్మన్‌లు, సభ్యులకు కూడా రాజ్యాంగ సంస్థల్లోని వారితో సమాన హోదాలున్నాయి. ఇలా చట్టబద్ధ పదవులకు కూడా రాజ్యాంగ హోదాలతో సమాన స్థాయి కల్పించి, ఏ ఇబ్బందీ లేకుండా దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఉదాహరణలు కోకొల్లలు. మరి వాటన్నిటినీ ఇప్పుడు మారుస్తారా? ఇక్కడ మాత్రమే ఎందుకీ మార్పు? ఇవి సహజమైన ప్రశ్నలు.

### నిఘా, నిర్వహణ ఇక నిర్వీర్యమే!

దేశంలో ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి అంటే, ఈ పద్నాలుగేళ్ల కాలంలో పాలనా వ్యవస్థల్లో పారదర్శకత పెరిగింది. ఆశించిన స్థాయి ఫలితాలు అందకున్నా... ప్రభుత్వంలోని చాలా విభాగాల నుంచి పౌరులు సమాచారం పొందగలుగుతున్నారు. ఇదివరలో సమాచారం లభించడం దుర్లభమైన విభాగాల్లో కూడా నేడు పౌరులు ఆర్టీఐ కింద ఒక దరఖాస్తు పెట్టి కోరిన సమాచారం తెచ్చుకోగలుగుతున్నారు. ఇందుకు, చట్టంలో పొందుపరచిన ప్రజాసానుకూల అంశాలే కారణం. చట్టం అమలు నిఘా–నియంత్రణ సంస్థలుగా కమిషన్లు స్వేచ్ఛగా–స్వతంత్రంగా వ్యవహరించే వెసలుబాటు మరో బలమైన కారణం. ప్రభుత్వాల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా కమిషనర్ల హోదాలు, పదవీ కాలం, జీతభత్యాలు ఇన్నాళ్లు చట్టం నిర్దేశించినట్టు హూందాగా, నిలకడగా ఉంటూ వచ్చాయి! దాని వల్ల కమిషనర్లు... ప్రభుత్వాలకు, వారి ప్రలోభాలు–ఒత్తిళ్లకు లొంగకుండా, బెదిరింపులకు భయపడకుండా స్వేచ్ఛగా పనిచేయగలిగే వారు. ముఖ్యంగా ఆర్టీఐ కమిషనర్లకు ఎన్నికల కమిషనర్ల, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల స్థాయి హోదాలుండటం వల్ల ఉన్నత స్థాయి ఐఏఎస్. ఐపీఎస్ అధికారులు కూడా కమిషన్ల ఆదేశాలు పాటించే వారు. ఇక ఇప్పుడు అన్నీ కేంద్ర ప్రభుత్వం అదుపాజ్ఞల్లోకి రావడం, హోదాలు తగ్గడం వల్ల ఆర్టీఐ కమిషన్ల పనితీరు చప్పబడిపోతుంది. ప్రస్తుత సవరణ పరోక్షంగా కమిషన్ల స్వేచ్ఛను, స్వతంత్రతను దెబ్బతీయడమే అన్న విమర్శ తలెత్తుతోంది. దీనికి పాలక బీజేపీ నుంచి సరైన సమాధానం లేదు. నిజానికి 2005లో ఈ చట్టం తెచ్చినపుడు, కమిషనర్లకు తక్కువ హోదాలతో నాటి యూపీఏ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనల్ని విపక్ష బీజేపీ వ్యతిరేకించింది. కమిషనర్లకు పెద్ద హోదాలతో, బలమైన కమిషన్లు ఉండాలని వాదించింది. నాటి పార్లమెంట్ స్థాయి సంఘంలో ఉన్న అయిదారుగురు బీజేపీ ఎంపీల్లో ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా ఉన్నారు. ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా వాదించింది. ఏ వాదనలెలా ఉన్నా, అంతిమ పరిణామాలను కాలమే నిర్ణయిస్తుంది. పౌరుల తెలుసుకునే హక్కు, పాలనలో పారదర్శకత విషయంలో ఆర్టీఐ ఒక విప్లవాత్మక చట్టం. మనకున్న మంచి చట్టాల్లో ఒకటైన ఆర్టీఐ పటిష్టంగా అమలుజరగాలనే ఎవరైనా కోరుకుంటారు. పలువురు సందేహిస్తున్నట్టు ప్రస్తుత సవరణ ఈ చట్టాన్ని బలహీనపరచకూడదు. తాజా సవరణ, తద్వారా రాగల పరిణామాలన్నీ ఆర్టీఐ చట్టాన్ని మరింత బలోపేతం చేయడానికి దోహదపడాలనే ఎవరమైనా కోరుకుంటాం, కోరుకోవాలి కూడా!

వ్యాసకర్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు పూర్వ కమిషనర్
ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



### సోషల్ మీడియా

#### దొంగచావులు


"గత ఏడాది జనవరి నుంచి పేపర్లు తిరగేస్తుంటే ఆవుల దొంగల చేతిలో సుమారు 20 మంది చనిపోయినట్టు వార్తలు కనిపించాయి. కొంత మందిని వారి ఇళ్లలో, మరికొందరిని వారి వాహనాలతో తొక్కించి, మరికొందరిని కాల్చి చంపారు. కేవలం హిందీ పేపర్లలో వచ్చిన సమాచారం మాత్రమే ఇది. ఇంగ్లిష్ మీడియా ఈ వార్తలను ఎక్కువగా పట్టించుకోలేదు. అన్ని రాష్ట్రాల సమాచారాన్ని సేకరిస్తే మృతులు మరింతమంది ఉండవచ్చు"
– స్వాతి గోయెల్ శర్మ, జర్నలిస్ట్

#### మతాహారం


"డెలివరీ చేసే వ్యక్తి అన్యమతస్తుడనే కారణంతో వినియోగదారుడి అభ్యర్థనను తిరస్కరించే విషయంలో జొమాటో నిర్ణయం సరైనదే. ఆహారానికి మతంతో సంబంధం లేదని అనడం సరి కాదు. ఇది హలాల్, జైన్ ఆహార పదార్థాలు కోరే వారితో ఇబ్బందులు తెస్తుంది. ఇది అందరికీ వర్తింపజేయడం సాధ్యం కాదు"
– బైజయంత్ జై పండా, బీజేపీ నేత

#### ఆర్టీఐ


"ఆర్టీఐ సవరణ బిల్లుకు ఆమోదం తెలుపవద్దని రాష్ట్రపతిని కోరుతూ పిటిషన్ ఇవ్వడానికి వెళ్లిన వారందరినీ పోలీసులు నిర్బంధించారు. నినాదాలు చేయలేదు, బ్యానర్లు లేవు, పోస్టర్లు కూడా ప్రదర్శించలేదు. కేవలం పిటిషన్లు మాత్రమే తీసుకువెళ్లాం. ఇప్పుడు అది కూడా చట్ట వ్యతిరేకమేనా?"
– అంజలీ భరద్వాజ్, సామాజిక కార్యకర్త

#### జైలు


"కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులను ఖర్చు చేయనట్లయితే మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారట. ఇదే పద్ధతిలో మన ప్రధాని, మంత్రులకు కూడా జైలు శిక్ష విధిస్తారా? స్మార్ట్ సిటీలనీ, బుల్లెట్ రైళ్లనీ ఇచ్చిన హామీలను కేటాయించిన బడ్జెట్‌లోనే పూర్తిచేయకపోతే వారిని శిక్షించాలి"
– వివేక్ మప్రాని
స్టాక్ మార్కెట్ విశ్లేషకుడు

#### అమ్మకం


"ఆర్థిక వ్యవస్థ తీవ్ర తిరోగమనంలో ఉండగా 2018–19లో 664 బిలియన్ డాలర్ల అత్యధిక ఎఫ్‌డీఐలు భారతీయ మార్కెట్లోకి ప్రవేశించాయంటూ ప్రభుత్వం చెప్పుకుంటోంది. ప్రైవేట్ పెట్టుబడులన్నీ ఆగిపోయి, కేవలం ఎఫ్‌డీఐలు పెరిగాయి అంటే–భారత్‌లో అప్పుల ఊబిలో కూరుకుపోయిన వ్యాపారవేత్తలు తమ ఆస్తులను టోకున విదేశీయులకు అమ్మేసుకున్నారని అర్థం"
– ఎం.కె.వేణు, జర్నలిస్ట్

# రాజ్యాంగమా... ఉన్నావా?

విశ్లేషణ

మాడభూషి శ్రీధర్

యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల తరువాత 2017 జూలై 11న ఒక అమ్మాయి అదృశ్యమైంది. జూలై 17న ఉన్నావ్ బాలికకు ఉద్యోగం ఆశ చూపి గ్యాంగ్ రేప్ చేశారని తేలింది. ఎమ్మెల్యే కుల్ దీప్ సింగ్ సెంగార్, సోదరుడు అతుల్ సింగ్, మరికొందరు ఈ దారుణానికి పాల్పడ్డారని ఆరోపణ. జూలై 20, 2017న ఆ అమ్మాయి కనిపించింది. ఉన్నావ్ తీసుకువచ్చారు. ఎంతో అల్లరి తరువాత ఫిబ్రవరి 24, 2018న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులను బెదిరించే కార్యక్రమం జరుగుతూనే ఉంది. ఆమె తండ్రి సురేంద్రను ఇంటివాళ్లు చూస్తుండగా చెట్టుకు కట్టివేసి కర్రలు, బెల్ట్, రాడ్లతో అతుల్ సింగ్, అనుచరులు దారుణంగా కొట్టారు. గాయపడిన సురేంద్రను ఏ దవాఖానా చేర్చుకోలేదు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నాడంటూ సురేంద్రను ఏప్రిల్ 4, 2018న అరెస్టు చేశారు. నన్నురేప్ చేశారని ఎంత మొత్తుకున్నా ఒక్కడూ వినడం లేదు. పైగా నన్ను బెదిరిస్తున్నారు, వాళ్లను అరెస్టు చేయండి, లేకపోతే మీ కళ్లముందే చస్తానని బాధితురాలు ఏప్రిల్ 8, 2018న ముఖ్యమంత్రి ఇంటిముందు ఆత్మహత్యాప్రయత్నం చేసింది. అప్పుడు దేశం మొత్తానికి ఈ ఘోరం గురించి తెలిసింది.

ఏప్రిల్ 10న అతుల్ సింగ్ సహా నలుగురిని సురేంద్రను కొట్టిన కేసులో అరెస్టు చేశారు. మూడు రోజుల తరువాత ఏప్రిల్ 12న సురేంద్ర గాయాలతో చనిపోయాడు. యూపీ ప్రభుత్వం కేసును సీబీఐకి ఇచ్చింది. సెంగార్ ను ఎందుకు ఇంకా అరెస్టుచేయలేదని అలహాబాద్ హైకోర్టు ప్రశ్నించింది. ఎఫ్ ఐ ఆర్ లో ఆయన పేరుంది. సీబీఐ దర్యాప్తు చేస్తున్నది. మేం ఎందుకు అరెస్టు చేయాలి అని పోలీసు ఉన్నతాధికారి ఓ.పి. సింగ్ అమాయకంగా ప్రశ్నించారు. ఏప్రిల్ 13న సెంగార్‌ను ప్రశ్నించడానికి తీసుకువెళ్లి మరునాడు అరెస్టు చేశారు. స్వయంగా బాలికను సెంగార్ దగ్గరకు తీసుకువెళ్లి, లోపల రేప్ చేస్తుంటే తలుపు దగ్గర కాపలా కాసిన ఆరోపణపై శశిసింగ్ అనే మహిళామణిని సీబీఐ ఏప్రిల్ 15న అరెస్టు చేసింది. ఈలోగా ఎమ్మెల్యేగారి భక్త బృందం మా ఎమ్మెల్యే నిర్దోషి అని ఏప్రిల్ 23న ఒక ర్యాలీ తీసారు. 2018 జూలై 7న సురేంద్ర హత్యకేసులో అయిదుగురిపైన సీబీఐ నేరాలు మోపింది. 11న సెంగార్, శశిసింగ్‌ల పైన సీబీఐ అత్యాచార ఆరోపణలను నమోదు చేసింది. తండ్రిపైన దొంగ కేసుల కుట్ర చేసినందుకు ముగ్గురు పోలీసు అధికారుల మీద మరో ఇద్దరి మీద 13న కేసులు పెట్టారు. జూలై 31, 2018న రేపిస్టులకు మరణశిక్ష విధించే బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఆగస్టు 18న సురేంద్ర హత్యకేసులో కీలకమైన సాక్షి యూనుస్ అనుమానాస్పదంగా మరణించాడు. డిసెంబర్ 17న రేప్ బాధితురాలి బంధువులపైన దొంగ పత్రాలు ఇచ్చారనే ఆరోపణపై శశిసింగ్ భర్త కేసు పెట్టారు. జూన్ 6, 2019న ఉన్నావ్ ఎంపీ సాక్షి మహారాజ్ సెంగార్ ను సీతాపూర్ జైల్లో కలిసి తనను జైలు నుంచే గెలిపించినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. 20 ఏళ్ల కిందట హత్యా ప్రయత్నం చేసాడన్న పాత కేసు తవ్వి జూలై 4న బాధితురాలి బాబాయికి పదేళ్ల జైలు శిక్షవేసారు. జూలై 28న బాధితురాలి బంధువులు లాయర్ మహేంద్ర సింగ్ కలిసి ప్రయాణిస్తున్న వాహనానికి యాదృచ్ఛికంగా ప్రమాదం జరిగి ఇద్దరు మహిళలు చనిపోయారు. జూలై 29న రాజ్యసభలో సెంగార్ నేరచరిత్రపైన గందరగోళం జరిగింది. 30న ఇండియాగేట్ దగ్గర నిరసనలు చేశారు. బీజేపీ అతన్ని పార్టీనుంచి బహిష్కరించినట్టు తాజా వార్త. బాధితురాలు, ఆమెలో ధైర్యం బతకాలి. లాయర్ల క్రాస్ ఎగ్జామినేషన్‌ను తట్టుకుని తనను బలాత్కరించాడని నమ్మించేట్టు చెప్పగలిగితేనే ఈ ఎమ్మెల్యేగారు అసెంబ్లీకి కాకుండా జైలుకు వెళ్లగలుగుతాడు. నిర్దోషిగా విడుదలైతే, మంత్రులంతా వెళ్లి పూల మాలలతో స్వాగతం చెప్పి వీలైతే మంత్రిని చేసి రాజ్యాంగాన్ని రక్షిస్తామని ఆయనచే ప్రమాణం కూడా చేయిస్తారేమో, ఎవరికి తెలుసు?

యూపీలో శాంతిభద్రతలు దేశానికే ఆదర్శం అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సగర్వంగా ప్రకటించుకున్నారు. ఎంత యోగి అయితే అంత ఆత్మవిశ్వాసం అన్నమాట. యోగులు కాని మన వంటి వారికి అది అర్థం కాదు. ఆయనకు మించిన ఆత్మవిశ్వాసం కలిగిన యోధుడు సెంగార్. ఎందుకంటే ఆయన గత సంవత్సరం ఏప్రిల్ నుంచి సీబీఐ పోలీసు కస్టడీలోనే ఉన్నా, అత్యంత యాదృచ్ఛికంగా ఇక్కడ ప్రమాదం జరిగిపోయింది.

రాయ్‌బరేలీ దగ్గర జరిగిన ప్రమాదంలో బాధితురాలు, ఆమె లాయర్ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరు కుటుంబ సభ్యులు చనిపోయారు. బాధితురాలు తమపై ఇది హత్యాకుట్ర అని ఫిర్యాదు చేసిన తరువాత జూలై 29న యూపీ పోలీసులు సెంగార్ మరో తొమ్మిది మంది పైన హత్యకేసు నమోదు చేశారు. తెలుగు సినిమా కథ కాదిది. యోగి, మహారాజ్ అని పేర్లుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్న ఉత్తరప్రదేశ్‌లో ఎంఎల్యేలు, ఎంపీలు మంత్రులు సాగిస్తున్న దురన్యాయాలు. కీచక రాజకీయ వేదిక ఉన్నావ్ రాజ్యాంగాన్ని ఉన్నావా అని అడుగుతున్నది.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# సంపన్న ఇండియా.. నిరుపేద భారత్..

సందర్భం

డి. పాపారావు

''ప్రపంచ నూతన ఆవిష్కరణల సూచి''పై 2019కి గాను మొత్తం 126 దేశాలలో భారత్‌కు 52వ ర్యాంకు లభించింది. ఈ సూచిపై ఒక దేశం తాలూకు ర్యాంకును 7 ప్రాతిపదికల ఆధారంగా నిర్ణయిస్తారు. వీటిలో ముఖ్యమైనవి కొన్ని 1) మార్కెట్ పరిణతి 2) విజ్ఞాన, సాంకేతిక ఆవిష్కరణలు 3) మానవ వనరుల అందుబాటు, పరిశోధన 4) వ్యాపార రంగంలో ఆధునికత 5) సృజనాత్మక ఆవిష్కరణలు 6) మౌలిక సదుపాయాలు 7) వ్యవస్థల ఉనికి... ఈ కొలబద్దల ఆధారంగా లభించిన మన ర్యాంకు (52) ఖచ్చితంగా మెరుగైనదే ! కానీ, అదే సమయంలో మనం 2018కి సంబంధించిన మన దేశం తాలూకు మరొక ర్యాంకును కూడా చూడాలి. అది, మన మానవాభివృద్ధి సూచీ. 2018లో, మొత్తం 189 దేశాలలో ఈ సూచీపై మన దేశానికి 130వ ర్యాంకు లభించింది. ఈ సూచీలో ర్యాంకింగ్‌ను ఇచ్చేందుకు ప్రాతిపదికలుగా : 1) ఆయు ప్రమాణాలు 2) విద్యాస్థాయి 3) తలసరి ఆదాయం వంటి వాటిని పరిగణిస్తారు.

మన దేశం తాలూకు ర్యాంకుల మధ్యన ఉన్న వైరుధ్యాన్ని ఇక్కడ మనం గమనించాల్సి ఉంది. దేశంలో అత్యంత విజ్ఞానవంతులైన, నిపుణులైన మేధోవంతులైన, నాణ్యమైన కొనుగోలు శక్తి గల ప్రజల ఉనికిని ''ప్రపంచ ఆవిష్కరణల సూచీ'' 52వ ర్యాంకు చెబుతోంది. కాగా, విద్య, జీవన ప్రమాణాలను చెప్పే ''మానవాభివృద్ధి సూచీ'' విషయంలో మన దుస్థితిని మనకు లభించిన 130వ ర్యాంకు చెబుతోంది. మరి, ఈ పరస్పర విరుద్ధ, వైచిత్రితో కూడిన ర్యాంకులకు కారణం ఏమిటి ? దీనికి జవాబు సులువే. అది, మన దేశంలోనే రెండు దేశాలు ఉండటం. ఒకటి, మెజారిటీ సామాన్య పేద జనాల భారత్! రెండవది, అంతర్జాతీయ స్థాయి విద్యావంతులూ, బిలియనీర్‌లు ఉన్న ఇండియా!!

మరి, 70 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం ఇటువంటి అసమానతలకు కారణం ఏమిటి ? దీనికి కారణాలు అనేకం. నిజానికి, స్వతంత్ర భారతం తొలిదశలోనే ఈ దేశం అంతర్జాతీయ స్థాయి ఉన్న ఐఐటీలు, ఐఐఎమ్‌ల వంటి ఉన్నత విద్యాసంస్థలను ఏర్పరచుకుంది. కానీ దశాబ్దాలుగా మన ప్రాథమిక, మాధ్యమిక విద్యారంగాలు ముఖ్యంగా సామాన్య జనాలకు విద్యనందించే సంస్థల ప్రమాణాలు నాసిరకంగానే ఉంటున్నాయి. 8వ తరగతికి చేరినా, తమ మాతృభాషలో కూడా సరిగా చదవలేని, గణితంలో చిన్న చిన్న కూడికలు కూడా చేయలేని స్థితిలో కోట్లాది మంది బాలలు ఉన్నారని, ఈ మధ్యన జరిగిన పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే, ఐఐటీలు, ఐఐఎమ్‌ల వంటి ప్రీమియర్ సంస్థలలో విద్యను పొందిన వారిని కోట్లాది రూపాయల పారితోషికంతో ఉపాధి ఆహ్వానిస్తోంది.. కొద్దిపాటి మేధోవంతులూ, కులీనులూ కూలీల పిల్లల మధ్యన అంతరాన్నీ, అగాధాన్ని సృష్టిస్తోన్న కథ ఇది.

మన దేశం తాలూకు ఈ వైరుధ్యాన్ని ఎత్తిచూపే ఒక కార్టూన్, 1980లలో మన తెలుగు పత్రికలలో ఒకదానిలో వచ్చింది... అదినాటి ప్రధాని రాజీవ్ గాంధీ, దేశంలో కంప్యూటర్‌లను ప్రవేశపెట్టడానికి సంబంధించినది. ఆ కార్టూన్‌లో రాజీవ్‌గాంధీ జపాన్ నుంచి మన దేశంలోకి కంప్యూటర్‌ను ఒక విమానంలోనో, లేదా కనీసం నౌకలోనో తీసుకువస్తున్నట్లుగా కాక దానిని ఆయన ఒక ఎండ్లబండిపై తీసుకువస్తున్నట్లుగా కార్టూనిస్టు చిత్రించారు! పారిశ్రామికీకరణకు ముందరి వ్యవసాయ జీవన విధానం తాలూకు ప్రతిబింబం అయిన ఎండ్లబండి ఒక వైపున, పారిశ్రామిక విప్లవానంతర నూతన దశ తాలూకు కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం రెండవ వైపునా ఈ కార్టూన్‌లో కనపడతాయి. నాటికీ నేటికీ అదే నిజం. నిజానికి 1990లలో ఆర్థిక సంస్కరణలతో ఈ వైరుధ్యం తాలూకు అసమానతలు మరింత పెరిగాయి.

దీనికి, విద్యావ్యవస్థలోని లోపాలతో పాటుగా 1990ల అనంతర కులీన వర్గాల అనుకూల అభివృద్ధి నమూనా కూడా తోడయ్యింది. మౌలికంగా, వ్యవసాయాధారిత దేశస్తులమైన మనం ముందుగా, సరుకు ఉత్పత్తి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసుకోవడం కాకుండా, సూటిగా సాఫ్ట్‌వేర్, బీపీఓల వంటి అధిక నిపుణతల అవసరం ఉన్న సేవారంగంలోకి వెళ్ళాం. అంటే, మనం 1970–80లలో మన దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే పోలిన చైనా, దక్షిణ కొరియా, తైవాన్‌ల వంటి దేశాల బాటన ముందుగా పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం ఇచ్చుకొనే దిశలో ప్రయాణం చేయలేదు. పారిశ్రామికీకరణను నిర్లక్ష్యం చేశాం. 2014లో మేకిన్ ఇండియాకు శ్రీకారం చుట్టినా, అప్పటికే పుణ్యకాలం కాస్తా అయిపోయింది. కాబట్టే, ఈ అసమానతల పర్వం తాలూకు ప్రతిబింబాలుగా, నేడు మన కళ్ళ ముందు 'ప్రపంచ ఆవిష్కరణల సూచీ', 'మానవాభివృద్ధి సూచీ'లు నిలుస్తున్నాయి. పైగా అంతర్జాతీయ క్షుద్బాధితుల సూచీపై 2018లో 119 దేశాలలో మనం 103వ స్థానంలో ఉండటం గమనార్హం.

వ్యాసకర్త ఆర్థికరంగ విశ్లేషకులు
మొబైల్ : 98661 79615

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083




# మ్యావ్

**కాపీ కొట్టేవాళ్లని 'కాపీక్యాట్' అంటారు. చైల్డ్ వర్డ్ అది. పెద్దవాళ్లు కాపీ కొడితే అది చైల్డిష్ కాదు. షేమ్‌లెస్! లేటెస్ట్‌గా ఓ పిల్లి పోస్టర్‌పై వివాదం మొదలైంది. కంగనా నటించిన 'జడ్జ్‌మెంటల్ హై క్యా' చిత్రం పోస్టర్‌ను తన ఆర్ట్‌వర్క్ చూసి కాపీ కొట్టారని ఓ హంగేరియన్ ఆర్టిస్ట్ ఆరోపిస్తున్నారు. మనం ఎప్పటిలా మానేస్తాం.. కాపీ క్యాట్‌లా మ్యావ్ అనడం! ఎవరూ చూడ్డం లేదని పాలు తాగేశాక ఇలాగే కదా.. పిల్లి మ్యావ్ అంటూ వెళ్లిపోయేది!**



హాల్ లోపల వెండితెర, హాల్ బయట 'వాల్'తెర.. రెండూ రెండు ప్రాణాలు సినిమాకు. లోపలిది చలన చిత్రం. వెలుపలిది నిశ్చలన చిత్రం. ఎంత చలన చిత్రం అయినా, హాల్ లోపలికి ప్రేక్షకుల్ని నడిపించేది మాత్రం బయట వాల్‌పై కనిపించే నిశ్చలన చిత్రమే. టీజర్‌లొచ్చి, యూట్యూబ్ ట్రైలర్‌లు వచ్చినా మైదా రాసి గోడకు అంటించే పోస్టర్‌కు ఉండే స్మెల్ వేరే దేనికీ రాలేదు. పోస్టర్ మేకింగ్ ఇప్పటికీ సినిమా తీసినంత పని. గోడపైన హీరోనో, హీరోయిన్‌నో లేదా ఇంకేదైనా సీన్‌నో చూడగానే గుండెకో, మైండ్‌కో పట్టేసేటట్లు ఉండాలి. తేలికేం కాదు. సినిమాలొచ్చిన కొత్తలో పోస్టర్‌ల డిజైనింగ్ ఇంత కష్టంగా ఉండకపోయేదేమో. సినిమాలు ఎక్కువయ్యాక పోస్టర్‌లు క్రియేట్ చెయ్యడానికి కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్‌లా పెద్ద టీమ్ సిద్ధమౌతోంది. మెప్పించి, రప్పించాలి కదా ఆడియన్స్‌ని థియేటర్‌లకు.

## తొలి చిత్రాల పోస్టర్‌లు




1932లో వచ్చిన 'భక్త ప్రహ్లాద' తెలుగులో తొలి టాకీ చిత్రం. పోస్టర్‌లే లేని ఆ కాలంలో పోస్టర్ చెయ్యడం అన్నది చంద్రయాన్ ప్రయోగమే. అయినా చేశారు. చెయ్యకపోతే సినిమా గురించి తెలిసేదెలా? అయితే అది పెద్ద సైజు పాంప్లెట్‌లా ఉంది తప్ప పోస్టర్‌లా లేదు. పాంప్లెటే పోస్టర్ అనుకోండి. ఆ పోస్టర్‌లు కూడా ప్రొడక్షన్ హౌస్ నుంచి కాక, థియేటర్‌ల వాళ్లు కొట్టించుకున్నవి. 'భారత మూవీటోన్ అనబడుతున్న శ్రీ కృష్ణా ఫిల్ము కంపెనీ వారిచే అధిక వ్యయ ప్రయాసలకోర్చి తయారు చేయబడిన 'భక్త ప్రహ్లాద' 100 శాతం సంపూర్ణ తెలుగు టాకీ అని బెజవాడలోని అప్పటి 'శ్రీ దుర్గా కళామందిరము' పోస్టర్ కొట్టించింది. చుట్టూ సినిమా వివరాలు, ఆ వివరాల మధ్యలో భక్తప్రహ్లాదుడి మూవీ స్టిల్. ఇదీ ఆ పోస్టర్. నిర్మాణ సంస్థ మూవీటోన్ నేరుగా కొట్టించిన పోస్టర్ కూడా ఉంది. అది ఇంగ్లిష్‌లో ఉంటుంది. సిమెట్రికల్‌గా సినిమాలోని ఓ ఏడు సన్నివేశాలతో భక్తప్రహ్లాద పోస్టర్‌ను డిజైన్ చేసి సినిమా విశేషాలను ఇచ్చారు. చూడ్డానికి ఇప్పుడా సినిమా లేదు. పుణె ఆర్కైవ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన వాటిలో భక్తప్రహ్లాద ఫిల్మ్ రీళ్లు కూడా ఉన్నాయి. ఏవో రెండు స్టిల్స్, ఓ సినిమా పోస్టర్ మాత్రమే ప్రస్తుత జ్ఞాపకాలు.

తొలి తెలుగు సినిమా కంటే కాస్త ముందు తొలి హిందీ సినిమా 'ఆలం ఆరా' తయారైంది. నిర్మాణం ఇంపీరియల్ మూవీటోన్. 1931లో విడుదలైంది. భక్త ప్రహ్లాద పోస్టర్‌లా నలుపు తెలుపులో కాక, ఆ సినిమా పోస్టర్ సింగిల్ కలర్‌లోనే రెండు షేడ్‌లుగా వచ్చింది. పోస్టర్ మీద ఒక అందమైన బంజారా యువతి గుండెలపై చేతులు వేసుకుని నిలబడి ఉంటుంది. కింద ఒక ప్రణయ సన్నివేశం ఉంటుంది. పైన ఓ మూల.. గుంపు పన్నివేశం ఉంటుంది. 'ఆలం ఆరా' అనే టైటిల్ ఉంటుంది. టైటిల్ కింద.. ఆల్ డ్యాన్సింగ్, సింగింగ్ అండ్ డాన్సింగ్ అని ఉంటుంది. పోస్టర్ అడుగున స్ట్రిప్ ఉంటుంది 'ఇంపీరియల్ మూవీ–టోన్, బాంబే' అని. ఈ సినిమా ఫిల్ములు కూడా కాలిపోయాయి. పోస్టర్ ఒక్కటే ప్రాణంతో ఉంది.

## మట్టిగోడలపై లీడ్ రోల్స్

రఫ్‌గా ఓ వందేళ్లుగా టాకీలు ఆడుతున్నాయి. వాటి మూకీ వెర్షన్‌లుగా వాల్ పోస్టర్‌లూ వందేళ్లుగా ప్రేక్షకుల్ని రంజింపజేస్తున్నాయి. మట్టి గోడకు సినిమా పోస్టర్ అంటించి ఉన్న గుడిసెలోని సినిమాటోగ్రఫీ.. వంద అడుగుల ఎత్తు ఫ్లెక్సీ ఉన్న ఐమాక్స్ థియేటర్ ప్రాంగణంలో ఉంటుందా! అందుకే సినిమాలు కాలగతిలో కలిసిపోతున్నా కూడా సినిమా పోస్టర్‌లు మనసు గదులకు అంటుకునే ఉంటున్నాయి. పోస్టర్‌లోని మంత్రముగ్ధత అది. ఎంతగా నంటే ఇప్పటికీ ఒకర్ని చూసి ఒకరు ఇన్‌స్పైర్ అయి పోస్టర్‌లను కాపీ కొట్టేసుకునేంత! ఎక్కువ కాపీయింగ్ హాలీవుడ్‌లోంచి మిగతా వుడ్‌లలోకే. కాపీ కొట్టడం తప్పా ఒప్పా అన్నది పక్కన పెడితే ఎవరిది వాళ్లు కాపీ కొట్టుకోవడం ఎవరి పర్సులోంచి వాళ్లు దొంగతనం చేసినట్లుగా ఉంటుంది. ఈ ట్రెండు హాలీవుడ్‌లో బాగా ఉంది. వాళ్లది వాళ్లే పిక్ పాకెటింగ్ చేస్తుంటారు! బ్యాక్ టు బ్యాక్ ఇద్దరు ఆనుకుని నిల్చునే పోస్టర్‌లు, హీరోయిన్ కాళ్ల మధ్య నుంచి సీన్‌ని చూపించే పోస్టర్‌లు, ఒంటికన్ను పోస్టర్‌లు, లీడ్ రోల్ వెనక్కు తిరిగి ఉండే పోస్టర్‌లు, జంతువుల పోస్టర్‌లు, నేచర్ బ్లూ పోస్టర్‌లు హాలీవుడ్‌లో రిపీట్ అవుతూనే ఉంటాయి. ఇవేకాదు, బెడ్‌మీద కపుల్ పోస్టర్‌లు, 'బ్లూ రన్ అండ్ టిల్ట్' పోస్టర్‌లు, (మహేశ్ బాబు ఒక సైడ్‌కి వాలి పరుగు తీస్తుంటాడు కదా.. అలా), వెనుక సముద్రం ఉండే ఓషన్ సిల్హౌటీ పోస్టర్‌లు, ఎర్రటి ఎరుపు డ్రెస్ వేసుకుని తెల్లటి కాళ్లు బయటపెట్టే యంగ్ లేడీ పోస్టర్‌లు హాలీవుడ్‌లో ఒకర్ని చూసి ఒకరు డిజైన్ చేస్తున్నవే.

సెర్బియన్ బ్లాగర్ క్రిస్టోఫ్ కోర్టిస్‌కి ఇదంతా ఫన్నీగా కనిపిస్తుంది. 'కాపీ అనలేం, ఇన్‌స్పిరేషన్ అనాలి' అంటారు కోర్టిస్. ఆయన బ్లాగ్‌లో పెద్ద కాపీ కలెక్షనే ఉంది.




● 'ది జాజ్ సింగర్' పోస్టర్

## మనసును మీటిన తొలి పోస్టర్

హాలీవుడ్‌లో ఫస్ట్ టాకీ మూవీ 'ది జాజ్ సింగర్'. 1927లో వచ్చింది. వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్, విటాఫోన్ కార్పోరేషన్ కలిసి ఈ సినిమాను నిర్మించాయి. కలర్‌ఫుల్ మూవీ పోస్టర్ . పోస్టర్ మీద సినిమాలోని పాత్రలు యూజినీ బెసెరెర్, అల్ జోల్‌సన్ ఉంటారు. తల్లీ కొడుకులు. 'వాసు' సినిమాలో వెంకటేశ్ పెద్ద సింగర్ అవాలనుకుంటే వెంకటేశ్ తండ్రి అతడిని పెద్ద పోలీస్ ఆఫీసర్ అవమంటాడు. తండ్రీకొడుకులకు మధ్య ఘర్షణ మొదలౌతుంది. మాతృ హృదయం కొడుకులోని 'కళా తపస్వి'ని అర్థం చేసుకుంటుంది. అలాంటి తల్లి మనసే 'ది జాస్ సింగర్' పోస్టర్ డిజైన్‌లో కనిపిస్తుంది. 'చూశావా అమ్మా నేనెంత గొప్పగా ప్లే చేస్తున్నానో' అన్నట్లు అల్ జోల్‌సన్.. జాస్‌ని ప్లే చేస్తూ తల్లి కళ్లలోకి చూస్తుంటే.. ''నా బంగారు కొండ..'' అన్నట్లు కొడుకును మురిపెంగా చూస్తుంటుంది యూజినీ బెసెరెర్. ఆ పోస్టర్ ప్రతి ఇంటినీ టచ్ చేసి, ఇంటిల్లపాదినీ థియేటర్‌లకు రప్పించింది.

## పోస్టర్‌ల మహాసముద్రం

హాలీవుడ్ నుంచి హాలీవుడ్‌లోకి ఇంత 'క్రియేటివ్'గా డంపింగ్ జరుగుతున్నప్పుడు హాలీవుడ్ నుంచి నుంచి ఇతర వుడ్‌లలోకి పోస్టర్‌లు డంప్ అవడం తప్పుగా ఏం అనిపించదు కానీ, తప్పే అని అంటున్నారు ఫ్లోరా బార్నీ అనే ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్. ఇరవై ఆరేళ్ల ఈ హంగేరియన్ యువతి విజువల్ ఆర్ట్‌లో, ఫొటోగ్రఫీలో, ఫొటోషాప్‌లో, ఫొటో మానిపులేషన్‌లో నిపుణురాలు. గతవారం రిలీజ్ అయిన కంగనా రనౌత్ సినిమా 'జడ్జిమెంటల్ హై క్యా' పోస్టర్‌లను తన ఆర్ట్ వర్క్ చూసే కాపీ కొట్టారని, కనీసం తన అనుమతి కూడా తీసుకోలేదని ఫ్లోరా తన ఫేస్‌బుక్‌లో ఆరోపించారు. ఆరోపణ కాదు, నిజమే అనిపిస్తుంది.

*(మిగతా ఫ్యాషన్ పేజీలో)*


సాక్షి సెలబ్రేషన్ ఆఫర్

చదవండి ... గెలవండి

మీ కూపన్ ని ఈ ఫార్మాట్ పై అతికించండి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 1 కూపన్ | 2 కూపన్ | 3 కూపన్ | 4 కూపన్ | 5 కూపన్ | 6 కూపన్ |
| | | | 7 కూపన్ | 8 కూపన్ | 9 కూపన్ | 10 కూపన్ | 11 కూపన్ | 12 కూపన్ |
| | | | 13 కూపన్ | 14 కూపన్ | 15 కూపన్ | 16 కూపన్ | 17 కూపన్ | 18 కూపన్ |
| 19 కూపన్ | 20 కూపన్ | 21 కూపన్ | 22 కూపన్ | 23 కూపన్ | 24 కూపన్ | 25 కూపన్ | 26 కూపన్ | 27 కూపన్ |
| 28 కూపన్ | 29 కూపన్ | 30 కూపన్ | 31 కూపన్ | 32 కూపన్ | 33 కూపన్ | 34 కూపన్ | 35 కూపన్ | 36 కూపన్ |
| 37 కూపన్ | 38 కూపన్ | 39 కూపన్ | 40 కూపన్ | 41 కూపన్ | 42 కూపన్ | 43 కూపన్ | 44 కూపన్ | 45 కూపన్ |
| 1 మాస్టర్ కూపన్ | 2 మాస్టర్ కూపన్ | 3 మాస్టర్ కూపన్ | 4 మాస్టర్ కూపన్ | 5 మాస్టర్ కూపన్ | | | | |

పేరు ..........
అడ్రస్ ..........
పట్టణం .......... రాష్ట్రం ..........
మొబైల్ ..........

ఈ విధంగా పాల్గొనండి - • కోటి రూపాయల విలువ చేసే బహుమతులు గెలిచి పెట్టే కూపన్ల ఫార్మాట్ ను కత్తిరించి మీ దగ్గర భద్రంగా దాచుకోండి • జూలై 10 నుండి అక్టోబరు 10 వరకు 60 స్టాండర్డ్ కూపన్లు మరియు 10 మాస్టర్ కూపన్లు సాక్షి పత్రికలో ప్రచురించబడును. • ఇందులో నుండి పాఠకులు కేవలం 45 స్టాండర్డ్ కూపన్లను మరియు 5 మాస్టర్ కూపన్లను తీసి భద్రంగా దాచిన కూపన్ల ఫార్మాట్ లో అతికించాలి. • అతికించడానికి నిబంధనలు ఏమి లేవు, ఉదా -: పేపర్లో ప్రచురితమయ్యే స్టాండర్డ్ కూపన్ కానీ మాస్టర్ కూపన్ కానీ, నంబరుతో నిమిత్తం లేకుండా కూపన్ల ఫార్మాట్ లో ఎక్కడైనా అతికించవచ్చు. • కూపన్ల ఫార్మాట్ లో మొత్తంగా 50 కూపన్లు అతికించాలి, అందులో ఏ ఒక్కటీ రిపీట్ అవ్వకూడదు మరియు కూపన్లను ఫొటో కాపీ చేసి అతికించరాదు. • అతికించిన కూపన్ల ఫార్మాట్ ను దగ్గరలోని సాక్షి కార్యాలయంలో కానీ, సాక్షి పేపర్ ఏజెంట్ కి గానీ సమర్పించాలి. • కూపన్ల ఫార్మాట్ ను సమర్పించాల్సిన చివరి తేదీని సాక్షి పత్రికలోనే చూడగలరు. • విజేతలను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయబడును.

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నాకు పెళ్లి అయ్యి రెండేళ్లయ్యింది. ప్రేమించే చేసుకున్నాం. కానీ తనకి కోపం ఎక్కువ. పట్టు ఎక్కువ. ఏదైనా సరే తన మాటే నెగ్గాలనుకుంటుంది. నన్ను తొక్కెయ్యాలని ప్రయత్నిస్తుంది. నాకు తన ప్రవర్తన ఏం నచ్చట్లేదు. ఏం చెయ్యాలో తెలియట్లేదు సార్. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి. – రవి

తొక్కించుకో అన్నా!!

'సార్! తొక్కించుకుంటంలో ఉన్న హాయి వేరెక్కడా లేనేలేదులే అన్నట్లుగా ఏంటి సార్ ఆ సలహా?'

అమ్మాయిలకు పైచేయి ఇవ్వడంలో ఉన్నంత సంతోషం నిజంగా ఇంకెక్కడా ఉండదు నీలూ! ఐ యామ్ టెల్లింగ్ ద ట్రూత్ నీలూ..!! కావాలంటే ట్రై చేసి చూడమను నీలూ!

'ట్రై చేస్తే ఏమవుతుంది సార్? తొక్కుడు పచ్చడి అవుతాడు సార్! తొక్కించుకోవడంలో సుఖం ఏముంది సార్?? ఏదో ఒళ్లు నెప్పులు ఎక్కువగా ఉంటే.. బోర్లా పడుకుని.. వైఫ్‌ని కాస్త తొక్కమంటే అదో ముచ్చట..! లైఫ్ అంతా తొక్కించుకుంటే ఏం సుఖం సార్?'

దాన్నే ప్రేమ అంటారు నీలూ..!! టు సరెండర్ కంప్లీట్లీ... కృష్ణుడిని సత్యభామ....

'సార్.. అది సరసం సార్!'

భార్యతో తన్నించుకోవడం, తొక్కించుకోవడం లైఫ్‌లాంగ్ సరసం నీలూ!

'ఈయనది వెటకారమో.. అద్వైజో.. నాకైతే అర్థం కాలేదు రవి! అన్నీ ఆలోచించుకుని.. అన్నింటికీ రెడీ అయిపోయి.. లైఫ్‌లాంగ్ సరసానికి దిగాలనుకుంటే తొక్కించుకో!!'' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com


తాప్సీ

## దౌడు తీయిస్తా

పురుష ప్రపంచం అని కొన్ని రంగాల్లో ఉంటుంది. ఉదాహరణకు కల్పనా చావ్లా అంతరిక్షంలోకి అడుగుపెట్టక ముందు వరకూ 'స్పేస్' అనేది పురుష ప్రపంచంగా ఉండేది. అలాగే గుర్రపు స్వారీ కూడా. గుర్రాన్ని దౌడు తీయించే శక్తి, సామర్థ్యాలు మగవాళ్లకే ఉంటాయనే భావన ఉండేది. రూపా సింగ్ ఈ ఫీలింగ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టారు. మహిళ తలచుకుంటే ఏ స్పేస్‌లోకైనా వెళ్లగలదని చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే భారత తొలి మహిళా హార్స్ జాకీ రూపాసింగ్ జీవితం వెండితెరకు రానుంది. తాప్సీతో 'నామ్ షబానా' చిత్రాన్ని తెరకెక్కించిన శివమ్ నాయర్ ఈ సినిమాకి దర్శకుడు. రూపా జీవితాన్ని సిల్వర్ స్క్రీన్ మీద చూపించడానికి హక్కులు దక్కించుకున్న శివమ్ ఇప్పుడు ఫుల్ స్క్రిప్ట్ రాసే పనిమీద ఉన్నారు. రూపా సింగ్ పాత్రకు తాప్సీయే కరెక్ట్ అనిపించి, స్టోరీ లైన్ చెప్పారట కూడా. హార్స్ రైడింగ్ అనేది పూర్తిగా మగవాళ్ల ఉద్యోగం అనే పరిస్థితుల్లో రూపాసింగ్ ధైర్యంగా ఈ ఉద్యోగంలో దౌడు తీశారు. మగవాళ్లకు దీటుగా కొనసాగడానికి ఆమె చాలా సవాళ్లు ఎదుర్కొన్నారు. ఇక తాప్సీ విషయానికి వస్తే.. ముందు గ్లామరస్ రోల్స్ చేసిన ఆమె తర్వాత లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేస్తూ, దూసుకెళుతున్నారు. 'తాప్సీ మంచి నటి కాదు. అందగత్తె కాదు' అనే విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. అయినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పింక్, నామ్ షబానా, బద్లా, గేమ్ ఓవర్ వంటి మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాలు చేస్తూ, ముందుకెళుతోన్న తాప్సీ హార్స్‌జాకీ పాత్రకు న్యాయం చేస్తారని చెప్పొచ్చు.

## స్కెచ్ కంప్లీట్

తన గ్యాంగ్‌తో కలిసి పగ తీర్చుకున్నాడు పార్థసారథి. ఇందుకోసం ఎలాంటి స్కెచ్‌లు వేశాడు? ప్రత్యర్థుల నుంచి ఎటువంటి సమస్యలను ఎదుర్కొన్నాడు అనే దృశ్యాలను మాత్రం వెండితెరపై చూడాల్సిందే. నాని హీరోగా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'గ్యాంగ్‌లీడర్'. ఇందులో రివెంజ్ రైటర్ పార్థసారథి పాత్రలో నటించారు నాని. ప్రియాంక, లక్ష్మి, శరణ్య, అనీష్ కురువిల్లాలు నాని గ్యాంగ్ సభ్యులుగా నటించారు. ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆగస్టు 30న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.


నాని

## ఆటకి డేట్ ఫిక్స్


ఐశ్వర్యా రాజేష్

ఐశ్వర్యా రాజేష్, డా. రాజేంద్రప్రసాద్, కార్తీక్‌రాజు, 'వెన్నెల' కిషోర్ ముఖ్యపాత్రల్లో భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి ది క్రికెటర్'. నిర్మాత కె.ఎస్.రామారావు సమర్పణలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై కె.ఎ.వల్లభ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కె.ఎస్.రామారావు మాట్లాడుతూ– ''రాజేంద్రప్రసాద్, ఐశ్వర్యా రాజేష్, భీమనేని శ్రీనివాసరావు కలిసి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న మరో గొప్ప సినిమా 'కౌసల్య కృష్ణమూర్తి'. ఎటువంటి సినిమానైనా ఎదుర్కోగలుగుతుందని 200 శాతం విశ్వాసంతో, నమ్మకంతో విడుదల చేస్తున్నాం. క్రియేటివ్ కమర్షియల్స్ ద్వారా మరో మంచి సినిమాను సమర్పిస్తున్నాను. తప్పని సరిగా ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు. ''మా సినిమా పాటలకు, ట్రైలర్స్‌కి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. సెన్సార్ నుంచి 'యు' సర్టిఫికెట్ పొందింది'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎ.సునీల్‌కుమార్, లైన్ ప్రొడ్యూసర్: వి.మోహన్‌రావు.


విజయ్ సేతుపతి

## ఉప్పెనలో ఉన్నాడు

సాయితేజ్ తమ్ముడు వైష్ణవ్ తేజ్ హీరోగా 'ఉప్పెన' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో బుచ్చిబాబు సన దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. మంగుళూరు బ్యూటీ కృతీశెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో తమిళనటుడు విజయ్ సేతుపతి ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి విజయ్ సేతుపతి తప్పుకున్నారని ఫిల్మ్‌నగర్‌లో వినిపించిన వార్తల్లో నిజం లేదని తెలిసింది. 'ఉప్పెన' తాజా షెడ్యూల్ ఈ నెల 17న హైదరాబాద్‌లో మొదలు కానుంది. 19 నుంచి విజయ్ సేతుపతి సెట్‌లో జాయిన్ అవుతారని యూనిట్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. కాకినాడ తీరం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని టాక్.


శిల్పాశెట్టి

## డైనమిక్ కమ్‌బ్యాక్

సుమారు పదమూడేళ్ల తర్వాత ఫుల్ లెంగ్త్ రోల్‌లో నటించడానికి రెడీ అవుతున్నారు శిల్పాశెట్టి. దాదాపు రెండు దశాబ్దాలపాటు హీరోయిన్‌గా సత్తా చాటారామె. ఇప్పుడు 'నికమ్మా' అనే యాక్షన్ ఫిల్మ్‌లో ఓ కీలక పాత్ర చేయడానికి సిద్ధమవుతున్నారు శిల్పా. ఈ చిత్రంలో అభిమన్యు దాసాని, షెర్లీ హీరోహీరోయిన్లుగా నటించనున్నారు. షబ్బీర్ ఖాన్ దర్శకత్వం వహించనున్నారు. ''నా కెరీర్‌లో ఇప్పటివరకు నేను ఇలాంటి పాత్ర చేయలేదు. ఈ పాత్ర నాకు ఎంతగానో నచ్చింది. ఇది ఒక ప్రత్యేకమైన ప్రాజెక్ట్. ఆడియన్స్‌కు నా కొత్త అవతారాన్ని చూపించడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని శిల్పాశెట్టి అన్నారు. ''శిల్పాశెట్టి మా సినిమాతో మళ్లీ కమ్‌బ్యాక్ ఇవ్వబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఇందులో ఆమె పాత్ర డైనమిక్‌గా ఉంటుంది'' అన్నారు షబ్బీర్‌ఖాన్ అన్నారు. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ప్రస్తుతం ఫ్యామిలీతో లండన్‌లో ఉన్నారు శిల్పా. హాలిడేస్ ఎంజాయ్ చేసి, ముంబై తిరిగి రాగేనే 'నికమ్మా' సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'ఓమ్ శాంతి ఓమ్' (2007), దోస్తానా (2008), ఢిష్కియా వుమ్ (2014) చిత్రాల్లో శిల్పా నటించినప్పటికీ వాటిలో అతిథి పాత్రలే. ఇప్పుడు ఫుల్ లెంగ్త్ రోల్‌లో కనిపించనుండటం ఆమె అభిమానులకు తీయని వార్తే.

## బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా కష్టపడాల్సిందే


బెల్లంకొండ సాయి శ్రీనివాస్

''నేనెప్పుడూ కథని నమ్ముతా.. హీరోయిజాన్ని కాదు. నా తొలి, మలి సినిమాలు 'అల్లుడు శీను, స్పీడున్నోడు' హీరోయిజం కోసం చేశాను. ఆ తర్వాత కథకి ప్రాధాన్యం ఉన్న సినిమాలు చేస్తున్నా. అవి సరిగ్గా ఆడినా, ఆడకున్నా ఆయా పాత్రల్లో నా కష్టం మాత్రం 100 శాతం ఉంటుంది. ప్రతిదీ నా తొలి సినిమాలానే భావిస్తా'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. కోనేరు సత్యనారాయణ నిర్మించారు. అభిషేక్ నామా విడుదల చేస్తున్న ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చెప్పిన విశేషాలు.

- 'రాక్షసన్' తమిళ సినిమా చూశా. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కావడంతో చాలా బాగా నచ్చింది. కిడ్నాప్ లాంటి సంఘటనలు సమాజంలో ఎన్నో జరుగుతుండటం పేపర్లలో, టీవీల్లో చూస్తున్నాం. అందుకే ఈ చిత్రాన్ని మనసు పెట్టి చేశా. బయట శవాల మధ్య, మార్చురీలో ఎక్కువ షూటింగ్ చేశాం. చిత్రీకరణ తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూ ఉండేవి.
- టీనేజ్ అమ్మాయిలను కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చే సైకో కిల్లర్‌ని పట్టుకుని, హత మార్చే పోలీసు అధికారి పాత్రలో నటించాను. 2018 డిసెంబరులోనే తమిళ సినిమా 'రాక్షసన్' చూశా.. విపరీతంగా నచ్చడంతో రీమేక్ హక్కుల కోసం రెండు నెలలు ప్రయత్నించాం. మనకు తెలిసిన, మనతో ఉన్న అమ్మాయిలకు ఏమైనా జరిగితే తట్టుకోలేం. అలాంటి పాయింట్‌నే ఈ సినిమాలో చర్చించాం. నా మరదలు పాత్ర చేసిన సిరి కిడ్నాప్‌కి గురై చనిపోతుంది. సినిమాలో రెండవ భాగం మొత్తం నా పాత్ర చాలా సీరియస్‌గా, భావోద్వేగంగా సాగుతుంది.
- ఈ సినిమాకి కథే హీరో. ఆ తర్వాతే నేను. గ్లామర్, కమర్షియల్ అంశాలు ఉండవు. ఇదొక తమిళ చిత్రం కంటే మా సినిమాలో సీన్స్‌ని ఇంకా బాగా తీశాం. రీమేక్ సినిమా చేయడం 90 శాతం సులభం, 10 శాతం ఒత్తిడి ఉంటుంది. గత జూలై నుంచి ఈ జూలైకి మూడు పెద్ద సినిమాలు చేశా.. చాలా కష్టపడ్డా.. అందుకే ఓ నెల సరదాగా అమెరికా వెళుతున్నా.
- నా ఫ్రెండ్స్ అంతా నెట్‌ఫ్లిక్స్ బ్యాచ్. 'రాక్షసుడు' ప్రివ్యూ చూసి, 'నిజమైన పోలీస్ అనిపించావ్.. గర్వంగా ఉంది' అన్నారు. మా ఫ్యామిలీ మెంబర్స్ కూడా తమిళ్ కంటే తెలుగులోనే బాగా చేశారని అన్నారు. ఇంత మంచి కథ నాకు ఎప్పుడూ దొరకలేదు. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వపడుతున్నా. ఇందులో అంతర్జాతీయ స్థాయి క్లయిమాక్స్ ఉంటుంది.
- రమేష్ వర్మ బాగా తీశాడు. నేనెప్పుడూ దర్శకత్వంలో కల్పించుకోను. డైరెక్టర్లు ఎలా చెబితే అలా చేస్తా. వీవీ వినాయక్, బోయపాటి శీనుగార్ల వంటి మాస్ డైరెక్టర్లతో కమర్షియల్ సినిమాలు చేశా. నటుడిగా నేనేంటో నిరూపించుకోవాలి. అందుకే 'సీత, రాక్షసుడు' వంటి వైవిధ్యమైన సినిమాలు ఎంచుకున్నా. సినిమా సినిమాకి వైవిధ్యమైన పాత్రలు చేయాలనుంది. కానీ, టాలీవుడ్‌లోనే కాదు.. ఇతర భాషల్లోనూ కొత్త కథలు దొరకడం కష్టమైపోతోంది. నా 'సాక్ష్యం, కవచం, సీత' సరిగ్గా ఆడనప్పుడు 'ఇంత కష్ట పడ్డాం. ఎందుకిలా?' అని బాధపడ్డా. అయితే సక్సెస్‌కంటే ఫెయిల్యూర్స్‌తోనే ఎక్కువ నేర్చుకుంటాం.
- నాన్నగారు (బెల్లంకొండ సురేశ్) పక్కా కమర్షియల్ నిర్మాత. 'సీత, రాక్షసుడు' వంటి కథలతో ఆయన సినిమాలు తీయరు. ఇండస్ట్రీ నేపథ్యం ఉన్నవారైనా, లేనివారైనా ఇక్కడ కష్టపడాల్సిందే. కొన్ని కథలను మనం జడ్జ్ చేయలేం. మనకి బాగా అనిపించినవి ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. ఈ మధ్య రెండు మూడు కథలు విన్నా ఏదీ ఫైనల్ చేయలేదు. రెండు బాలీవుడ్ అవకాశాలొచ్చాయి. కానీ, హిందీపై నాకు అంత పట్టు లేదు. అందుకే చేయలేదు.

## గ్లామర్ రోల్స్‌కి ఓకే

''నాది కేరళ. మా తల్లిదండ్రులు టీచర్స్. నాకు ఎటువంటి సినిమా నేపథ్యం లేదు. నటన అంటే ఇష్టం. కానీ, అమ్మానాన్న చదువు పూర్తయ్యాక ప్రయత్నించమన్నారు. ఎంటెక్ చదివాక చిన్న చిన్న యాడ్స్‌లో మోడల్‌గా చేశా. కొచ్చిలో పీజీ ఇంటర్న్‌షిప్ చేస్తుండగా మలయాళంలో సెకండ్ లీడ్ రోల్‌లో నటించే అవకాశం వచ్చింది'' అని అనఘ అన్నారు. కార్తికేయ హీరోగా, అనఘ హీరోయిన్‌గా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గుణ 369'. ప్రవీణ కడియాల సమర్పణలో అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనఘ పంచుకున్న విశేషాలు.


అనఘ

- మలయాళంలో మూడు సినిమాల్లో నటించా. హీరోయిన్‌గా నా తొలి సినిమా 'నట్పే తునై' (తమిళ్). ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించింది. తెలుగులో నా మొదటి చిత్రం 'గుణ 369'. అర్జున్ సార్ హైదరాబాద్‌కి పిలిపించి లుక్ టెస్ట్, ఫొటోషూట్ చేశారు. ఇందులో గీత పాత్రకి సరిపోతానని అదే రోజు ఓకే చెప్పారు.
- 'గుణ 369' కథ చాలా బాగుంది. పైగా నా పాత్ర కూడా నచ్చింది.. అందుకే ఈ సినిమాలో నటించేందుకు ఒప్పుకున్నా. ఇందులో గ్రామీణ ప్రాంతానికి చెందిన మధ్య తరగతి అమ్మాయి గీత పాత్ర చేశా. నా పాత్రకి చాలా ప్రాధాన్యత ఉంటుంది. కార్తికేయ మంచి సహనటుడు. తన పాత్ర బాగా రావడానికి ఎంతో కష్టపడతాడు.
- రొమాన్స్, లవ్, యాక్షన్... ఇలా అన్నీ ఈ చిత్రంలో రియలిస్టిక్‌గా ఉంటాయి. సెకండాఫ్‌లో ఎమోషన్స్ చాలా బాగుంటాయి. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతకి బాగా నచ్చుతుంది. మలయాళ, తమిళ, తెలుగు ఇండస్ట్రీల్లో పనిచేశా. అయితే టాలీవుడ్‌లో పనిచేయడం చాలా సౌకర్యంగా ఉంది. మంచి గౌరవం ఇస్తారు.. ఓ రాణిలా చూస్తారు.
- మలయాళ హీరోయిన్లు ఎక్కువగా టాలీవుడ్‌లో ఉండటం గర్వంగా ఉంది. నాకు సమంత, నయనతారలంటే ఇష్టం.. వారి క్రమశిక్షణ అన్నా కూడా ఇష్టమే. ఈ పోటీ ఇండస్ట్రీలో 10–15 ఏళ్లుగా వారు కష్టపడి రాణిస్తున్నారు.
- అల్లు అర్జున్‌గారి 'ఇద్దరమ్మాయిలతో' సినిమా చూశా.. ఆయన గ్రేట్ డ్యాన్సర్.
- ప్రేక్షకుల్లో గుర్తుండిపోయే పాత్రలు చేయాలని ఉంది. నటి అన్నాక అన్ని రకాల పాత్రలు చేయాలి. కథ డిమాండ్ చేస్తే గ్లామర్ రోల్స్ చేయడానికి రెడీ.

## రొమాంటిక్ సీన్స్ అంటే కష్టం


రూపేష్ కుమార్

''నేను పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లో. చిన్నప్పటి నుంచి నటన అంటే ఇష్టం. వైజాగ్‌లో సత్యానంద్ గారి వద్ద నటనలో శిక్షణ తీసుకున్నా. అవకాశాల కోసం చాలా ఆడిషన్స్‌కి వెళ్లా. కానీ, సమయం కలిసి రాలేదు. నేను, శివ కలిసి ఓ వెబ్ సిరీస్ చేశాం. అది చాలా బాగా రావడంతో సినిమా చేయొచ్చనే నమ్మకం కలిగి, '22' సినిమా మొదలు పెట్టాం'' అని రూపేష్ కుమార్ చౌదరి అన్నారు. దర్శకులు వీవీ వినాయక్, పూరి జగన్నాథ్, మారుతిల వద్ద పనిచేసిన శివ కుమార్ బి. దర్శకునిగా పరిచయమవుతున్న చిత్రం '22'. రూపేష్ కుమార్ చౌదరి హీరోగా, 'ఫలక్‌నుమా దాస్' ఫేమ్ సలోని మిశ్రా హీరోయిన్‌గా సుశీలా దేవి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. నేడు (శుక్రవారం) తన పుట్టినరోజుని పురస్కరించుకుని రూపేష్ కుమార్ చౌదరి విలేకరులతో మాట్లాడుతూ– ''22' నంబర్‌పై ఈ చిత్రకథ నడుస్తూ ఉంటుంది. చాలా ట్విస్ట్‌లు ఉంటాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో చేజింగ్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. నాకు పోలీస్ పాత్ర అంటే ఇష్టం.. పోలీసులంటే గౌరవం. నా తొలిసినిమాకే నాకిష్టమైన పోలీస్ పాత్ర చేసే అవకాశం రావడం అదృష్టం. 'టెంపర్'లో ఎన్టీఆర్‌గారు పోలీస్ పాత్రలో ప్రాణం పెట్టి చేశారు. 'గబ్బర్‌సింగ్' సినిమా కూడా చాలా బాగుంటుంది. శివగారి దర్శకత్వం బాగుంది కాబట్టే '22' సినిమా చేస్తున్నాం.. లేకుంటే వెబ్ సిరీస్‌తోనే ఆపేసేవాళ్లం. సినిమా కోసం బాగా కష్టపెడుతున్నాడు(నవ్వుతూ). సీఐ పాత్రకి మంచి ఫిజిక్ కోసం జిమ్‌లో వర్కవుట్స్‌తో పాటు, డైట్ ఫాలో అయ్యేలా చేస్తున్నాడు. ఆ కష్టం సినిమాకి అవసరం అనిపిస్తోంది. యాని మాస్టర్ నాకు గాడ్‌ఫాదర్‌లాంటివారు. ఆమె వల్లే ఈ అవకాశాలు వచ్చాయి. లీడ్‌రోల్స్ మాత్రమే చేయాలి, హీరో అవ్వాలనుకోలేదు.. మంచి నటుడు అనిపించుకుంటే చాలు. రొమాంటిక్ సన్నివేశాలు చేయడం నాకు అసౌకర్యంగా అనిపిస్తాయి. అయితే కథ డిమాండ్ చేస్తే చేస్తా'' అన్నారు.

### కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 2 | | | 3 | | | 4 | |
| 3 | | | 4 | | | 9 | | 8 |
| | 4 | 7 | 8 | 1 | | | 2 | |
| | 5 | | | | | 8 | | 4 |
| | 9 | 4 | | | | 2 | 1 | |
| 7 | | 8 | | | | | 6 | |
| | 7 | | | 6 | 3 | 1 | 8 | |
| 5 | | 9 | | | 1 | | | 7 |
| | 8 | | | 7 | | | 9 | 2 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| [illegible] | [illegible] | 7 | [illegible] | [illegible] | 1 | 6 | [illegible] | 2 |
| 2 | 9 | [illegible] | 6 | [illegible] | 8 | [illegible] | 5 | 1 |
| 4 | 8 | 1 | [illegible] | [illegible] | [illegible] | 6 | [illegible] | 3 |
| 9 | [illegible] | 5 | 2 | [illegible] | 7 | 3 | [illegible] | 8 |
| 1 | 7 | [illegible] | [illegible] | 8 | [illegible] | [illegible] | 6 | 9 |
| 8 | [illegible] | 6 | 5 | [illegible] | 9 | 2 | [illegible] | 4 |
| 6 | [illegible] | 4 | [illegible] | [illegible] | [illegible] | 9 | 8 | 6 |
| 3 | 6 | [illegible] | 8 | [illegible] | 4 | [illegible] | 2 | 7 |
| 7 | [illegible] | 8 | 1 | [illegible] | [illegible] | 4 | [illegible] | [illegible] |

## చరిత్ర మరచిపోయిన లీడర్


సందీప్ మాధవ్

''జార్జిరెడ్డి ఈ తరానికి తెలియకపోవచ్చు. 1965 నుంచి 1975 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకున్న ప్రతి విద్యార్థికి జార్జ్ జీవితం గురించి తెలుసు. అలాంటి టెర్రిఫిక్ లీడర్ గురించి నేటి తరం తెలుసుకునేలా 'జార్జిరెడ్డి' చిత్రం రూపొందించాం'' అని చిత్రబృందం పేర్కొంది. 'వంగవీటి' ఫేమ్ సందీప్ మాధవ్ (సాండి) లీడ్ రోల్‌లో 'దళం' ఫేమ్ జీవన్ రెడ్డి తెరకెక్కించిన సినిమా 'జార్జిరెడ్డి'. సిల్లీ మాంక్స్, త్రీ లైన్స్ సినిమా పతాకాలపై మైక్ మూవీస్ అధినేత అప్పిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'చరిత్ర మరచిపోయిన లీడర్' అనే విషయాన్ని పోస్టర్‌లోనే చెప్పారు. దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ– ''సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సాగిన జార్జిరెడ్డి ప్రస్థానం నేటికీ ఎన్నో విద్యార్థి ఉద్యమాలకు ఆదర్శంగా నిలుస్తోంది. విద్యార్థి ఉద్యమాల్లో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన జార్జిరెడ్డిని చాలా చిన్న వయసులోనే కొందరు ప్రత్యర్థులు క్యాంపస్‌లోనే హత్య చేశారు. ఎందరో విద్యార్థులను కదిలించిన విద్యార్థి నేత జీవితం వెండితెరపై చూపిస్తున్నాం. మా సినిమాని త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమేరా: సుధాకర్ యెక్కంటి, సంగీతం: సురేష్ బొబ్బిలి, సహ నిర్మాత: సంజయ్ రెడ్డి, అసోసియేట్ ప్రొడ్యూసర్లు: దాము రెడ్డి, సుధాకర్ యెక్కంటి, నేపథ్య సంగీతం: అర్జిత్ దత్తా.

## గన్‌దరగోళం

హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ ఒకరి మీద ఒకరు యుద్ధం ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. హృతిక్‌ను ఢీ కొట్టడానికి టైగర్ ప్రపంచంలోనే పవర్‌ఫుల్ మెషీన్‌గన్ 'గాట్లింగ్'తో వాడబోతున్నారని తెలిసింది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్న యాక్షన్ చిత్రం 'వార్'. యశ్ చోప్రా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. యాక్షన్ చిత్రాల ప్రేమికులకు కనువిందులా ఉండేందుకు అద్భుతమైన లొకేషన్స్‌లో యాక్షన్ సీన్లు చిత్రీకరించారు. ఓ సన్నివేశంలో ఈ మెషీన్‌గన్‌తో సిటీని ధ్వంసం చేస్తూ గన్‌దరగోళం సృష్టిస్తారట టైగర్. ఈ సీన్స్ సినిమాకు ఓ హైలైట్‌గా నిలుస్తాయట. వాణీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లోనూ రిలీజ్ కానుంది.


టైగర్ ష్రాఫ్

## నవ్వుకునోళ్లకు నవ్వుకున్నంత


రవళి, శ్రీనివాస్

సర్వం శ్రీనివాస్, రవళి, సరిత, మధుశ్రీ, లావణ్య రెడ్డి, పూజ ముఖ్య తారలుగా అతిమల్ల రాబిన్ నాయుడు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సర్వం సిద్ధం–నవ్వుకున్నోళ్లకు నవ్వుకున్నంత'. సినెటేరియా మీడియా వర్క్స్ పతాకంపై శ్రీలత బి. వెంకట్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ని దర్శకులు వీఎన్ ఆదిత్య, 'అమ్మ' రాజశేఖర్ విడుదల చేశారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్‌ను చూశాక సినిమా రంగంలోని అలనాటి రోజులు గుర్తుకు వచ్చాయి. టీజర్‌లో చూపించినట్లుగా ఒక్కరోజైనా సినీ దర్శకునిగా సెట్లో మెలగాలనే ఆకాంక్ష చాలా మందికి ఉంటుంది'' అన్నారు. ''టీజర్ చూస్తుంటే సినిమా 100 శాతం కామెడీ నేపథ్యంలో ఉంటుందని తెలుస్తోంది'' అన్నారు 'అమ్మ' రాజశేఖర్. ''సినిమా చూసే ప్రేక్షకులకు పొట్ట చెక్కలవ్వడం ఖాయం'' అని అతిమల రాబిన్ నాయుడు అన్నారు. శ్రీలత బి.వెంకట్, సినెటేరియా గ్రూప్ సీఈవో వెంకట్ బులెమోని, ఎన్.సి.సి మార్కెటింగ్ హెడ్ శ్రీవికాస్, సింబయోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ సంచాలకులు డా. రవి కుమార్ జైన్, టెక్స్‌టైల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అమ్మనబోలు ప్రకాశ్, 'సమరం' చిత్రం హీరో సాగర్ జి, లావణ్య, పూజ, ఫరీనా, నటులు సర్వం శ్రీనివాస్, కెమెరామేన్ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డేవిడ్ జి.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
2-8-2019

ఫ్యాషన్

# ఫుల్ అండ్ హాఫ్

ఇప్పుడు ఫుల్ శారీ కొత్త కట్టుతో ఆకట్టుకుంటోంది. లంగా ఓణీ స్టైల్‌కి షిఫ్ట్ అయ్యి సంప్రదాయ వేడుకల్లో సొగసుగా మెరుస్తోంది.

నిర్వహణ: **ఎన్.ఆర్.**



నయాతరం వినూత్నంగా ఆలోచిస్తోంది. అమ్మ చీరకట్టును మార్చి కొత్తకట్టుతో కళకళలాడుతోంది.



గులాబీ పట్టు చీరను నీలం రంగు లెహంగా మీద ఓణీలా చుడితే వచ్చిన అందం ఇది.



ఎడమ చేతి కిందుగా, నడుమున పెట్టిన చీర కుచ్చిళ్లు.. లెహంగా అంచును తాకుతూ.. భుజం మీదుగా తీసిన పల్లూ.. వేడుకంతా కళకళలే.





చీర కుచ్చిళ్లు, పవిట చెంగు ముందే సెట్ చేసుకొని లెహంగా మీదుగా కట్టుకుంటే డిజైనర్‌వేర్ కాకుండా ఉండదు.



వైట్ లెహంగా అండ్ వైట్ శారీ కాంబినేషన్.. ఏ వేడుకలోనైనా బంగారమైన కళ.



ప్లెయిన్ అండ్ ప్లెయిన్ కాంబినేషన్‌తోనూ చీరకట్టును ఇలా కొత్తగా మెరిపించవచ్చు.

ప్లెయిన్ లెహంగా చెక్స్ ఉన్న పట్టుచీర ఓ కలర్‌ఫుల్ కాంబినేషన్.











శ్రావణమాసం పూజలప్పుడైనా చీరకట్టుకోవచ్చుగా అనే అమ్మ కోరికను.. లంగా ఓణీ వేసుకుంటే ఇంటికి కళ అనే నాన్న ముచ్చటను.. ఇలా ఫుల్ అండ్ హాఫ్ శారీతో ఖుషీ చేయచ్చు.

- హాఫ్‌వైట్ శారీని వంగపండు రంగు లెహంగా, జ్యూజ్‌తో జతకడితే ఏ సంప్రదాయ వేడుకైనా మరింతగా వెలిగిపోవాల్సిందే!
- లెహంగా, చీర రంగులు ఒకేలా ఉన్నా జరీ అంచులు కనిపించేలా కడితే ఓ కొత్త స్టైల్.

పాత బంగారం

# ప్రకృతిసిద్ధంగా శరీర సౌందర్యం



ఆర్గానిక్, నేచురల్, వీగన్, గోగ్రీన్ లాంటి హ్యాష్‌ట్యాగ్స్ ఈమధ్యకాలంలో సోషల్‌మీడియాలో తరచూ కనిపిస్తున్నాయి. ఈ డిజిటల్ ప్రపంచంలో ఇవి ప్రముఖమైన పదాలుగా మారాయి. కారణం అవి పాకశాస్త్రంలోనే కాదు. శరీరసౌందర్యాన్ని పెంపొందించుకోవడంలోనూ ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతకాలంలో ఆరోగ్యవంతంగా జీవించడం, స్థిరమైన జీవన విధానం అనేవి ప్రధానంగా అందర్నీ ప్రభావితం చేస్తున్నాయి. ఇవే శరీర సౌందర్యం విషయంలో కూడా కీలకంగా మారాయి. అందుకే ఎన్ని పరిణామాలు చోటుచేసుకున్నా వినియోగదారులు ఇందుకు ఉపయోగపడే వస్తువుల్ని వినియోగిస్తూనే ఉన్నారు. అయితే ఇక్కడ అందరి మదిలో ఉత్పన్నమయ్యే ప్రశ్న ఒక్కటే – మనకు లభిస్తున్న సబ్బులు, సౌందర్య సాధనాలన్నీ స్వచ్ఛమైనవేనా?

మన శరీరంలో అతిపెద్ద అవయవం చర్మం. చర్మం ద్వారా ఎన్నో పోషకాలు మన శరీరం లోపలికి వస్తాయి. అయితే ఎన్నో మంచి పోషకాలతోపాటు, చర్మానికి చెడుచేసే ఎన్నో హానికారక రసాయనాలు కూడా చర్మం ద్వారా లోపలికి వచ్చేస్తుంటాయి. అందుకే అవి వాడేముందు మనం ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. చర్మ సౌందర్య ఉత్పత్తుల్లో ఏ పదార్థాలు కలిపారు, ఎలాంటివి ఉపయోగించారో తెలుసుకోవాలని చర్మ సంరక్షణ నిపుణులు సూచిస్తున్నారు.

గతంలో మన ఇళ్లలో పసుపు, చందనం, పాలతో స్నానం చేయించేవారు. వాటిని మనం పాతపద్ధతులంటున్నాం. కానీ అవి ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్‌గా మారాయి. సంపూర్ణ చర్మ సంరక్షణ కావాలంటే మనం ఉపయోగించే ఉత్పత్తుల్లో కొన్ని తప్పక ఉండాలి. అవి ఏంటంటే...



- **చందనం:** క్రమం తప్పకుండా చందనం ఉపయోగించడం వల్ల చర్మానికి చాలా ఉపయోగాలు. ముఖ్యంగా చందనం బ్యాక్టీరియాను రాకుండా చేస్తుంది. చర్మాన్ని ప్రకాశించేలా చేస్తుంది. ట్యాన్‌ని అరికడుతుంది. అన్నిటికీ మించి మీ చర్మం పొడిబారకుండా చేస్తుంది. దీనివల్ల మీ చర్మంపై ఎలాంటి ముడతలు కన్పించవు.



- **పసుపు:** చర్మంపై ఉండే మచ్చలను తొలగించి ముఖం ప్రకాశవంతంగా కన్పించేలా చేస్తుంది. హానికరమైన బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా చేస్తుంది. అన్నిటికీ మించి మొటిమల నివారణకు పసుపుని మించిన ఔషధం లేదు. పసుపు క్రమం తప్పకుండా వాడితే మొటిమలు రావు.



- **కుంకుమ పువ్వు:** కుంకుమ పువ్వులో అద్వితీయమైన విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నాయి. దీనివల్ల చర్మం పొడిబారకుండా స్వచ్ఛంగా, స్మూత్‌గా తయారవుతుంది.



- **కలబంద:** కలబందను అలోవెరా అని కూడా అంటారు. ఇది చర్మంపై ఒక పొరలాగా ఉపయోగపడుతుంది. ఈ లేయర్ వల్ల చర్మంపై ఎప్పుడూ తేమ ఉంటుంది. అంతే కాదు ఇందులో ఉన్న యాంటి ఆక్సిడెంట్స్, ఖనిజాలు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి.



- **బాదం పాలు:** ఎండ వేడి వల్ల చర్మం పాడవకుండా కాపాడుతుంది.

ఈ సహజసిద్ధమైన పదార్థాలతో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంతోపాటు చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుకోవచ్చు.

సామాజికం

# ప్రకృతి హితమే రక్షగా...

**'రక్షాబంధనం' అనేది అన్న చెల్లెలికి ఇచ్చే రక్షణకు సంబంధించినది మాత్రమే కాదు. సమాజం పట్ల బాధ్యతను తెలియజేసేది. ఒక్క మార్పుతో ఈ పండగను మరింత వేడుకగా జరుపుకోవచ్చు. అదెలాగో చెబుతున్నాయి కొన్ని పర్యావరణహిత సంస్థలు.**





### 1. మొక్కలకే రాఖీలు

మీరు మనసు పెడితే మొక్కలకే రాఖీలను పూయించవచ్చు అంటున్నారు గార్గి. 'బా నో బాట్సో' వ్యవస్థాపకులు గార్గి ఔరంగాబాద్ నివాసి. చెట్లు, మొక్కల నుంచి ఆకులు, గింజలు, షెల్ ..వంటి భాగాలను సేకరించి వాటిని రాఖీల తయారీ కోసం వాడుతున్నారు. ఆన్‌లైన్ ప్రచారం ద్వారా 'నా సోదరి నా బలం' అనే ట్యాగ్‌తో క్యాంపెయిన్ ద్వారా గార్గి మరో మైలురాయి దాటారు.

### 2. హెచ్ఐవీ పిల్లలకు రాఖీ



బెంగుళూరులోని జీసస్ హెచ్ఐవీ హోమ్‌లో ఏడాది నుంచి పదేళ్ల వయసున్న హెచ్ఐవీ ప్రభావిత పిల్లలు తలదాచుకుంటున్నారు. వీరికి 'సీడ్ పేపర్ ఇండియా' వ్యవస్థాపకులు రోషన్ రాయ్ పర్యావరణ హితమైన రాఖీలను రెండేళ్లుగా అందిస్తున్నారు. ఈ రాఖీలు ఎలా ఉంటాయంటే .. మొక్క వచ్చేందుకు అనువైన విత్తనాలు, సేంద్రీయ ఎరువులు, కొబ్బరి నారతో తయారు చేసిన కార్డులను.. ఇలాంటి వాటితో ఒక కిట్‌ని రూపొందించి వారికి ఇస్తున్నారు.

### 3. స్లమ్ మహిళలకు ఉపాధి

ప్రజలతో కలిసి పనిచేస్తేనే అనుభవాలు పువ్వుల పరిమళాలవుతాయి. ఢిల్లీ వాసి సౌరభ్ డిగ్రీ తర్వాత సొంతంగా బాల్ పెన్ తయారీ వ్యాపారం పెట్టుకున్నాడు. ఏడాది గడిచాక పెన్నులన్నీ ప్లాస్టిక్‌వే అని ఆ వ్యాపారాన్ని వదులుకున్నాడు. 'బయో క్యూ' పేరుతో 'పర్యావరణహితమైన స్టేషనరీ'ని ఏర్పాటు చేశాడు. ఈ కంపెనీ ద్వారా ప్రతి నెలా 5–6 లక్షల విత్తనాల పెన్నులు, పెన్సిళ్లను తయారు చేయడం మొదలుపెట్టాడు. ఈ ఆలోచన నుంచే మొక్కల రాఖీలను తయారు చేయాలనే ఆలోచన వచ్చిందని చెప్పాడు సౌరభ్. 'కిందటేడాది 6,000ల సీడ్ రాఖీలు తయారుచేశాం. ఈ ఏడాది 15,000 చేయాలని టార్గెట్ పెట్టుకున్నాను. ఢిల్లీలోని చుట్టుపక్కల స్లమ్ ఏరియాల నుంచి 20 మంది మహిళలతో ఈ గ్రీన్ రాఖీల తయారీ చేస్తున్నాం. దీనిద్వారా వారికి ఉపాధి కల్పిస్తున్నాం' అని ఆనందంగా తెలిపారు సౌరభ్.



### 4. ఒక్కో దారం ఒక్కో కథ




సామాజిక సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు మధ్యప్రదేశ్‌కి చెందిన గ్రామ్ ఆర్ట్ ఈ వేడుకను ఒక అవకాశంగా తీసుకొని ఈ రాఖీలను రూపొందించింది. ముంబయ్‌లో ఆదివాసీల హక్కుల కోసం ర్యాలీ చేసిన మానవ హక్కుల కార్యకర్త నట్లీన్ 19 కత్తి పోట్లకు గురయ్యారు. ఆమె జ్ఞాపకార్థం 'గ్రామ్ ఆర్ట్' 19 ముడులతో కూడిన రాఖీని తయారు చేసింది. అలాగే గర్భాశయ ఆకారంలో ఉన్న రాఖీ ద్వారా సమాజంలో లింగ అంతరాన్ని ఎత్తి చూపుతుంది. ఇలా ఒక్కో దారం ఒక్కో కథను కళ్లకు కట్టేలా చేస్తుంది గ్రామ్ ఆర్ట్. 'హమ్ కమ్జోర్ నహీ' ప్రచారంలో భాగంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కి చెందిన 100 మంది గ్రామీణ మహిళలతో కలిసి ఈ విత్తన రాఖీల తయారీని చేపట్టారు. కిందటేడాది 12,000 రాఖీలను అమ్మిన ఈ సంస్థ ఈ ఏడాది 20,000ల సీడ్ రాఖీలను అమ్మాయిలని నిర్ణయించుకున్నామని సంస్థ వ్యవస్థాపకులు లలిత్ వంశీ తెలిపారు.

### 5. మట్టితో అనుబంధం



అభికా క్రియేషన్స్ మట్టితో రాఖీలను తయారు చేస్తుంటుంది. ఈ రాఖీలను బటర్ పేపర్‌లో ప్యాక్ చేస్తారు. మట్టి రాఖీ, పేపర్ నేలలో సులువుగా కలిసిపోతుంది. 'వీటిని కొంతమంది తమ ఆప్తులకు కానుకలుగా కూడా ఇస్తుంటారు' అని ఆనందంగా తెలిపారు వ్యవస్థాపకులు.

### 6. పేపర్ రాఖీ



పేపర్‌తో తయారు చేసిన రాఖీతో పాటు కిట్‌లో అరుదైన జాతి మొక్కల విత్తనాలు చుట్టి ఉన్న కాగితం పాకెట్ కూడా ఉంటుంది. ఈ విత్తనాల ద్వారా మొక్కల పెంపకం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. నేటి తరాన్ని రకరకాల గ్యాడ్జెట్లు తమవైపుకు తిప్పుకుంటున్నాయి. ఇలాంటప్పుడు పర్యావరణ మూలాలకు వారిని తీసుకెళ్లడం అత్యవసరం' అంటారు బైస్మిటా వ్యవస్థాపకులు స్మిత.

రాఖీని సోదర ప్రేమకు, రక్షణకు, సంఘీభావనకు గుర్తుగా ఉపయోగిస్తారు. అయితే, చాలా వరకు రాఖీలో ఉపయోగించే ప్లాస్టిక్, రసాయనాల రంగులు పర్యావరణానికి హాని చేస్తున్నాయి. వీటికి సరైన పరిష్కారం పర్యావరణ హితమైనవి ఎంపిక చేసుకోవడమే. మన చుట్టూ ఉన్నవారికి ప్రకృతి పట్ల వారి బాధ్యతను గుర్తుచేయడమే.



# మ్యావ్

*('ఫ్యామిలీ' మొదటి పేజీ తరువాయి భాగం)*

పోస్టర్‌లో కంగనా కన్ను ఒకదాన్ని కవర్ చేస్తూ పిల్లి కన్ను ఉంటుంది. ఫ్లోరా ఎప్పుడో తీసిన ఆర్ట్ ఫొటోలోని యువతి కన్నును కూడా ఒక పిల్లి కన్ను కవర్ చేస్తుంటుంది. ఆమె ఆరోపణకు జడ్జిమెంటల్ హైక్యా నిర్మాణ సంస్థ 'బాలాజీ మోషన్ పిక్చర్స్' ఇంతవరకు వివరణ ఇవ్వలేదు. ఇదంటే, ఆర్ట్‌వర్క్ నుంచి పోస్టర్ కాపీ. డైరెక్ట్‌గా పోస్టర్ టు పోస్టర్ కాపీలు కూడా బాలీవుడ్‌లో పుష్కలంగా ఉన్నాయి. వాటి సంగతేంటి? ఎవరూ అడగలేదు. ఎవరూ మాట్లాడలేదు.

'పికె'లో ఆమిర్ ఖాన్ దిగంబరంగా రేడియో పట్టుకుని నిలబడి ఉండే పోస్టర్.. క్విమ్ బారీరోస్ అనే పోర్చుగీస్ గాయకుడి 1973 నాటి సాంగ్స్ ఆల్బమ్ కవర్‌కు కాపీ! పికె 2014లో రిలీజ్ అయింది. షారుక్‌ఖాన్ 'దిల్వాలే' పోస్టర్ ఆ ముందు ఏడాదే వచ్చిన హాలీవుడ్ మూవీ 'ది బెస్ట్ ఆఫ్ మి' పోస్టర్‌కి కాపీ. ఆకాశంలోని మబ్బుల్లో హీరో హీరోయిన్ ఉంటారు.

'అతిథి తుమ్ కబ్ జావోగీ' పోస్టర్ 'లైసెన్స్ టు వెడ్' పోస్టర్‌కి (బెడ్ మీద భార్యాభర్తల మీద అతిథి పడుకుని ఉంటాడు), 'ఫూంక్2' పోస్టర్ 'ఛేజర్' పోస్టర్‌కి (ముఖం మీద పెట్టుకున్న అరిచేయిలోంచి ఒక కన్ను కనిపిస్తుంటుంది), 'మర్డర్2' పోస్టర్ 'యాంటీ క్రైస్ట్' పోస్టర్‌కి (దేహవాంఛలు దెయ్యాల్లా చుట్టుముట్టి ఉంటాయి), 'ఐత్‌రాజ్' పోస్టర్ 'ది గ్రాడ్యుయేట్' పోస్టర్‌కి (యువతి అండర్‌వేర్ వేసుకుంటుంటే హీరో నిలబడి చూస్తుంటాడు), 'అంజానా అంజానీ' పోస్టర్ 'యాన్ ఎడ్యుకేషన్' పోస్టర్‌కి (వెల్లికిలా రివర్స్‌లో పడుకుని ఉన్న హీరో హీరోయిన్ చెంపలు తాకించుకుంటూ ఉంటారు), 'జిందగీ న మిలేగీ దొబారా' పోస్టర్ 'లార్డ్స్ ఆఫ్ డాగ్‌టౌన్' పోస్టర్‌కి (ఒంటిపైన షర్ట్ లేని వ్యక్తితో పాటు ముగ్గురు నడుచుకుంటూ వస్తుంటారు), 'రా.వన్' పోస్టర్ 'బాట్స్‌మ్యాన్ బిగిన్స్' పోస్టర్‌కి (హీరో రెండు చేతులతో హీరోయిన్‌ని మోసుకుంటూ వస్తుంటాడు).. ఇవన్నీ అచ్చు గుద్దినట్లుగా కాపీ.



**హాలీవుడ్ : ఎవరిది వాళ్లే కాపీ!**
**(బ్యాక్ టు బ్యాక్ పోస్టర్‌లు వేసిన చిత్రాలు)**

హాలీవుడ్ పోస్టర్‌లను చూసి ముచ్చటపడి తెలుగువుడ్ తయారు చేసుకున్న పోస్టర్‌లు కూడా ఉన్నాయి. సైమన్ బిర్చ్–బాహుబలి, యాన్ ఆఫీసర్ అండ్ జెంటిల్మన్–తుపాకీ, హ్యారీ పోటర్: ఇట్ ఆల్ ఎండ్స్–రోబో 2.ఓ, బ్లేడ్ రన్నర్–సాహో, టిక్ టిక్: ది ఆస్వంగ్ క్రానికల్స్–కబాలి, మిషన్ ఇంపాజిబుల్: ఘోస్ట్ ప్రొటోకాల్–విశ్వరూపం, ది డ్రాగన్ బాల్–అఖిల్, కొల్లాటరల్ బ్యూటీ–యు టర్న్.. ఇలా పోస్టర్‌లలో పోలికలు కనిపిస్తాయి.

ఇవన్నీ కాపీలు కాదనీ, అనుకరణలు అనుసృజనలు మాత్రమేనని అనుకున్నా ఎక్కడ ఎవరి నుంచి ఇన్‌స్పైర్ అయ్యామో వారికి క్రెడిట్ ఇవ్వడం కనీస ధర్మం. ఈ ధర్మాన్ని పాటించనప్పుడే ధర్మ యుద్ధాలు మొదలవుతాయి. అయినా మనది కాని దాన్ని మనది అని చెప్పుకోవడం ఏం బాగుంటుంది? ఎవరి గొప్పతనాన్ని వారికి ఇచ్చేయడం కూడా గొప్పతనమే.




నటీనటులు ఓ మంచి పాత్ర దొరికితే చాలు తమలోని నట విశ్వరూపాన్ని చూపించాలనుకుంటారు. అలాంటి పాత్ర దొరికినప్పుడు ఎటువంటి మేకప్‌కైనా, మేకోవర్‌కైనా సిద్ధమవుతారు. కొంతమంది నటీనటులైతే ఏకంగా న్యూడ్‌గా (నగ్నంగా) నటించటానికి కూడా వెనకాడరు. అలా న్యూడ్‌గా నటించిన కొంతమంది ఆర్టిస్టుల గురించి ఈ వారం క్విజ్...



**2** అంతరిక్షంలోని ఓ గ్రహం నుండి రైలు పట్టాలపై సడన్‌గా ఊడిపడతాడు ఈ హీరో. ఓ రేడియోను అడ్డు పెట్టుకొని నిలబడతాడు. ఆ ప్రముఖ బాలీవుడ్ హీరో ఎవరో తెలుసా?
ఎ) సల్మాన్‌ఖాన్ బి) జాన్ అబ్రహాం
సి) ఆమిర్ ఖాన్ డి) షారుక్ ఖాన్

**3** 1993లో యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ హీరోగా విడుదలైన చిత్రం 'ఆగ్రహం'. ఈ చిత్రంలో హీరో ఓ సీన్‌లో బట్టలు లేకుండా కనపడాల్సి వస్తుంది. కె.యస్. రవికుమార్ దర్శకత్వం వహించిన ఆ సినిమాలో హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) నగ్మా బి) అమల సి) సంగీత డి) కళ్యాణి



**10** 'నషా' అనే బాలీవుడ్ చిత్రం కోసం న్యూడ్‌గా నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) మల్లికా షెరావత్ బి) సన్నీ లియోన్ సి) నీతూ చంద్ర డి) పూనమ్ పాండే

**4** పోసాని కృష్ణమురళి దర్శకత్వం వహించిన ఆ సినిమా అందరికీ గుర్తుండిపోయే విజయాన్ని నమోదు చేసుకుంది. ఆ చిత్రంలో హీరో న్యూడ్‌గా నటిస్తారు. ఎవరా హీరో?
ఎ) కృష్ణ బి) హరికృష్ణ
సి) శ్రీకాంత్ డి) పోసాని కృష్ణమురళి

**5** హీరోయిన్ విజయశాంతిని రౌడిమూక అల్లరిపెట్టి వివస్త్రను చేస్తారు. ఆమె లెక్చరర్‌గా నటించిన ఆ సినిమా పేరేంటో తెలుసా? (చిన్న క్లూ: చిత్రానికి దర్శకుడు టి.కృష్ణ)
ఎ) రేపటి పౌరులు బి) దేవాలయం
సి) వందేమాతరం డి) ప్రతిఘటన

**6** శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఓ చిత్రంలో ఒక ఫైట్ సీన్‌లో మంటలతో తన శరీరం కాలుతుండగా ఒంటిపై ఉన్న బట్టలు ఊడదీసి న్యూడ్‌గా బ్రిడ్జిపై నుండి మురుగు కాలువలోకి దూకే సన్నివేశంలో నటించిన హీరో ఎవరో తెలుసా?
ఎ) విక్రమ్ బి) విజయ్ సి) అర్జున్ డి) సిద్ధార్థ్

**7** 'అడై' అనే తమిళ చిత్రంలో ఒంటిపై నూలుపోగు లేకుండా దాదాపు 15 రోజులపాటు నటించారు ఆ నటి. 'ఆమె' పేరుతో తెలుగులో కూడా విడుదలైంది ఈ సినిమా. ఎవరా నటి కనుక్కోండి.
ఎ) అమలాపాల్ బి) మేఘా ఆకాశ్
సి) షాలినీ పాండే డి) సోనియా అగర్వాల్

**8** రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో విడుదలైన 'ఐస్‌క్రీమ్' చిత్రంలో దాదాపు న్యూడ్‌గా నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) అనైకా సోఠి బి) తేజస్విని మడివాడ
సి) అనుష్కృతి డి) మధుశాలిని

**9** 2019లో విడుదలైంది ఈ చిత్రం. హీరో దొర బిడ్డను ప్రేమించాడని అతనిపై తప్పుడు కేసు పెట్టి కటకటాల్లో పెట్టిస్తాడు దొర. తను నటించిన మొదటి చిత్రంలోనే ఫుల్ న్యూడ్ సీన్‌లో నటించిన నూతన నటుడెవరో తెలుసా?
ఎ) నవీన్ పొలిశెట్టి బి) కార్తికేయ
సి) ఆనంద్ దేవరకొండ డి) కల్యాణ్ దేవ్

**11** 1982లో విడుదలైన ప్రేమకథా చిత్రం 'నిరీక్షణ'. ఆ చిత్రంలో హీరో భానుచందర్ బట్టలూడదీసి కొడతారు పోలీసులు. ఆ చిత్రదర్శకుడు బాలుమహేంద్ర. మ్యూజికల్‌గా ఈ సినిమా పెద్ద హిట్. ఆ చిత్ర సంగీత దర్శకుడెవరో తెలుసా?
ఎ) కె.వి. మహదేవన్
బి) ఇళయరాజా
సి) చక్రవర్తి
డి) మాధవపెద్ది సురేశ్

**12** డాన్స్‌మాస్టర్‌గా ఫేమస్ అయిన ప్రభుదేవా హీరోగా నటించిన మొదటి చిత్రం 'ప్రేమికుడు'. ఆ చిత్రంలో ప్రభుదేవాను పోలీస్‌స్టేషన్లో పెట్టి ఓ లేడీ పోలీసాఫీసర్ కొడుతుంది. ఆ సీన్‌లో న్యూడ్‌గా కనిపిస్తారు ప్రభుదేవా. ఇంతకీ ఆయన ప్రేమించిన హీరోయిన్ ఎవరు ?
ఎ) నయనతార బి) మధుబాల సి) నగ్మా డి) ప్రేమ

**13** 'ప్రాణ్ జాయే పర్ వచన్ నా జాయే' అనే హిందీ చిత్రంలో సునీల్‌దత్ హీరోగా నటించారు. ఆ చిత్రంలో న్యూడ్‌గా నటించిన హీరోయిన్ ఎవరో తెలుసా?
ఎ) జయప్రద బి) రవీనా టాండన్
సి) శ్రీదేవి డి) రేఖ

**14** సిద్ధార్థ్ హీరోగా నటించిన 'ఆట' సినిమాలో హీరోయిన్ ఇలియానా. వి.యన్. ఆదిత్య దర్శకత్వం వహించిన ఆ చిత్రంలో న్యూడ్‌గా నటించిన కమెడియన్ ఎవరో గుర్తుందా?
ఎ) బ్రహ్మానందం
బి) సునీల్ సి) ప్రభాస్ శ్రీను డి) శ్రీనివాస్ రెడ్డి

**15** ఐ.వి. శశి అనే మలయాళ దర్శకుడు దాదాపు 150 చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన భార్య హీరోయిన్‌గా దాదాపు 250 సినిమాల్లో నటించారు. 'అంగడిబొమ్మ' అనే చిత్రంలో భర్త దర్శకత్వంలోనే భార్య నగ్నంగా నటించారు. ఆమె పేరేంటో తెలుసా?
ఎ) సీమ బి) శారద
సి) విజయ నిర్మల డి) సీత



**16** 'దండుపాళ్యం' చిత్రంలో హీరోయిన్ నగ్నంగా నటించారు. దర్శకుడు శ్రీనివాసరాజు కథ చెప్పేటప్పుడే ఆ సీన్ గురించి చెప్పి నగ్నంగా నటిస్తేనే ఆ సినిమా చెయ్యాలి అని చెప్పారట. ఎవరా హీరోయిన్ గుర్తుందా?
ఎ) పూజా గాంధీ బి) శ్రద్ధా శ్రీనాథ్
సి) సంజన డి) శాన్వీ

**17** కమల్‌హాసన్ ద్విపాత్రాభినయంలో నటించిన చిత్రం 'భారతీయుడు'. ఆ చిత్రంలో సేనాపతి పాత్రలో వృద్ధునిగా నటిస్తారు. ఆయన భార్యగా నటించిన అమృతవల్లిని ఓ సందర్భంలో నగ్నంగా చూడటంతో ఆమెను వివాహమాడతాడు సేనాపతి. అమృతవల్లి పాత్రలో నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) మనీషా కొయిరాల బి) ఊర్మిళ
సి) సుకన్య డి) హీరా

**18** 1981లో విడుదలైన బాలీవుడ్ సినిమా 'చక్ర'లో న్యూడ్‌గా నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) స్మితా పాటిల్ బి) నందితా దాస్
సి) జీనత్ అమన్ డి) పర్వీన్ బాబి

**19** 'బండిట్ క్వీన్' చిత్రంలో పూలన్‌దేవి పాత్రలో జీవించిన నటి పేరేంటో గుర్తుందా?
ఎ) విద్యాబాలన్ బి) సీమా బిస్వాస్
సి) ఈషా డియోల్ డి) ఆశా పరేఖ్



**20** 2015లో విడుదలైన 'పర్చేడ్' సినిమాని హీరో అజయ్ దేవ్‌గణ్ నిర్మించారు. బాల్య వివాహాలు, బాలికలపై హింస, వరకట్నం తదితర అంశాలను టచ్ చేస్తూ తీసిన ఈ సినిమాలోని పాత్రకోసం నగ్నంగా నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) ప్రియాంక చోప్రా బి) రకుల్ ప్రీత్ సింగ్ సి) రాధికా ఆప్టే డి) సోహా అలీఖాన్



**1** రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఈగ' చిత్రంలో ఈగ పెట్టే ఇబ్బందులతో ఈగను చంపటం కోసం తన ఒంటిపై బట్టలు లేవనే విషయాన్ని కూడా గ్రహించని నటుడెవరో గుర్తుందా?
ఎ) నాని బి) సుదీప్ సి) సునీల్ డి) రవితేజ

నిర్వహణ: శివ మల్లాల

సమాధానాలు: 1) బి 2) సి 3) బి 4) సి 5) డి 6) సి 7) ఎ 8) బి 9) సి 10) డి 11) బి 12) సి 13) డి 14) బి 15) ఎ 16) ఎ 17) సి 18) ఎ 19) బి 20) సి

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!



● అల్లు అర్జున్

## లాక్ చేశారు

స్పీడ్ గేర్‌లో దూసుకెళుతున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో నటిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సుకుమార్ దర్శకత్వంలో చేయనున్న సినిమా షూటింగ్‌తో బిజీ అయిపోతారు. ఈ సినిమా ఫుల్ స్క్రిప్ట్‌ను అల్లు అర్జున్‌కు వినిపించేశారు సుకుమార్. కథ విని, బన్నీ ఫుల్ ఖుష్ అయ్యారని సమాచారం. హీరోకి నచ్చాక ఇక స్క్రిప్ట్ లాక్ చేసేస్తారు కదా. ఇక మంచి ముహూర్తం చూసుకుని సినిమాని ప్రారంభించడానికి వెయిటింగ్. షూటింగ్‌ను సెప్టెంబర్‌లో ఆరంభించాలనుకుంటున్నారట. ఎర్రచందనం స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉంటుందని తెలిసింది. ఇందులో రష్మికా మండన్నా కథానాయికగా నటిస్తారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, చెరుకూరి మోహన్, వై. రవిశంకర్ నిర్మిస్తారు. ఒక వైపు సుకుమార్ సినిమా చేస్తూనే మరోవైపు వేణుశ్రీరామ్ దర్శకత్వంలో అంగీకరించిన 'ఐకాన్' సినిమా షూటింగ్‌లోనూ అల్లు అర్జున్ పాల్గొంటారట. ఈ సంగతి ఇలా ఉంచితే...ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో చేస్తున్న సినిమా కాకినాడ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు అల్లు అర్జున్.

## సైబర్ క్రైమ్ గురించి చెప్పాం


● నితిన్

ధృవ కరుణాకర్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'అశ్వమేథం'. జి.నితిన్ దర్శకత్వం వహించారు. ప్రియా నాయర్, వందనాయాదవ్, శుభా మల్హోత్రా, రూపేష్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ– ''తెలుగు చిత్రపరిశ్రమలో 'అశ్వమేథం' నా తొలి చిత్రం. ఈ సినిమాకు ముందు రెండు మరాఠీ సినిమాలకు దర్శకత్వం వహించాను. ఒకటి విడుదలైంది. దానికి 'దాదాసాహెబ్ ఫాల్కే జన్మభూమి' అవార్డు వచ్చింది. మరో సినిమా ఈ ఆగస్టులో విడుదల కానుంది. నాకు హిందీ, మరాఠీ, గుజరాతీ భాషలు వచ్చు. ఈ సినిమా నిర్మాత ద్వారా తెలుగులో స్ట్రయిట్ సినిమా చేసే అవకాశం వచ్చింది. నాకు తెలుగు భాష రాదు. మాట్లాడగలను. ఇక 'అశ్వమేథం' చిత్రం విషయానికి వస్తే.. డిజిటల్ ఎకానమీ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. సైబర్ క్రైమ్ అంశాలను ప్రస్తావించాం. హీరో ధృవ చాలా కష్టపడ్డాడు. డూప్ లేకుండా చేశాడు. రెండు చేజ్ సీక్వెన్స్‌లను కలుపుకుని సినిమాలో మొత్తం ఎనిమిది యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. చిత్రీకరణలో భాగంగా ధృవ దాదాపు 14సార్లు గాయపడ్డారు. అందుకే సినిమా కాస్త ఆలస్యమైంది.'' అని అన్నారు ఇంకా మాట్లాడుతూ– ''ప్రస్తుతం బాలీవుడ్‌పై సౌత్ సినిమాల ప్రభావం బాగా ఉంది. అల్లు అర్జున్, ఎన్టీఆర్, రవితేజ వంటి హీరోల సినిమాలను మొబైల్స్‌లో ఎక్కువగా చూస్తున్నారు. సౌత్‌కు చెందిన సినిమాలు బాలీవుడ్‌లో మంచి హిట్ సాధిస్తున్నాయి. రాజమౌళి గారు తెలుగు సినిమా గొప్పదనాన్ని పెంచారు'' అని చెప్పుకొచ్చారు.

## 2019 అబ్బాయి.. 1993 అమ్మాయి!


● అనన్య, దినేష్ తేజ్

2019 కాలానికి చెందిన అబ్బాయితో తాను ఇంకా 1993 లోనే ఉన్నానంటూ ఓ అమ్మాయి ఫోన్ కాల్ చేస్తుంది. ఆ తర్వాత ఏంటి? అంటే ప్రస్తుతానికి సస్పెన్స్. 'దర్శకుడు' సినిమాతో ప్రేక్షకుల ప్రశంసలు పొందిన హరిప్రసాద్ జక్కా దర్శకత్వంలో తెరకెక్కనున్న తర్వాతి చిత్రానికి 'ప్లేబ్యాక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇంతకు ముందు మహేశ్‌బాబుతో సుకుమార్ తెరకెక్కించిన 'నేనొక్కడినే'కి స్క్రిప్ట్, నాగచైతన్యతో తీసిన '100% లవ్' చిత్రాలకు స్క్రీన్‌ప్లే అందించారు హరిప్రసాద్. ఆయన దర్శకత్వంలో తాజా చిత్రాన్ని పీఎన్‌కే ప్రసాద్ రావు నిర్మించనున్నారు. ఈ చిత్రంలో 'హుషారు' ఫేమ్ దినేష్ తేజ్, 'మల్లేశం' ఫేమ్ అనన్య హీరోహీరోయిన్లుగా నటించనున్నారు. ఈ నెల 5న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయాలనుకుంటున్నారు. మర్డర్ మిస్టరీ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. కెమెరా: కె. బుజ్జి.








## పోరాడి ఓడిన ప్రజ్నేశ్

మెక్సికో ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ప్రిక్వార్టర్స్‌లో 6-4, 3-6, 2-6తో టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) చేతిలో పోరాడి ఓడాడు. డబుల్స్ విభాగంలో దివిజ్ శరణ్ (భారత్) - జొనాథన్ ఎర్లిచ్ (ఇజ్రాయిల్) జోడి 7-5, 6-1తో నాలుగో సీడ్ బెన్ మెక్‌లాక్లన్ (జపాన్)- జాన్ పాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా)పై గెలిచి క్వార్టర్స్ చేరారు. మరోవైపు వాషింగ్టన్‌లో జరుగుతున్న ఏటీపీ - 500 సిటీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో లియాండర్ పేస్ (భారత్) - జాక్ సాక్ (అమెరికా) జోడి ఓటమిపాలైంది. టోర్నీ క్వాలిఫయర్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్) - బెనొట్ పైరె (ఫ్రాన్స్) జంట 6-2, 3-6, 7-10తో రెండో సీడ్ మాథ్యూ ఎడ్బెన్ (ఆస్ట్రేలియా) - నికోలస్ మొన్రో (అమెరికా) జంట చేతిలో ఓడింది.

# స్మిత్ శతకనాదం

**సెంచరీతో ప్రతిఘటించిన ఆసీస్ మాజీ కెప్టెన్**
**చక్కటి తోడ్పాటునందించిన సిడిల్**
**యాషెస్ తొలి టెస్టులో ఆస్ట్రేలియా 284 ఆలౌట్**
**బ్రాడ్‌కు ఐదు వికెట్లు, రాణించిన వోక్స్**



స్టీవ్ స్మిత్ (219 బంతుల్లో 144; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు)

**బర్మింగ్‌హామ్:** అటు ఇంగ్లండ్ బౌలర్ల ప్రతాపం... ఇటు ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ పోరాటం మధ్య చరిత్రాత్మక యాషెస్ సిరీస్ ఆసక్తిగా ప్రారంభమైంది. మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (219 బంతుల్లో 144; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెరీర్‌లో 24వ శతకం సాధించడంతో గురువారం ఇక్కడి ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో మొదలైన టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 80.4 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. స్మిత్‌కు లోయరార్డర్ బ్యాట్స్‌మెన్ పీటర్ సిడిల్ (85 బంతుల్లో 44; 4 ఫోర్లు) సహకరించాడు. అంతకుముందు ఇంగ్లండ్ పేసర్లు స్టువర్ట్ బ్రాడ్ (5/86), క్రిస్ వోక్స్ (3/58) ధాటికి 122 పరుగులకే 8 వికెట్లు కోల్పోయిన ఆసీస్ తక్కువ స్కోరే చేసేలా కనిపించింది. అయితే, స్మిత్ సెంచరీతో ఒడ్డుకు చేర్చాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ రెండు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది.

### ఎక్కడినుంచి ఎక్కడకు...

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు అంతా ఎదురుగాలే వీచింది. ట్యాంపరింగ్ నిషేధం అనంతరం తొలిసారి టెస్టు ఆడుతున్న ఓపెనర్లు వార్నర్ (2), బాన్‌క్రాఫ్ట్ (8) నిరాశపర్చారు. వీరు బ్రాడ్ బౌలింగ్‌లో వెనుదిరిగారు. ఖాజా (13)ను వోక్స్ పెవిలియన్ చేర్చాడు. 35 పరుగులకే టాపార్డర్‌ను కోల్పోయిన దశలో నాలుగో వికెట్‌కు 64 పరుగులు జోడించి స్మిత్, హెడ్ (61 బంతుల్లో 35; 5 ఫోర్లు) ఆదుకున్నారు. అయితే, హెడ్, వేడ్ (1)లను వెంటవెంటనే ఔట్ చేసి వోక్స్ గట్టి దెబ్బకొట్టాడు. బ్రాడ్... కెప్టెన్ టిమ్ పైన్ (5), ప్యాటిన్సన్ (0)లను సాగనంపాడు. కమిన్స్ (5)ను స్టోక్స్ వెనక్కుపంపాడు. అప్పటికి స్కోరు 122/8. స్మిత్‌కు సిడిల్ తోడయ్యాక అసలు ఆట ప్రారంభమైంది. 9వ వికెట్‌కు 140 బంతుల్లో 88 పరుగులు జోడించిన వీరు 200 పరుగుల మార్క్ దాటించారు. ప్రధాన పేసర్ అండర్సన్ గాయంతో నాలుగు ఓవర్లే బౌలింగ్ చేసి వెనుదిరగడం, స్టోక్స్ ప్రభావం చూపలేకపోవడం ఆసీస్‌కు కలిసొచ్చింది. సిడిల్‌ను ఔట్ చేసి మొయిన్ అలీ ఈ భాగస్వామ్యాన్ని విడదీసినా లయన్.. స్మిత్‌కు సహకరించాడు. స్మిత్ సెంచరీ (184 బంతుల్లో) పూర్తయ్యాక బ్యాట్ ఝుళిపించాడు. పదో వికెట్‌కు 74 పరుగులు జోడించాక స్మిత్‌ను బ్రాడ్ బౌల్డ్ చేయడంతో కంగారూల ఇన్నింగ్స్‌కు తెరపడింది.

*స్టీవ్ స్మిత్... 16 నెలల క్రితం టెస్టుల్లో నంబర్‌వన్ బ్యాట్స్‌మన్. ఆస్ట్రేలియాకు కెప్టెన్ కూడా. అప్పట్లో సెంచరీల మీద సెంచరీలు కొడుతూ సాగిపోతున్న అతడి బ్యాటింగ్ జోరు చూస్తే రికార్డులకే కళ్లుచెదిరేవి. కానీ ఒక్క బాల్ ట్యాంపరింగ్ ఉదంతం అంతా తలకిందులు చేసింది. ఆ ఘటనకు బాధ్యుడిగా కెప్టెన్సీ కోల్పోయి, ఏడాది పాటు క్రికెట్‌కూ దూరమై, విమర్శలతో మానసికంగానూ క్షోభను ఎదుర్కొన్నాడు స్మిత్. అయితే, అద్వితీయమైన సెంచరీతో ఇప్పుడా చేదు జ్ఞాపకాలను ఒక్కసారిగా తుడిపేశాడు. అది కూడా నిషేధం అనంతరం ఆడుతున్న తొలి టెస్టులోనే సాధించి తన స్థాయి ఏమిటో చాటాడు. మైదానం నలుమూలలా షాట్లు కొడుతూ తాను ఒకప్పటి స్మిత్‌నేనని ప్రత్యర్థులకు సందేశం పంపాడు. ముఖ్యంగా క్లిష్ట పరిస్థితులకు ఎదురొడ్డుతూ, లోయరార్డర్‌ను సమన్వయం చేసుకుంటూ అతడు సాగించిన పోరాటం అసలుసిసలు టెస్టు ఇన్నింగ్స్‌కు అద్దంపట్టింది. ఓపిక, సంయమనంతో సాగిన అతడి ఆట అందరి ప్రశంసలు పొందింది. బ్యాటింగ్‌కు దిగే సందర్భంలో మైదానంలో ప్రేక్షకుల నుంచి హేళన ఎదుర్కొన్న స్మిత్... ఔటై వెళ్తున్నప్పుడు అంతకుమించిన స్థాయిలో అభినందనలు పొందాడు. కెరీర్‌లో అతడు సాధించిన 23 శతకాలు ఒక ఎత్తు, గురువారం చేసిన సెంచరీ మరో ఎత్తు అనడంలో సందేహం లేదు. ఇదే సందర్భంలో స్మిత్ పరోక్షంగా ఇంగ్లండ్‌కు గట్టి హెచ్చరిక కూడా పంపాడు. ఎందుకంటే ఆస్ట్రేలియాలో జరిగిన గత యాషెస్‌లో స్మిత్ అత్యద్భుత ఆటతో ఏకంగా ఒక డబుల్ సెంచరీ, మూడు సెంచరీలు బాదాడు మరి...!*



# ఆగస్టు వినోదం

కబడ్డీ కూత, యాషెస్ సిరీస్, కరీబియన్ క్రికెట్‌తో ఆగస్టు 'మస్తు మజా' అందించనుంది. పనిలో పనిగా హైదరాబాద్‌లో షటిల్ రాకెట్లు సమరాన్ని చూపించనున్నాయి. గత నెలలో మొదలైన ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్ పోటీలు ఈ ఆగస్టులో ఆరు నగరాల్లో కూతపెడతాయి. యాషెస్ సిరీస్‌తో పాటు, విండీస్‌లో భారత్ పర్యటన క్రికెట్ పంట పండించనుంది. ఏస్‌లతో యూఎస్ ఓపెన్, కార్ల స్పీడ్‌తో హంగేరి గ్రాండ్‌ప్రి 'రయ్ రయ్'మనిపిస్తుంది. అలా ఈ ఆగస్టు ఆటలతో 'అటెస్ట్' అయిపోయింది.

**క్యాలెండర్**

### క్రికెట్

**వెస్టిండీస్‌లో భారత్ పర్యటన**

| | |
|---|---|
| తొలి టి20: | ఆగస్టు 3 |
| రెండో టి20: | ఆగస్టు 4 |
| మూడో టి20: | ఆగస్టు 6 |
| తొలి వన్డే: | ఆగస్టు 8 |
| రెండో వన్డే: | ఆగస్టు 11 |
| మూడో వన్డే: | ఆగస్టు 14 |
| తొలి టెస్టు: | ఆగస్టు 22–26 |
| రెండో టెస్టు: | ఆగస్టు 30–సెప్టెంబరు 3 |

**యాషెస్ సిరీస్**

తొలి టెస్టు: ఆగస్టు 1–5 బర్మింగ్‌హామ్
రెండో టెస్టు: ఆగస్టు 14–18 లార్డ్స్
మూడో టెస్టు: ఆగస్టు 22–26 లీడ్స్

**న్యూజిలాండ్‌లో శ్రీలంక పర్యటన**

తొలి టెస్టు: ఆగస్టు 14–18
రెండో టెస్టు: ఆగస్టు 22–26
తొలి టి20: ఆగస్టు 31




ఆగస్టు 6–11: హైదరాబాద్ ఓపెన్ టోర్నీ
ఆగస్టు 19–25: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ (స్విట్జర్లాండ్)

### టెన్నిస్

ఆగస్టు 26–సెప్టెంబర్ 8: యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ

### రెజ్లింగ్

ఆగస్టు 12–18: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (ఎస్తోనియా)

### ప్రొ కబడ్డీ లీగ్–7 సీజన్

మ్యాచ్‌లు ఆగస్టు 2–31

### షూటింగ్

ఆగస్టు 15–22: ప్రపంచకప్ షాట్‌గన్ టోర్నీ (ఫిన్‌లాండ్)
ఆగస్టు 28–సెప్టెంబర్ 2: ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్ షూటింగ్ టోర్నీ (రియో డి జనీరో)



### చెస్

ఆగస్టు 15–19: ప్రపంచ క్యాడెట్ (అండర్–8, 10, 12) ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ (బెలారస్)
ఆగస్టు 20–సెప్టెంబర్ 2: ప్రపంచ క్యాడెట్ (అండర్–8, 10, 12) చాంపియన్‌షిప్ (చైనా)



### ఫార్ములావన్

ఆగస్టు 4: హంగేరి గ్రాండ్‌ప్రి

### హాకీ

ఆగస్టు 17–21: టోక్యో ఒలింపిక్స్ టెస్ట్ ఈవెంట్ హాకీ టోర్నీ

– సాక్షి క్రీడావిభాగం

# ప్రణీత్ ఒక్కడే క్వార్టర్స్‌కు

- ప్రిక్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్ ఔట్
- థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీ

**బ్యాంకాక్:** టైటిల్ వేటలో భారత షట్లర్ల ఆటలు థాయ్‌లాండ్ ఓపెన్‌లోనూ సాగడంలేదు. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ సైనా నెహ్వాల్, పురుషుల సింగిల్స్‌లో ఐదో సీడ్ కిడాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్. ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే కంగుతిన్నారు. ఈ 'బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500' టోర్నమెంట్‌లో ఇప్పుడు భారత్ ఆశలన్నీ భమిడిపాటి సాయి ప్రణీత్‌పైనే ఉన్నాయి. ఈ అన్‌సీడెడ్ షట్లర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల, మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ జోడీలు ముందంజ వేయగా సిక్కిరెడ్డి–ప్రణవ్ చోప్రా జోడీకి చుక్కెదురైంది.



ప్రణయ్‌ని ఇంటిదారి పట్టించాడు.

### సాయి ప్రణీత్ అలవోక విజయం

మిగతా భారత షట్లర్లకు విదేశీ ఆటగాళ్లు ఎదురుకాగా... సాయిప్రణీత్‌తో సహచరుడు శుభాంకర్ డే తలపడ్డాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అతను వరుస గేముల్లో 21–18, 21–19తో శుభాంకర్‌పై గెలుపొందాడు. 42 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శుభాంకర్ ప్రతీ గేమ్‌లోనూ పోరాడాడు. కానీ అతనికంటే మేటి ఆటగాడైన ప్రణీత్ ముందు ఎదురు నిలువలేకపోయాడు. మరో మ్యాచ్‌లో ఐదో సీడ్ శ్రీకాంత్ 21–11, 16–21, 12–21తో స్థానిక ఆటగాడు కొసిట్ ఫెట్రప్రదబ్ చేతిలో కంగుతిన్నాడు. మూడో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) ధాటికి 21–9, 21–14తో పారుపల్లి కశ్యప్ నిలువలేకపోయాడు. హెచ్.ఎస్.ప్రణయ్ ఆటను జపాన్‌కు చెందిన కెంటో నిషిమోటో వరుస గేముల్లోనే ముగించాడు. 39 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆరోసీడ్ నిషిమోటో 21–17, 21–10తో

### సైనా పోరాటం సరిపోలేదు

మహిళల సింగిల్స్‌లో సుమారు రెండు నెలల అనంతరం బరిలోకి దిగిన సైనా తొలి గేమ్ విజయంతో టచ్‌లోకి వచ్చింది. తర్వాత గేమ్‌లలో పోరాడే ప్రయత్నం చేసినా... జపాన్ ప్రత్యర్థి సయాక తకహాషి జోరు ముందు అదేమాత్రం సరిపోలేదు. చివరకు ఏడో సీడ్ భారత స్టార్ 21–16, 11–21, 14–21తో పరాజయం చవిచూసింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 21–17, 21–19తో ఆరోసీడ్ ఫజర్–ముహమ్మద్ రియాన్ (ఇండోనేసియా) జంటపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్–అశ్విని పొన్నప్ప జంట 21–18, 21–19తో అల్‌ఫియాన్–మార్షెయిలా ఇస్లామి (ఇండోనేసియా) జంటపై నెగ్గింది. సిక్కిరెడ్డి–ప్రణవ్ జోడీ 16–21, 11–21తో ఎనిమిదో సీడ్ తంగ్‌చన్ మన్– సె యింగ్ సుయెట్ (హాంకాంగ్) జంట చేతిలో ఓడింది.

## కోహ్లి తన అభిప్రాయం చెప్పవచ్చు కానీ...

- కోచ్ ఎంపికలో అంతిమ నిర్ణయం సీఏసీదే
- కపిల్‌దేవ్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** ఓవైపు టీమిండియా ప్రధాన కోచ్ ఎంపిక ప్రక్రియ సాగుతుండగా... ప్రస్తుత హెడ్ కోచ్ రవిశాస్త్రిని కొనసాగిస్తే బాగుంటుందంటూ కెప్టెన్ విరాట్ కోహ్లి చేసిన వ్యాఖ్యలపై ప్రతిస్పందనలు కొనసాగుతున్నాయి. కోచ్ ఎంపిక కమిటీ బాధ్యతను చూస్తున్న క్రికెట్ సలహా మండలి (సీఏసీ) సభ్యులు, దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్, శాంత రంగస్వామి దీనిపై గురువారం వేర్వేరు చోట్ల మాట్లాడారు. తమ కర్తవ్యాన్ని శక్తిమేర నిర్వర్తిస్తామని పేర్కొన్న కపిల్... కోహ్లి వ్యాఖ్యలపై మాట్లాడుతూ 'అది అతడి అభిప్రాయం. మేం ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని గౌరవించాలి' అని స్పష్టం చేశారు. కెప్టెన్‌గా అభిప్రాయం చెప్పే హక్కు కోహ్లికి ఉందంటూనే, తమ కమిటీ సమష్టి నిర్ణయంతో కోచ్‌ను ఎంపిక చేస్తుందని శాంత రంగస్వామి అన్నారు. అనుభవం, సామర్థ్యం, వ్యూహ నైపుణ్యాలను తాము ప్రాతిపదికగా తీసుకుంటామని చెప్పారు.

మరోవైపు కోహ్లి వ్యాఖ్యలు కోచ్ ఎంపికపై ప్రభావం చూపవని, ప్రజాస్వామ్య దేశంలో వాక్ స్వాతంత్ర్యాన్ని ఎవరూ అడ్డుకోలేరని క్రికెట్ పాలకుల మండలి (సీఓఏ) సభ్యుడొకరు వ్యాఖ్యానించారు. కోహ్లి కెప్టెనే అయినా, ఎంపికకు ఒక కమిటీని నియమించిన విషయాన్ని గుర్తుచేశారు.

## నాలుగు పతకాలు ఖాయం

**రష్యా బాక్సింగ్ టోర్నీ**

**చెన్నై:** మగోమెడ్ సాలమ్ ఉమఖనోవ్ స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత మహిళా బాక్సర్లు సత్తా చాటారు. ఏకంగా నలుగురు సెమీస్ చేరి భారత్‌కు పతకాలను ఖాయం చేశారు. రష్యాలో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన మహిళల 69 కేజీల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో లవ్లీనా బొర్గొహైన్ (భారత్) 5–0తో అనస్తాసియ సిగెవ (రష్యా)పై విజయం సాధించింది. 75 కేజీల విభాగంలో పూజా రాణి (భారత్) 4–1తో లారా మమెద్కులోవ (రష్యా)పై గెలిచి ఇండియన్ ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకుంది. అదే విధంగా మహిళల క్వార్టర్స్‌లో నీరజ్ (57 కేజీలు) 4–1తో సయాన సగతేవ (రష్యా)పై గెలవగా... జాని (60 కేజీలు) 5–0తో అనస్తాసియ ఒబుషెంకోవ (బెలారస్)ను ఓడించి సెమీస్ చేరింది. అయితే కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత పింకీ జాంగ్రా (51 కేజీలు)కు మాత్రం క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. ఆమె 0–5తో యులియా అపనసోవిచ్ (బెలారస్) చేతిలో ఓటమి పాలైంది. మరోవైపు పురుషుల విభాగంలో 2018 కామన్వెల్త్ గేమ్ పసిడి పతక విజేత గౌరవ్ సొలంకీ (56 కేజీలు), గోవింద్ సహాని (49 కేజీలు), సంజిత్ (91 కేజీలు),అభిషేక్ (52 కేజీలు) క్వార్టర్స్ చేరారు.



# దబంగ్ ఢిల్లీకి కళ్లెం

**గుజరాత్ హ్యాట్రిక్ విజయం ● ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్**

**ముంబై:** ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న దబంగ్ ఢిల్లీకి గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ కళ్లెం వేసింది. ముంబైలోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు 31–26తో ఢిల్లీని కంగుతినిపించింది. మ్యాచ్ ఆసాంతం ఇరు జట్ల మధ్య దోబూచులాడిన విజయం కీలక సమయంలో ఒత్తిడిని జయించిన ఫార్చ్యూన్ జెయింట్స్‌నే వరించింది. దీంతో లీగ్‌లో హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసిన ఆ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరింది. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన మోరే 9 పాయింట్ల(4 రైడ్ పాయింట్లు, 4 టాకిల్ పాయింట్లు, ఒక బోనస్ పాయింటు)తో గుజరాత్‌కు విజయాన్ని అందించాడు. అతనికి రోహిత్ గులియా (8 పాయింట్లు) నుంచి చక్కని సహకారం అందింది. దబంగ్ రైడర్ నవీన్ కుమార్ సూపర్ 'టెన్' సాధించినా ఆ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. నేడు జరిగే మ్యాచ్‌లో యూపీ యోధతో తెలుగు టైటాన్స్; యు ముంబాతో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ తలపడతాయి.

## కష్టాల్లో భారత్ 'ఎ'

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** టాపార్డర్ బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో భారత్ 'ఎ' కష్టాల్లో పడింది. వెస్టిండీస్ 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టు రెండో రోజు ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 20 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ ప్రియాంక్ పంచల్ (27 బ్యాటింగ్), శివమ్ దుబే (15 బ్యాటింగ్) క్రీజులో నిలబడటంతో కడపటి వార్తలందే సరికి భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 21 ఓవర్లలో 5 వికెట్లకు 53 పరుగులు చేసింది. ఓపెనర్ మయాంక్ 4, శ్రీకర్ భరత్ 7 పరుగులకే ఔట్ కాగా, అభిమన్యు (0), కెప్టెన్ విహారి (0), అన్మోల్ (0) డకౌటయ్యారు. అంతకుముందు 243/5 ఓవర్‌నైట్ స్కోరుతో గురువారం ఆటకొనసాగించిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగుల వద్ద ఆలౌటైంది. కార్న్‌వాల్ (56 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించాడు.

భారత ప్రభుత్వం
అంతరిక్ష శాఖ
నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్
బాలానగర్, హైదరాబాద్–500037, తెలంగాణ, ఇండియా.
టెలిఫోన్: +040–23884173/74, ఫ్యాక్స్: +040–23884179

కన్‌స్ట్రక్షన్ & మెయింటెనెన్స్ గ్రూప్
ఇ–టెండరు ప్రకటన

దిగువ తెలిపిన పనుల కోసం Gr. హెడ్, CMG, NRSC, హైదరాబాద్ వారిచే ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి.

| NIT నం. | పని పేరు | సుమారు అంచనా వ్యయం (రూ.) | టెండరు డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకునే కాలవ్యవధి | బిడ్ అప్‌లోడింగ్ కోసం ఆఖరు తేది |
|---|---|---|---|---|
| NRSC/CMG/BN/NIT/2463/ET/19/2019-20 తేది:01–08–2019 | NRSC, షాద్‌నగర్ వద్ద 33/0.433 kV సబ్ స్టేషన్ యొక్క కంట్రోల్/ ప్యానల్ రూమ్‌కు అగ్మెంటేషన్ (సివిల్ & ఇంటర్నల్ ఎలక్ట్రికల్ వర్క్స్) గల కాంపోజిట్ వర్క్). | రూ.117.00 లక్షలు | 02–08–2019 నుండి 13–08–2019 వరకు | 19–08–2019న 16:00 గంటల వరకు |
| NRSC/CMG/BN/NIT/2464/ET/20/2019-20 తేది:01–08–2019 | NRSC, షాద్‌నగర్ క్యాంపస్ వద్ద కొత్తగా సేకరించిన భూమి ప్రొటెక్షన్ కొరకు డ్వార్ఫ్‌వాల్‌తో ప్రీకాస్ట్ RCC ప్యానల్ బౌండరీ వాల్ నిర్మాణం. | రూ.78.40 లక్షలు | 02–08–2019 నుండి 13–08–2019 వరకు | 19–08–2019న 16:00 గంటల వరకు |
| NRSC/CMG/BN/NIT/2464-E/ET/21/2019-20 తేది:01–08–2019 | NRSC, షాద్‌నగర్ క్యాంపస్ వద్ద కొత్తగా సేకరించిన భూమి కొరకు బౌండరీ వాల్ పొడవున లైటింగ్ ఏర్పాటు చేయుట. | రూ.15.95 లక్షలు | 02–08–2019 నుండి 13–08–2019 వరకు | 19–08–2019న 16:00 గంటల వరకు |

సవివరమైన NIT మరియు అర్హతా ప్రమాణాలు, EMD, బిడ్డింగ్ డాక్యుమెంట్ మొదలైనవి www.tenderwizard.com/ISRO పోర్టల్‌లో చూసి/ దాని నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. అన్ని సవరణలు, గడువు పొడిగింపు, స్పష్టీకరణలు మొ॥ అన్నీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడతాయి మరియు వార్తా పత్రికలలో ప్రచురించబడవు. బిడ్డర్లు తమంతటతామువు అప్‌డేట్ చేసుకోవడానికి క్రమబద్ధంగా వెబ్‌సైట్‌ను దర్శించవలెను.

గ్రూప్ హెడ్,
కన్‌స్ట్రక్షన్ & మెయింటెనెన్స్ గ్రూప్

సాక్షి బిజినెస్
శుక్రవారం
2-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 463 ▼ | 138 ▼ |
| 37,018 | 10,980 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,293 | ▲ | 117 |
| డోజోన్స్ | 27,120 | ▲ | 256 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,585 | ▼ | 2 |
| డాక్స్ | 12,253 | ▲ | 64 |
| షాంఘై | 2,909 | ▼ | 24 |
| నికాయ్ | 21,541 | ▲ | 19 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.35 | 69.99 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 82.38 | 85.39 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.01 | 77.86 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.16 | 64.54 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.48 | 48.64 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.44 | 51.18 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.69 | 19.40 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.11 | 19.62 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.38 | 10.74 |



# ‘బేర్’ బాజా!

## 11,000 దిగువకు నిఫ్టీ

ఫెడ్ పావు శాతం రేట్ల కోత ● భవిష్యత్తులో రేట్ల కోత ఉండదన్న ఫెడ్
ప్రపంచ మార్కెట్ల పతనం ● పెరిగిన ద్రవ్యలోటు ● తరిగిన రూపాయి
ఇంట్రాడేలో 787 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
చివరి గంటలో బ్లూచిప్‌ల్లో కొనుగోళ్లు ● నష్టాలు ఒకింత రికవరీ
463 పాయింట్ల పతనంతో 37,018 వద్ద ముగిసిన సెన్సెక్స్
138 పాయింట్ల నష్టంతో 10,938 వద్దకు నిఫ్టీ

ఈ ఏడాది మరో రేట్ల తగ్గింపు లేదని, ప్రస్తుత రేట్ల తగ్గింపు ‘తగ్గింపు సైకిల్’కు ఆరంభంగా పరిగణించకూడదని అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలివ్వడంతో గురువారం మన స్టాక్ మార్కెట్ భారీగా పతనమైంది. కీలక పరిశ్రమలు, ద్రవ్య లోటు, వాహన విక్రయాల గణాంకాలు, కంపెనీల క్యూ1 ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండటం ప్రతికూల ప్రభావం చూపించాయి. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతూనే ఉండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ 41 పైసలు పతనం కావడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 11,000 పాయింట్ల దిగువకు పతనమైంది. 138 పాయింట్ల నష్టంతో 10,980 వద్ద ముగిసింది. ఇక బీఎస్ఈ సెన్సెక్స్ 463 పాయింట్లు క్షీణించి 37,018 పాయింట్ల వద్దకు చేరింది. ఈ ఏడాది మార్చి తర్వాత సెన్సెక్స్, నిఫ్టీలు ఈ స్థాయిలకు పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రెండు సూచీలకు ఇది దాదాపు ఐదు నెలల కనిష్ట స్థాయి. ముడి చమురు ధరలు చెప్పుకోదగిన స్థాయిలో పడిపోయినా, మన మార్కెట్ పతనం ఆగలేదు. అయితే చివర్లో కొన్ని బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో నష్టాలు ఒకింత రికవరీ అయ్యాయి.

### సెన్సెక్స్ 787 పాయింట్లు డౌన్...

ఆసియా మార్కెట్ల బలహీనతతో సెన్సెక్స్ నష్టాల్లోనే ఆరంభమైంది. రోజులు గడుస్తున్న కొద్దీ నష్టాలు అంతకంతకూ పెరిగాయి. ఎన్ఎస్ఈ వీక్లీ ఆప్షన్ల ముగింపు కారణంగా మార్కెట్లో తీవ్రమైన ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్787 పాయింట్లు, నిఫ్టీ 204 పాయింట్ల వరకూ నష్టపోయాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొంత నష్టాల రికవరీ జరిగింది. ఇంధన, వాహన షేర్లు లాభపడటంతో నష్టాలు తగ్గాయి. మారుతీ సుజుకీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, హిందుస్తాన్ యూని లివర్ షేర్లలో కొనుగోళ్లు జరిగాయి. ఈ రికవరీ కారణంగా సెన్సెక్స్ 37,000 పాయింట్లు, నిఫ్టీ 10,900 పాయింట్లపైన ముగియగలిగాయి. నికాయ్ మినహా ఇతర ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

**1.6 లక్షల కోట్లు ఆవిరి**

స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో రూ.1.6 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.1.6 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.1,39,87,400 కోట్లకు తగ్గింది. తాజా బడ్జెట్ నుంచి చూస్తే, రూ.13.70 లక్షల కోట్లు సంపద ఆవిరైంది.

### మరిన్ని విశేషాలు...

- వేదాంత షేర్ 5.5% నష్టంతో రూ.145 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- దాదాపు 600కు పైగా షేర్లు ఇంట్రాడేలో ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. ఐషర్ మోటార్స్, బ్లూడార్ట్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, వీఎస్‌టీ టిల్లర్స్, కేర్ రేటింగ్స్, ఎస్కార్ట్స్, ఆర్తి ఇండస్ట్రీస్, వేదాంత, టాటా మోటార్స్, హిదాల్కో, బయోకాన్, ఓకార్డ్, గెయిల్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తదతర షేర్లు జాబితాలో ఉన్నాయి.
- ఓపెన్‌హీమర్ కంపెనీ భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చినప్పటికీ, జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్ 4 శాతం మేర నష్టపోయి రూ.347 వద్ద ముగిసింది.
- స్టాక్ మార్కెట్ భారీ పతనంలోనూ 16 షేర్లు ఏడాది గరిష్ట స్థాయికి ఎగిశాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, గుజరాత్ స్టేట్ పెట్రోనెట్, వైభవ్ గ్లోబల్ ఈ జాబితాలో ఉన్నాయి.

### రెండు నెలల్లో 9 శాతం డౌన్

ఎన్ఎస్ఈ నిఫ్టీ ఈ ఏడాది జూన్ 3న రికార్డ్ స్థాయి, 12,103 పాయింట్లను తాకింది. అప్పటి నుంచి కేవలం రెండు నెలల్లో 11,000 పాయింట్లకు (9%) పడిపోయింది. ఈ రెండు నెలల కాలంలో వాహన, బ్యాంక్, ఇంధన, మౌలిక, లోహ షేర్లు బాగా నష్టపోయాయి. ఇక నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 13%, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 16% చొప్పున క్షీణించాయి. అంతేకాకుండా నిఫ్టీ 500 సూచీలోని 300కు పైగా షేర్లు 50–90 శాతం రేంజ్‌లో పతనమయ్యాయి. కాక్స్ అండ్ కింగ్స్, జెట్ ఎయిర్‌వేస్, సింటెక్స్ ప్లాస్టిక్స్, రిలయన్స్ క్యాపిటల్, డీహెచ్‌ఎఫ్‌ఎల్, జైన్ ఇరిగేషన్ , రిలయన్స్ ఇన్‌ఫ్రా, వొడాఫోన్ ఐడియా తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

## పతనానికి కారణాలు ఇవీ....

● **ఫెడ్ కామెంట్స్:** అంచనాలకు అనుగుణంగానే అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లను తగ్గించింది. దీంతో రేట్లు 2.0–2.25 శాతం రేంజ్‌లో ఉన్నాయి. పదేళ్ల తర్వాత తొలిసారిగా ఫెడ్ రేట్లను తగ్గించింది. అయితే ఈ తగ్గింపు, రేట్ల తగ్గింపు సైకిల్‌కు ఆరంభం కాదని ఫెడ్ చైర్మన్ జెరోమి పావెల్ వ్యాఖ్యానించారు. దీంతో సమీప భవిష్యత్తులో మరో రేట్ల పెంపు ఉండకపోవచ్చని ఫెడ్ సంకేతాలిచ్చినట్లయింది. ఇది మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. వాణిజ్య ఉద్రిక్తతల నివారణ నిమిత్తం అమెరికా–చైనాల మధ్య జరుగుతున్న తాజా చర్చలు ఎలాంటి పురోగతి లేకుండానే ముగియడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది.

● **గణాంకాల నిరుత్సాహం:** ఈ ఏడాది జూన్‌లో ఎనిమిదికీలక పరిశ్రమల వృద్ధి 0.2 శాతం తగ్గింది. సిమెంట్ ఉత్పత్తి, చమురు సంబంధిత రంగాల్లో మందగమనం చోటు చేసుకోవడం దీనికి కారణం. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో ద్రవ్యలోటు 61.4 శాతానికి (రూ.4.32 లక్షల కోట్లు) చేరింది. ఈ గణాంకాలు ఇన్వెస్టర్లలో నిరుత్సాహాన్ని నింపాయి.

● **ఉత్తేజాన్నివ్వని వాహన విక్రయాలు:** ఈ ఏడాది జూన్‌లో వాహన విక్రయాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని కంపెనీలు వెల్లడించిన గణాంకాలు పేర్కొన్నాయి.

● **కొనసాగుతున్న విదేశీ నిధుల ఉపసంహరణ:** సంపన్నులపై విధించిన అదనపు పన్ను భారం విదేశీ ఇన్వెస్టర్లకు కూడా వర్తిస్తుంది. ఈ పన్ను విషయంలో వెనక్కి తగ్గేది లేదంటూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలుమార్లు స్పష్టం చేయడంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. బడ్జెట్ నుంచి ఇప్పటివరకూ ఎఫ్‌పీఐలు 300 కోట్ల డాలర్ల మేర తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారని అంచనా. మన స్టాక్ మార్కెట్ జోరుకు కీలకమైన విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటుండటంతో మార్కెట్‌లో నష్టాలు కొనసాగుతున్నాయి. గత నెలలో విదేశీ ఇన్వెస్టర్లు రూ.16,870 కోట్ల మేర తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈ ఏడాది ఇదే ఎఫ్‌పీఐల అత్యధిక పెట్టుబడుల ఉపసంహరణ. సూపర్ రిచ్ పన్నుతో కినుక వహించిన విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. నిధుల ఉపసంహరణ కొనసాగుతుందని నిపుణులంటున్నారు.

● **రూపాయి పతనం:** డాలర్‌తో రూపాయి మారకం విలువ 41 పైసలు నష్టపోయింది. రూపాయి విలువ గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో 69.20కు పడిపోయింది.

**ప్రాఫిట్ ప్లస్ డైలీ**

## పన్ను రిటర్నుల ఫైలింగ్ సులభతరం



ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడాన్ని మరింత సులభతరం చేస్తూ ఆదాయ పన్ను శాఖ తాజాగా ‘లైట్’ వెర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ప్రస్తుతం ఉపయోగిస్తున్న పూర్తి స్థాయి ఈ–ఫైలింగ్ పోర్టల్‌కు తేలికపాటి వెర్షన్. ప్రధాన పోర్టల్‌లోని హోం పేజీలో ‘ఈ–ఫైలింగ్ లైట్’ బటన్‌ను క్లిక్ చేయడం ద్వారా లాగిన్ కావొచ్చు. ఇందులో కేవలం ఐటీఆర్‌ల ఫైలింగ్‌కు అవసరమైన లింకులు, ఫారం 26 ఏఎస్‌కి మాత్రమే ఉంటాయి. ఈ–ప్రొసీడింగ్, ఈ–నివారణ్, వర్క్‌లిస్ట్, ప్రొఫైల్ సెటింగ్స్ వంటి ఆప్షన్స్ దీన్నుంచి తప్పించారు. అయితే ప్రధాన పోర్టల్‌లో మాత్రం ఉంటాయి. ఐటీ రిటర్నుల ఫైలింగ్ సులభతరం, వేగవంతం చేసేందుకు లైట్ వెర్షన్ ఉపయోగపడగలదని ఆదాయ పన్ను శాఖ వర్గాలు తెలిపాయి. 2018–19 ఏడాది ఐటీ రిటర్నుల దాఖలు ఆఖరు తేదీని ఆగస్టు 31 దాకా పొడిగించడం తెలిసిందే.

## ఇక దేశంలో బ్యాంక్ ఆఫ్ చైనా

### ఆర్‌బీఐ అనుమతి

**ముంబై:** దేశంలో మామూలు బ్యాంకింగ్ సేవలు ప్రారంభించడానికి బ్యాంక్ ఆఫ్ చైనాకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ తరహాలోనే దేశంలో బ్యాంకింగ్ సేవలు అందించడానికి బ్యాంక్ ఆఫ్ చైనాకు వీలు కలుగుతుంది.



ఆర్‌బీఐ నిబంధనలకు కట్టుబడి పనిచేసే బ్యాంకుల జాబితా ఆర్‌బీఐ యాక్ట్, 1934 రెండవ షెడ్యూల్‌లో ఉంటుంది. ఈ రెండవ షెడ్యూల్‌లో ‘బ్యాంక్ ఆఫ్ చైనా లిమిటెడ్’ పేరును కూడా చేర్చడం జరిగిందని సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌ను కూడా రెండవ షెడ్యూల్‌లో చేర్చినట్లు మరో నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ పేర్కొంది.

# దివాలా బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### 7 సెక్షన్లకు సవరణలు




**న్యూఢిల్లీ:** డిఫాల్టయిన సంస్థల ఆస్తుల వేలం ద్వారా వచ్చే నిధుల వినియోగంపై మరింత స్పష్టతనిచ్చేలా దివాలా స్మృతి సవరణల బిల్లు (2019)కి పార్లమెంటు ఆమోదముద్ర వేసింది. ఇప్పటికే దీనికి రాజ్యసభ ఆమోదం తెలపగా.. తాజాగా లోక్‌సభలో కూడా గ్రీన్ సిగ్నల్ లభించింది. స్మృతిలోని ఏడు సెక్షన్లలో సవరణలు ప్రతిపాదించారు. వీటి ప్రకారం డిఫాల్టయిన సంస్థ ఆస్తుల వేలం ద్వారా వచ్చిన నిధులపై రుణదాతల కమిటీకి పూర్తి అధికారాలు లభించనున్నాయి. ఐబీసీ పరిధిలోకి వచ్చిన కేసులను 330 రోజుల్లోగా పరిష్కరించాల్సి ఉంటుంది. రుణ పరిష్కార ప్రణాళికపై ఎన్నాళ్లలోగా నిర్ణయం తీసుకోవాలి, ఆర్థిక రుణదాతలను ఏ వర్గంగా పరిగణించాలి తదితర నిబంధనలపై ఈ సవరణలతో మరింత స్పష్టత వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ) ప్రారంభమైన తర్వాత 330 రోజుల్లోగా కేసు పూర్తి కావాల్సి ఉంటుందని ఆమె వివరించారు. అలాగే రుణ పరిష్కార ప్రణాళిక ఒకసారి ఆమోదం పొందిన తర్వాత కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వివిధ అధికారిక సంస్థలు కూడా దానికి కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.

**గృహ కొనుగోలుదారులకు మరిన్ని హక్కులు**

తాజా సవరణలతో గృహ కొనుగోలుదారులకు మరిన్ని హక్కులు సంక్రమించగలవని నిర్మలా సీతారామన్ చెప్పారు. బిల్డర్ల ఆగడాలతో సతమతమవుతున్న కొనుగోలుదారులకు పూర్తి న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వివాదాస్పద జేపీ గ్రూప్ సంస్థల నుంచి గృహాలు కొనుగోలు చేసిన వారి సమస్యలు పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు. మరోవైపు, దివాలా స్మృతి పనితీరు మిశ్రమంగా ఉందని చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. కంపెనీల వేలం..ముఖ్యంగా రియల్టీ వంటి రంగాల సంస్థల విక్రయం వల్ల కష్టార్జితం పెట్టి ఇళ్లు కొనుక్కున్న కొనుగోలుదారులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఎయిర్‌టెల్ నష్టాలు 2,856 కోట్లు

- 14 ఏళ్ల తర్వాత నష్టాలు
- 5 శాతం వృద్ధితో రూ.20,738 కోట్లకు మొత్తం ఆదాయం
- రూ.129కు పెరిగిన ఏఆర్‌పీయూ




**న్యూఢిల్లీ:** టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌కు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రూ.2,866 కోట్ల నికర నష్టాలు వచ్చాయి. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తమకు వచ్చిన తొలి నష్టం ఇదని భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. గత క్యూ1లో రూ.97 కోట్ల నికర లాభం, గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో రూ.107 కోట్లు చొప్పున నికర లాభాలు వచ్చాయని పేర్కొంది. రిలయన్స్ జియోతో తీవ్రమైన పోటీ, 3జీ నెట్‌వర్క్ తరుగుదల వ్యయాలు, భారీగా పన్ను వంటి అసాధారణ అంశాలతో ఈ క్యూ1లో ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని వివరించింది. మొత్తం ఆదాయం రూ.19,799 కోట్ల నుంచి 5% వృద్ధితో రూ.20,738 కోట్లకు పెరిగిందని పేర్కొంది. భారత్‌లో ఆదాయం 3%, ఆఫ్రికాలో ఆదాయం 10% చొప్పున పెరిగాయని వివరించింది.

**94 శాతం పెరిగిన డేటా ట్రాఫిక్..**

మొబైల్ కంపెనీల కీలక పనితీరు అంశాల్లో ఒకటైన ఒక్కో వినియోగదారుడిపై లభించే సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ–యావరేజ్ రెవెన్యూ పర్ యూజర్) స్వల్పంగా పెరిగింది. గత క్యూ1లో రూ.123 గా ఉన్న ఏఆర్‌పీయూ ఈ క్యూ1లో రూ.129కు పెరిగిందని ఎయిర్‌టెల్ పేర్కొంది. మొబైల్ డేటా ట్రాఫిక్ 94 శాతం పెరిగిందని తెలిపింది. రూ. 8,493 కోట్ల నిర్వహణ లాభం సాధించామని, నిర్వహణ మార్జిన్ 6 శాతం పెరిగి 41 శాతానికి చేరిందని పేర్కొంది. ఈ క్యూ1 ఫలితాలు ఆరోగ్యకరంగా ఉన్నాయని కంపెనీ ఎమ్‌డీ, సీఈఓ(ఇండియా అండ్ సౌత్ ఏషియా) గోపాల్ విట్టల్ చెప్పారు. అన్ని వ్యాపారాల్లో సమ వృద్ధి సాధించామని తెలిపారు.

*మార్కెట్ ముగిసిన తర్వాత ఆర్థిక ఫలితాలు వెలువడ్డాయి. బీఎస్ఈలో ఎయిర్‌టెల్ షేర్ 4 శాతం నష్టంతో రూ.324 వద్ద ముగిసింది.*

# మ్యాక్స్‌క్యూర్.. ఇక మెడికవర్ హాస్పిటల్స్!!

- వాటా పెంచుకున్న స్వీడన్ కంపెనీ
- కొత్తగా మరో మూడు ఆసుపత్రులు
- మెడికవర్ ఎండీ అనిల్ కృష్ణ




మెడికవర్ ఇండియా ఎండీ అనిల్ కృష్ణ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వైద్య సేవల రంగంలో ఉన్న మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్స్ పేరు మారింది. ఇక నుంచి మెడికవర్ హాస్పిటల్స్‌గా పిలుస్తారు. మ్యాక్స్‌క్యూర్‌ను ప్రమోట్ చేస్తున్న సహృదయ హెల్త్‌కేర్‌లో స్వీడన్‌కు చెందిన మెడికవర్‌కు ఇప్పటి వరకు 46.5 శాతం వాటా ఉంది. నవంబరు నాటికి ఇది 51 శాతానికి చేరనుంది. హెల్త్‌కేర్, డయాగ్నోస్టిక్స్ సేవలతో అంతర్జాతీయంగా విస్తరించిన మెడికవర్.. తాజా డీల్‌తో భారత ఆరోగ్య సేవల రంగంలో ప్రవేశించినట్టయింది. సహృదయలో మెడికవర్ ఇప్పటికే రూ.270 కోట్లు పెట్టుబడి పెట్టింది. మిగిలిన 4.5 శాతం వాటా కోసం మరో రూ.50 కోట్ల దాకా ఇన్వెస్ట్ చేస్తోంది. సహృదయ హెల్త్‌కేర్ బోర్డులోకి మెడికవర్ చేరినప్పటికీ, రోజువారీ కార్యకలాపాల్లో ఎటువంటి జోక్యం ఉండబోదని కంపెనీ వర్గాలు తెలిపాయి. భారత్‌లో పెద్ద ఎత్తున విస్తరించాలన్న లక్ష్యంతో ఉన్న ఈ యూరప్ సంస్థ రానున్న రోజుల్లో సహృదయ హెల్త్‌కేర్‌లో వ్యూహాత్మక భాగస్వామిగా మరింత వాటా పెంచుకోనుంది.

**కొత్తగా ఆసుపత్రులు..**

మ్యాక్స్‌క్యూర్‌ను ప్రముఖ వైద్యుడు అనిల్ కృష్ణ స్థాపించారు. హైదరాబాద్‌లో మూడు, వైజాగ్‌లో రెండు, నిజామాబాద్, కరీంనగర్, సంగారెడ్డి, నెల్లూరు, కర్నూలు, మహారాష్ట్రలోని నాసిక్‌లో ఒక్కో ఆసుపత్రి ఉంది. వీటన్నిటి పడకల సామర్థ్యం 2,000 దాకా ఉంది. కొత్తగా భాగ్యనగరిలో రెండు, ముంబైలో ఒక హాస్పిటల్ ఈ ఏడాది నవంబరుకల్లా సిద్ధమవుతున్నాయి. వీటి రాకతో 700 పడకలు జత కూడనున్నాయని మెడికవర్ ఇండియా ఎండీ అనిల్ కృష్ణ సాక్షి బిజినెస్ బ్యూరోకు వెల్లడించారు. ‘సంస్థలో రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టాం. ఇప్పటికే 6,000 పైచిలుకు ఉద్యోగులున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే ప్రతి ఆసుపత్రి ద్వారా 600 నుంచి 1.000 మందికి ఉపాధి లభించనుంది’ అని వివరించారు. డీల్ తదనంతరం అనిల్ కృష్ణ వాటా 33 శాతం, వైద్యులైన ఇతర ఇన్వెస్టర్ల వాటా 16%గా ఉంటుంది.

# కాఫీ డే అప్పులు రూ. 5,200 కోట్లు!!

- ఏడాది వ్యవధిలోనే రెట్టింపు
- 75 శాతం పైగా ప్రమోటర్ షేర్లు తనఖాలోనే
- మిగతా గ్రూప్ సంస్థల రుణాలపైనా సందేహాలు
- కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఫైలింగ్స్‌తో వెలుగులోకి




**న్యూఢిల్లీ:** తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లతో కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ అకాల మరణం నేపథ్యంలో ఆయన గ్రూప్ సంస్థల రుణ భారం చర్చనీయాంశంగా మారింది. సిద్ధార్థతో పాటు ఆయనకు చెందిన పలు సంస్థలు .. వివిధ ఆర్థిక సంస్థలు మొదలుకుని బ్యాంకుల దాకా చాలా చోట్ల నుంచి ఎంత దొరికితే అంత అన్నట్లుగా రుణాలు సమీకరించాయి. అత్యంత తక్కువగా రూ. 1 లక్ష నుంచి అనేక కోట్ల దాకా తీసుకున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలు, కార్పొరేట్ వ్యవహారాల శాఖకు ఆయా సంస్థలు దాఖలు చేసిన ఫైలింగ్స్ ద్వారా ఈ వివరాలు ఒక్కొక్కటిగా బైటికొస్తున్నాయి. బీఎస్ఈలో లిస్టయిన కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ (సీడీఈఎల్) రుణభారం 2019 మార్చి 31 నాటికి రూ. 5,251 కోట్లుగా ఉంది. ఇది గతేడాది మార్చి ఆఖరున ఉన్న రూ. 2,457 కోట్లతో పోలిస్తే ఏకంగా రెట్టింపు కావడం గమనార్హం. ఇక సీడీఈఎల్ ప్రమోటర్ కంపెనీలు దేవదర్శిని ఇన్ఫో టెక్నాలజీస్, కాఫీ డే కన్సాలిడేషన్స్, గొనిబేడు కాఫీ ఎస్టేట్స్, సివన్ సెక్యూరిటీస్ మొదలైనవి కూడా పలు దఫాలుగా పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నాయి. సోమవారం అదృశ్యమైన సిద్ధార్థ.. బుధవారం నేత్రావతి నదిలో శవంగా తేలిన సంగతి తెలిసిందే. తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నానంటూ అదృశ్యం కావడానికి ముందు ఆయన రాసినట్లుగా భావిస్తున్న ఒక లేఖలోని అంశాలు సిద్ధార్థ ఆర్థిక సమస్యల వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ)కు ఆయన సంస్థలు దాఖలు చేసిన ఫైలింగ్స్‌లోని విషయాలు బైటికి వస్తున్నాయి. వీటిని బట్టి చూస్తే..

- టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీస్, క్లిక్స్ క్యాపిటల్ సర్వీసెస్ (గతంలో జీఈ మనీ ఫైనాన్స్ సర్వీసెస్), షాపూర్‌జీ పల్లోంజీ ఫైనాన్స్ (ఎస్‌పీఎఫ్) వంటి సంస్థల నుంచి కూడా సిద్ధార్థ రుణాలు తీసుకున్నారు. ఇందులో టాంగ్లిన్ డెవలప్‌మెంట్స్ అనే అనుబంధ సంస్థకు ఎస్‌పీఎఫ్ రూ. 12 కోట్లు రుణం ఇచ్చేందుకు అంగీకరించినట్లు 2018 ఏప్రిల్‌లో ఎంసీఏకు సమర్పించిన ఫైలింగ్‌లో ఉంది.
- ఇక మరో ఫైలింగ్‌లో కాఫీ డే హోటల్స్ అండ్ రిసార్ట్స్‌కు ‘రూ. లక్ష దాకా టర్మ్ రుణ సదుపాయం కల్పించేందుకు‘ క్లిక్స్ క్యాపిటల్ అంగీకరించిన డీల్ గురించిన ప్రస్తావన ఉంది.
- సిద్ధార్థకు చెందిన అన్‌లిస్టెడ్ కంపెనీలు (ఆతిథ్య, రియల్టీ రంగాలవి) ఎంత మేర రుణాలు తీసుకున్నాయన్నది ఇంకా ఇదమిత్థంగా తెలియనప్పటికీ.. వీటి అప్పుల భారం కూడా సీడీఈఎల్ స్థాయిలోనే ఉండొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి.
- 2017 తర్వాత సిద్ధార్థ రుణాల పరిమాణం గణనీయంగా పెరిగింది. అయితే, గడువులోగా వీటిలో ఎన్ని రుణాలను చెల్లించారు, ఇంకా ఎన్ని ఉన్నాయి, ఎన్ని మొండిబాకీలుగా మారాయన్నది ఇంకా పూర్తిగా తెలియాల్సి వుంది.
- ఎంసీఏ డేటా ప్రకారం 2018 మార్చి ఆఖరు నాటికి కాఫీ డే కన్సాలిడేషన్స్ స్వల్పకాలిక రుణాలు, తక్షణం జరపాల్సిన చెల్లింపుల పరిమాణం రూ. 36.53 కోట్లుగా ఉన్నాయి.
- వీజీ సిద్ధార్థ, సీడీఈఎల్ ప్రమోటర్ గ్రూప్ సంస్థలు తమ వద్ద ఉన్న షేర్లలో మూడొంతుల షేర్లను తనఖా పెట్టాయి. ఇటీవలే రెణ్నెల్ల క్రితం జూన్‌లో కూడా సిద్ధార్థ కొన్ని షేర్లను అదనంగా తనఖా పెట్టారు. జూన్ ఆఖరు నాటికి సీడీఈఎల్‌లో సిద్ధార్థకు 32.7 శాతం, ఆయన భార్య మాళవిక హెగ్డేకు 4.05 శాతం, నాలుగు ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు 17 శాతం మేర వాటాలు ఉండేవి.
- ప్రమోటింగ్ సంస్థలు తమ మొత్తం హోల్డింగ్‌లో 75.7 శాతం (సుమారు 8.62 కోట్ల షేర్లు) తనఖాలో ఉంచాయి. జూన్ ఆఖర్లో కూడా సిద్ధార్థ కొత్తగా మరో 1.39 శాతం (29.2 లక్షల షేర్లు) తనఖా పెట్టారు. గ్రూప్ కంపెనీలు కోటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి తీసుకున్న రుణాలకు పూచీకత్తుగా వీటిని కోటక్ మహీంద్రా బ్యాంక్ పేరిట తనఖా పెట్టారు.
- ఇక సీడీఈఎల్‌లో సివన్ సెక్యూరిటీస్‌కి ఉన్న మొత్తం వాటాలు (0.21 శాతం) వాటాలు తనఖాలోనే ఉన్నాయి. అటు సీడీఈఎల్‌లో కాఫీ డే కన్సాలిడేషన్స్‌కు ఉన్న 5.81 శాతం వాటాల్లో 95.96 శాతం షేర్లు తనఖాలో ఉన్నాయి.
- దేవదర్శిని ఇన్ఫో టెక్నాలజీస్ వాటాల్లో 83.07 శాతం, గొనిబేడు కాఫీ ఎస్టేట్స్ వాటాల్లో 78.9 శాతం వాటాలు తనఖాలో ఉన్నాయి.

### పార్లమెంటులోనూ సిద్ధార్థ విషాదాంతం ప్రస్తావన..

దివాలా స్మృతి (ఐబీసీ)పై చర్చ సందర్భంగా పార్లమెంటులో కూడా సిద్ధార్థ విషాదాంతం ప్రస్తావన వచ్చింది. వ్యాపార వైఫల్యాలనేవి జరగరానివేమీ కాదని, వ్యాపారవేత్త విఫలమైనంత మాత్రాన చిన్న చూపు చూడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. వ్యాపారం సజావుగా సాగని పక్షంలో వ్యాపారవేత్తలు గౌరవప్రదంగా తప్పుకునేందుకు తగు పరిష్కారమార్గం చూపడమే ఐబీసీ ఉద్దేశమని వివరించారు. అటు.. కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ విషాదాంతాన్ని ప్రస్తావిస్తూ వ్యాపారపరమైన వైఫల్యాల కారణంగా పరిశ్రమలు మూతబడుతున్నాయని వైసీపీ ఎంపీ ఎం శ్రీనివాసులు రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారాన్ని సులభతరం చేస్తున్నామని ప్రభుత్వం చెబుతుంటే.. వ్యాపారాలు నడపడంలో కష్టాలు మరింతగా పెరుగుతున్నాయన్నారు. వ్యాపారసంస్థల్లో భయాందోళనలు నెలకొన్నాయని, వీటిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. నిజాయితీగా పనిచేసే సంస్థలను, తప్పుడు విధానాలు పాటించే సంస్థలను ప్రభుత్వం ఒకే రీతిగా చూస్తోందంటూ ‘గుర్రాలు, గాడిదలను ఒకే గాటన కట్టేయడం సరికాదు’ అని శ్రీనివాసులు రెడ్డి వ్యాఖ్యానించారు. వ్యక్తిగత పూచీకత్తు కారణంగా ఒక పారిశ్రామికవేత్త ఆత్మహత్య చేసుకోవాల్సిన తీవ్ర పరిస్థితులు తలెత్తడం సరికాదని టీడీపీ ఎంపీ జయదేవ్ గల్లా తెలిపారు.

## సౌత్ ఇండియా షాపింగ్ మాల్ శ్రావణ సంబరాలు




ఆషాఢమాసం ఆఫర్లను శ్రవణమాసంలోనూ కొనసాగించాలని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం నిర్ణయించింది. ఆషాఢమాసంలో కస్టమర్ల నుంచి వచ్చిన విశేష స్పందన నేపథ్యంలో... దక్షిణాది వాసులకు అత్యంత శుభప్రదమైన శ్రావణ మాసంలో సైతం ఆఫర్లను కొనసాగించాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. షోరూమ్‌లలో సరికొత్త స్టాక్స్‌ను కస్టమర్లకు అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ఆషాఢమాసంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తూకం పద్ధతిలో ప్రవేశపెట్టిన నంబర్ వన్ కిలో సేల్‌కు మంచి ఆదరణ లభించిందని తెలిపింది. అన్ని రకాల సరికొత్త స్టాక్‌పై 66 శాతం వరకూ ఇచ్చిన తగ్గింపు చీరల అమ్మకాన్ని భారీగా పెంచిందని కూడా పేర్కొంది.

## భాగ్యనగర్‌లో బోకాన్సెప్ట్ ఫర్నీచర్ స్టోర్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రీమియం ఫర్నీచర్ తయారీలో ఉన్న యూరప్ బ్రాండ్ బోకాన్సెప్ట్ దక్షిణాదిన ప్రవేశించింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో 4,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేసింది. 1,200లకుపైగా రకాల ఫర్నీచర్, లైటింగ్ ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయి. ఇప్పటికే ఢిల్లీ, ముంబైలో ఒక్కో స్టోర్‌ను నిర్వహిస్తున్నామని బోకాన్సెప్ట్ ఇండియా డైరెక్టర్ నవీన్ ఖన్నా గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. 2020 డిసెంబరుకల్లా కొత్తగా 3–4 స్టోర్లు తెరుస్తామని వెల్లడించారు. 'ఒక్కో కేంద్రానికి రూ.4 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. డెన్మార్క్ నుంచి ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం. వీటి ధరలు రూ.16 లక్షల వరకు ఉన్నాయి. కస్టమర్ కోరుకున్నట్టుగా కస్టమైజ్ చేసి ఇస్తాం. 2018–19లో రూ.20 కోట్ల టర్నోవర్ నమోదు చేశాం' అని వివరించారు.

## విస్తరణ బాటలో మేజిక్‌పిన్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఆఫ్‌లైన్ స్టోర్ల డిస్కవరీ ప్లాట్‌ఫాం మేజిక్‌పిన్ హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. కంపెనీతో భాగస్వామ్యమున్న దుకాణాల్లో షాపింగ్ చేసిన కస్టమర్లు.. బిల్లు ఫోటోతోపాటు సెల్ఫీని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇలా చేయడం ద్వారా రివార్డు పాయింట్లు దక్కించుకోవచ్చు. వీటిని భాగస్వామ్య ఔట్‌లెట్లలో రెడీమ్ చేసుకోవచ్చని కంపెనీ కో–ఫౌండర్ అన్షూ శర్మ తెలిపారు. 50 నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నట్టు చెప్పారు. కొద్ది రోజుల్లో వరంగల్, కరీంనగర్‌లో విస్తరిస్తామన్నారు. కంపెనీకి 50 లక్షలకుపైగా యూజర్లున్నారు.

# భారత్‌లో డిమాండ్ బంగారం

- క్యూ2లో 13 శాతం పెరుగుదల
- 213 టన్నులుగా నమోదు
- ఆకర్షణీయ ధరలు, పర్వదినాలతో పెరిగిన కొనుగోళ్లు
- ఆర్‌బీఐకి కూడా పసిడి ఆకర్షణ
- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక

**ముంబై:** బంగారానికి ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో (క్యూ2) దేశంలో మంచి డిమాండ్ నమోదయ్యింది. 2018 ఇదే కాలంతో పోల్చితే డిమాండ్ 13 శాతం పెరిగి 213 టన్నులకు చేరింది. సంబంధిత మూడు నెలల్లో పర్వదినాలు, అలాగే ఆకర్షణీయమైన ధరలు పసిడి కొనుగోళ్లను పెంచినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) తన తాజా నివేదికలో పేర్కొంది. కౌన్సిల్ మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా) సోమసుందరం నివేదికలో అంశాలను వెల్లడించారు. కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- 2018 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో పసిడికి డిమాండ్ 189.2 టన్నులు. అంటే 2019 ఇదే కాలంలో 13 శాతం పెరిగి, 213 టన్నులుగా నమోదయ్యిందన్నమాట.
- విలువ రూపంలో చూస్తే, పసిడి డిమాండ్ 17 శాతం పెరిగి రూ.53,260 కోట్ల నుంచి రూ.62,422 కోట్లకు ఎగసింది.
- ఆభరణాలకు డిమాండ్ 12 శాతం పెరిగి, 149.9 టన్నుల నుంచి 168.6 టన్నులకు చేరింది.
- విలువలో ఆభరణాలను చూస్తే, 17 శాతం పెరిగి రూ. 42,200 కోట్ల నుంచి రూ.49,380 కోట్లకు చేరింది.
- పెట్టుబడుల డిమాండ్ 13 శాతం పెరిగి 39.3 టన్నుల నుంచి 44.5 టన్నులకు చేరింది.
- పెట్టుబడులకు సంబంధించి విలువ 18 శాతం పెరుగుదలతో రూ.11,060 కోట్ల నుంచి 13,040 కోట్లకు ఎగసింది.
- గోల్డ్ రీసైకిల్డ్ విలువ 18 శాతం ఎగసి 32 టన్నుల నుంచి 37.9 టన్నులకు ఎగసింది.
- కడ్డీలు, నాణేల డిమాండ్ భారీగా ఐదేళ్ల గరిష్టాన్ని తాకడం గమనార్హం.
- నెలల వారీగా ఏప్రిల్, మేలలో డిమాండ్ భారీగా ఉన్నా, జూన్‌లో దాదాపు యథాతథ స్థాయిలో ఉంది. ధరలు పెరగడం, బడ్జెట్‌లో ఎగుమతుల సుంకం మరింత పెంచే అవకాశం ఉందన్న వార్తలు దీనికి కారణమయ్యాయి.
- జనవరి–జూన్ దేశంలో పసిడి డిమాండ్ 9 శాతం పెరిగి 372.2 టన్నులుగా నమోదయ్యింది. ఆర్థిక మందగమనం, ఎన్నికల సీజన్ నేపథ్యంలో నగదు కదలికలపై ఆంక్షలు వంటి ప్రతికూలతలు ఉన్నా... ఈ స్థాయి వృద్ధి నమోదుకావడం గమనార్హం.
- 2019 గడచిన ఆరు నెలల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 17.7 టన్నుల పసిడిని కొనుగోలు చేసింది. 2018 ఇదే కాలంలో ఈ పరిమాణం 8.1 టన్నులు మాత్రమే.
- కాగా త్రైమాసిక కాలంలో డిమాండ్‌కు తగ్గట్టుగా పసిడి దిగుమతులు జరగలేదు.
- 2017 తొలి త్రైమాసికం నుంచీ దేశంలో పసిడి సరఫరా బాగుంది. భారీగా పెరిగిన ధరల నేపథ్యంలో... రీసైక్లింగ్ కూడా ఊపందుకునే వీలుంది.
- కస్టమ్స్ సుంకాల పెంపు భారత్‌లో పసిడి డిమాండ్‌పై దీర్ఘకాలం ఉంటుందని భావించడం లేదు. అయితే మూడవ త్రైమాసికంలో మాత్రం కొంత కనబడవచ్చు. తరువాత డిమాండ్ పుంజుకుంటుంది.
- 2019 మొత్తంలో పసిడి డిమాండ్ 750 నుంచి 850 టన్నుల వరకూ ఉంటుందని అంచనా.




## ప్రపంచ వ్యాప్త డిమాండ్ 1,123 టన్నులు



ప్రపంచవ్యాప్తంగా రెండవ త్రైమాసికంలో పసిడి డిమాండ్ 8 శాతం పెరిగి 1,123 టన్నులుగా నమోదయ్యింది. సెంట్రల్ బ్యాంకులు భారీగా పసిడిని కొనుగోలు చేయడం, పసిడి ఆధారిత ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ పెట్టుబడులు ఎనిమిది శాతం వృద్ధికి కారణం. 2018 రెండవ త్రైమాసికంలో ప్రపంచ వ్యాప్త పసిడి డిమాండ్ 1,038.8 టన్నులని డబ్ల్యూజీసీ క్యూ2 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్ నివేదిక వివరించింది. సెంట్రల్ బ్యాంకుల డిమాండ్ 67 శాతం పెరిగి 152.8 టన్నుల నుంచి 224.4 టన్నులకు చేరింది. పోలాండ్ భారీగా 100 టన్నులు కొనుగోలు చేసింది. ఈ విషయంలో ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండే రష్యాను వెనక్కు నెట్టింది. ఈటీఎఫ్‌ల పెట్టుబడులు భారీగా ఉన్నా కేవలం పెట్టుబడులకు పసిడి డిమాండ్ ఒకశాతమే పెరిగింది. యూరోప్, చైనాల్లో 12 కడ్డీలు, నాణేలు డిమాండ్ పడిపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈటీఎఫ్‌ల పెట్టుబడులు 67.2 టన్నులు పెరిగి 2,548 టన్నులుగా నమోదయ్యింది. ఇది ఆరేళ్ల గరిష్టస్థాయి. భౌగోళిక ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంక్‌ల సరళతర విధానాలు పసిడి ధరలకు జూన్‌లో ఊతం ఇచ్చాయి. ఆభరణాల డిమాండ్ 2 శాతం పెరిగి 520.8 టన్నుల నుంచి 531.7 టన్నులకు ఎగసింది. భారత్ మార్కెట్ రికవరీ దీనికి ప్రధాన కారణం. పసిడి సరఫరా 6 శాతం ఎగసి, 1,121.3 టన్నుల నుంచి 1,186.7 టన్నులకు ఎగసింది. పసిడి గనుల ఉత్పత్తి 882.6 టన్నులు. రీసైక్లింగ్ 9 శాతం పెరిగి 314.6 టన్నులకు చేరింది.

## కార్పొబ్రీఫ్స్...

**అమెజాన్:** జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ సిటీలో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న గిడ్డంగిని 5.8 లక్షల చదరపు అడుగులకు చేర్చనుంది.

**అపోలో హాస్పిటల్స్:** కార్డియోవాస్క్యులర్ రోగాల చికిత్సలో భాగంగా మైక్రోసాఫ్ట్‌తో కలిసి నేషనల్ క్లినికల్ కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయనుంది.

**స్ట్రైడ్స్ ఫార్మా:** ఇండిపెండెంట్ డైరెక్టర్ పదవి నుంచి అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జేఎండీ సంగీత రెడ్డి తప్పుకున్నారు.

**ఎన్‌సీసీ:** రైల్వే విభాగం రూ.202 కోట్లు, బిల్డింగ్స్ విభాగం రూ.302 కోట్ల విలువైన ఆర్డరును జూలైలో సాధించాయి.

## నేటి బోర్డు మీటింగ్స్

ఎస్‌బీఐ, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గతి, బీఎస్‌ఈ లిమిటెడ్, గుజరాత్ స్టేట్ పెట్రోనెట్, ఆంధ్రాబ్యాంక్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, బాటా ఇండియా, సోమానీ సెరామిక్స్, టాటా కమ్యూనికేషన్స్, ఐనాక్స్ లీజర్, బీఈఎమ్ఎల్, లారస్ ల్యాబ్స్

# తగ్గిన ప్యాసింజర్ వాహన అమ్మకాలు

**న్యూఢిల్లీ:** దేశీ ప్యాసింజర్ వాహన (పీవీ) విక్రయాలు మరింత నీరసించాయి. జూలైలో మొత్తం పీవీ అమ్మకాలు రెండంకెల క్షీణతను నమోదుచేశాయి. హోండా కార్స్ ఇండియా విక్రయాలు ఏకంగా 49 శాతం క్షీణించగా.. ఈ విభాగంలో మార్కెట్ లీడరైన మారుతీ సుజుకీ ఇండియా అమ్మకాలు 36 శాతం తగ్గాయి. అశోక్ లేలాండ్ విక్రయాలు 29 శాతం పడిపోయాయి. వినియోగదారుల సెంటిమెంట్ దెబ్బతిన్న కారణంగా ఆటో రంగం అమ్మకాలు పడిపోతూ వస్తున్నాయని ఎం అండ్ ఎం చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ (ఆటోమోటివ్ డివిజన్) వీజయ్ రామ్ నక్రా అన్నారు. కొనుగోళ్లు వాయిదా పడిన నేపథ్యంలో విక్రయాలు తగ్గాయని హెచ్‌సీఐఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గోయల్ వ్యాఖ్యానించారు. అధిక బీమా, ద్రవ్యలభ్యత కొరత, వర్షా కాలం ఆలస్యం కావడమే ఇందుకు కారణమని టయోటా కిర్లోస్కర్ మోటార్ డిప్యూటీ ఎండీ ఎన్ రాజా అన్నారు.

**జూలై వాహన విక్రయాలు (దేశీయ)**

| కంపెనీ | 2019 | 2018 | క్షీణత (శాతం) |
|---|---|---|---|
| హోండా కార్స్ | 10,250 | 19,970 | –49 |
| మారుతీ సుజుకీ | 98,210 | 1,54,150 | –36 |
| అశోక్ లేలాండ్ | 10,101 | 14,205 | –29 |
| మహీంద్రా | 37,474 | 44,605 | –16 |
| హ్యుందాయ్ | 39,010 | 43,481 | –10 |
| టీవీఎస్ మోటార్ | 2,08,489 | 2,47,382 | –16 |
| బజాజ్ ఆటో | 2,05,470 | 2,37,511 | –13 |



## సియట్ ఆదాయం రూ.1,752 కోట్లు

### 15 శాతం పెరిగిన నికర లాభం




**న్యూఢిల్లీ:** టైర్ల కంపెనీ సియట్ నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ ఆర్థిక సంవత్సరం జూన్ క్వార్టర్‌లో 15 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.71 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.82 కోట్లకు పెరిగిందని సియట్ తెలిపింది. కార్యకలాపాల ఆదాయం రూ.1,722 కోట్ల నుంచి రూ.1,752 కోట్లకు పెరిగిందని కంపెనీ ఎమ్‌డీ అనంత్ గోయెంకా చెప్పారు. వాహన కంపెనీల నుంచి డిమాండ్ తగ్గడం టైర్ల పరిశ్రమపై తీవ్రమైన ప్రభావమే చూపించిందని పేర్కొన్నారు. రీప్లేస్‌మెంట్ మార్కెట్, ఎగుమతుల జోరు ద్వారా ఈ ప్రభావాన్ని అధిగమించామని వివరించారు.

ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సియట్ షేర్1 శాతం నష్టంతో రూ.810 వద్ద ముగిసింది.

- **జీఎస్‌కే కన్సూమర్ హెల్త్‌కేర్:** తొలి త్రైమాసిక కాలంలో రూ.1,321 కోట్ల మొత్తం ఆదాయం, రూ.248 కోట్ల నికర లాభం సాధించింది. గత క్యూ1లో మొత్తం ఆదాయం రూ.1,204 కోట్లుగా, నికర లాభం రూ.200 కోట్లుగా ఉన్నాయి.

**బులియన్** రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,490 | ▼ 260 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,800 | ▼ 250 |
| వెండి (కిలో) | 43,700 | ▼1100 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,760 | ▼ 270 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,100 | ▼ 260 |
| వెండి (కిలో) | 43,700 | ▼1100 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,760 | ▼ 270 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,100 | ▼ 260 |
| వెండి (కిలో) | 43,700 | ▼1100 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,650 | ▼ 200 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,150 | ▼ 70 |
| వెండి (కిలో) | 43,700 | ▼ 400 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,640 | ▼ 250 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,150 | ▼ 230 |
| వెండి (కిలో) | 42,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,780 | ▼ 290 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,100 | ▼ 260 |
| వెండి (కిలో) | 43,700 | ▼1100 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**ముడిచమురు...** (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 54.55 | $58.58 |
| బ్రెంట్ | 60.95 | $65.05 |

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -25/100కు రూ.లలో) 2-08-2019

| | |
|---|---|
| విశాఖ | 352-00 |
| చిత్తూరు | 368-00 |
| వరంగల్ | 323-00 |
| చెన్నై | 375-00 |
| ముంబై | 375-00 |
| విజయవాడ | 332-00 |
| నమక్కల్ | 365-00 |
| గోదావరి | 332-00 |
| 1-08-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 320-00 |
| రిటైల్ (ఒక గుడ్డు) | 3.80 |
| బెంగళూరు | 350-00 |
| కోల్‌కత | 365-00 |
| ఢిల్లీ | 330-00 |

## జూలైలో తయారీ రంగం ఓకే!: పీఎంఐ



**న్యూఢిల్లీ:** తయారీ రంగం జూలైలో కొంత మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఇండియా మ్యాను ఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ ఇండెక్స్ (పీఎంఐ) 52.5గా నమోదయ్యింది. జూన్‌లో ఈ సూచీ 52.1గా ఉంది. కొత్త ఆర్డర్లు రావడం, ఉత్పత్తి పటిష్టత తాజా సూచీ మెరుగుకు కారణం. కాగా ఈ సూచీ 50 లోపనకు పడిపోతేనే క్షీణతగా భావించడం జరుగుతుంది. లేదంటే, వృద్ధితీరుగానే భావించడం జరుగుతుంది. ఆ లెక్కన వరుసగా 24 నెలల నుంచీ తయారీ సూచీ వృద్ధి బాటలోనే ఉంటోంది. ఆగస్టు 5, 6,7 తేదీల్లో ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో తాజా గణాంకాలు వెలువడ్డాయి.

## 6 నుంచి స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ ఐపీఓ

- ప్రైస్‌బాండ్ రూ.775–789
- ఇష్యూ సైజు రూ.3,125 కోట్లు
- ఈ నెల 20న లిస్టింగ్




**న్యూఢిల్లీ:** స్టెర్లింగ్ అండ్ విల్సన్ కంపెనీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ నెల 6 నుంచి ఆరంభం కానున్నది. ఈ నెల 8న ముగిసే ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.3,125 కోట్లు సమీకరిస్తుందని అంచనా. ఈ ఐపీఓకు ప్రైస్‌బాండ్‌గా కంపెనీ రూ.775–789 ధరల శ్రేణిని కంపెనీ నిర్ణయించింది. కనీసం 19 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 20న ఈ కంపెనీ షేర్లు స్టాక్ మార్కెట్లోలిస్టవుతాయి. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, క్రెడిట్ సూసీ సెక్యూరిటీస్ ఇండియా, డాషే ఈక్విటీస్ ఇండియా, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, యెస్ సెక్యూరిటీస్ ఇండియాలు వ్యవహరిస్తున్నాయి. ఈ

# రెలిగేర్ మాజీ ప్రమోటర్ల కార్యాలయాల్లో ఈడీ సోదాలు

- మనీలాండరింగ్ కేసు విచారణలో భాగం
- రూ. 2,397 కోట్ల నిధుల దుర్వినియోగంపై విచారణ



**న్యూఢిల్లీ:** మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా రెలిగేర్ మాజీ ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివీందర్ మోహన్ సింగ్ సోదరులతో పాటు మరికొందరి కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సోదాలు నిర్వహించింది. సింగ్ సోదరులు సహ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ (ఆర్‌ఈఎల్) మాజీ సీఎండీ సునీల్ గోధ్వాని, ఆర్‌ఈఎల్ ఎగ్జిక్యూటివ్‌లు ఎన్‌కే ఘోషల్, హేమంత్ ధింగ్రాలకు ఢిల్లీలోని ఏడు ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాల్లో సోదాలు జరిపింది. 2018 ఫిబ్రవరి దాకా ఆర్‌ఈఎల్ ప్రమోటర్లుగా సింగ్ సోదరులు కొనసాగారు. వారి హయాంలో రూ. 740 కోట్ల మేర అక్రమాలు జరిగాయంటూ ఆర్‌ఈఎల్ అనుబంధ సంస్థ రెలిగేర్ ఫిన్‌వెస్ట్ గతేడాది డిసెంబర్‌లో ఢిల్లీ పోలీస్ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ)కి ఫిర్యాదు చేసింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఈడీ కూడా కేసు నమోదు చేసింది. దీనితో పాటు మొత్తం రూ. 2,397 కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో విచారణ జరుపుతోంది.

## బ్యాంక్ రుణ వృద్ధి 12%

### డిపాజిట్ల వృద్ధి 10.6 శాతం

**ముంబై:** బ్యాంక్ రుణ వృద్ధి జూలై 19వ తేదీతో ముగిసిన పక్షం రోజుల్లో (వార్షిక కాలవ్యవధితో పోల్చి) 12.01 శాతం పెరిగి రూ.96.57 లక్షల కోట్లుగా నమోదయ్యింది. డిపాజిట్ల వృద్ధి 10.59 శాతంతో రూ.126.491 లక్షల కోట్లుగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తాలు వరుసగా రూ.86.09 లక్షల కోట్లు, రూ.114.371 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆహారేతర రుణం జూన్‌లో (2018 జూన్‌తో పోల్చి) 11.1 శాతం పెరిగింది. వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు రుణం 8.7 శాతం పెరిగింది. సేవల విభాగానికి రుణ వృద్ధి 13 శాతం ఎగసింది. వ్యక్తిగత రుణ వృద్ధి జూన్‌లో 16.6 శాతం ఎగసింది.

## జూలైలో పెరిగిన జీఎస్‌టీ వసూళ్లు

### రూ.1.02 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) వసూళ్లు జూలైలో రూ.1.02 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెల్లోని రూ.96,483 కోట్ల వసూళ్లతో పోల్చితే 5.8 శాతం పెరిగినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్‌లో రూ.99,939 కోట్లకు పరిమితమై ఈ ఏడాదిలో లక్ష కోట్ల దిగువకు పడిపోయిన వసూళ్లు.. మరోసారి ఈ మార్కును అధిగమించాయి. సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) రూ.17,912 కోట్లు, స్టేట్ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) రూ.25,008 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) రూ.50,612 కోట్లు, సెస్ రూ.8,551 కోట్లు వసూళ్లు కావడం ద్వారా మళ్లీ లక్ష కోట్ల మార్కు చేరుకున్నట్లు వివరించింది. ఇక ఏప్రిల్–జూలై కాలంలో స్థూల వసూళ్లు రూ.4,16,176 కోట్లు కాగా, గతేడాది క్యూ1లో ఈమొత్తం రూ.3,89,568 కోట్లుగా ఉన్నాయి.

## టిగోర్ ఈవీ ధరలు తగ్గించిన టాటా మోటార్స్

### రూ.80,000 వరకు తగ్గింపు

**ముంబై:** టిగోర్ ఎలక్ట్రిక్ వాహనాల ధరలను తగ్గించినట్లు టాటా మోటార్స్ గురువారం ప్రకటించింది. ఈ మోడల్‌లో ఎక్స్‌ఈ, ఎక్స్ఎం, ఎక్స్‌టీ వేరియంట్లను విక్రయిస్తోన్న కంపెనీ.. వేరియంట్ ఆధారంగా రూ.80,000 వరకు ధరలను తగ్గించినట్లు వెల్లడించింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలపై వస్తు సేవల పన్నును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో ఈ మేరకు ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేస్తున్నట్లు సంస్థ ఎలక్ట్రిక్ మొబిలిటీ బిజినెస్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు.

**నిఫ్టీ 50**

**టాప్ 10 లూజర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| VEDL | 145.45 | -5.61 |
| JSWSTEEL | 225.55 | -5.01 |
| SBIN | 316.6 | -4.7 |
| TATAMOTORS | 129.7 | -4.35 |
| HINDALCO | 182.6 | -4.17 |
| ZEEL | 347.2 | -3.98 |
| BHARTIARTL | 325 | -3.73 |
| INFY | 770.25 | -2.95 |
| TATASTEEL | 419.7 | -2.86 |
| IBULHSGFIN | 520.95 | -2.74 |

**టాప్ 10 గెయినర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| MARUTI | 5,586.00 | 2.13 |
| WIPRO | 270.9 | 2.11 |
| INFRATEL | 250.5 | 1.93 |
| POWERGRID | 214.65 | 1.83 |
| RELIANCE | 1,185.75 | 1.67 |
| EICHERMOT | 16,500.00 | 0.93 |
| BAJAJ-AUTO | 2,539.00 | 0.89 |
| HEROMOTOCO | 2,370.10 | 0.59 |
| TITAN | 1,062.00 | 0.53 |
| BRITANNIA | 2,602.05 | 0.47 |

**ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు**

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 371.1 | 377.55 |
| ASIAN PAINT | 1504.7 | 1521.1 |
| AXIS BANK | 669.3 | 674.1 |
| BAJAJ AUTO | 2537.65 | 2516.5 |
| BAJAJ FINSE | 7082 | 7097.85 |
| BAJAJ FINAN | 3222.1 | 3252.05 |
| BHARTI AIRT | 323.9 | 337.6 |
| BPCL | 343.65 | 345.5 |
| BRITANNIA | 2600.9 | 2605 |
| CIPLA LTD | 512.45 | 521.1 |
| COAL INDIA | 202.45 | 204.45 |
| EICHER MOTO | 16562.8 | 16348.05 |
| GAIL (INDIA) | 128.6 | 128.85 |
| GRASIM INDU | 774.55 | 788.35 |
| HCL TECHNOL | 1021.55 | 1034.55 |
| HDFC LTD | 2086.8 | 2121.8 |
| HDFC BANK L | 2221.8 | 2251.65 |
| HERO MOTOCO | 2368.55 | 2356.1 |
| HINDALCO I | 182.75 | 190.55 |
| HUL | 1731.3 | 1726.65 |
| INDIABULLS | 521.95 | 535.6 |
| ICICI BANK | 417.05 | 424.6 |
| INDUSIND BA | 1398.65 | 1412.85 |
| BHARTI INFR | 250.95 | 245.75 |
| INFOSYS LIM | 768.85 | 793.65 |
| INDIAN OIL | 136.95 | 139.3 |
| ITC LTD | 267.55 | 270.2 |
| JSW STEEL L | 225.25 | 237.45 |
| KOTAK MAHIN | 1495.8 | 1519.55 |
| LARSEN & T | 1358.05 | 1387.3 |
| MAHINDRA &M | 548.55 | 550 |
| MARUTI SUZU | 5572.6 | 5469.7 |
| NTPC LTD | 126.85 | 126.55 |
| OIL AND NAT | 136.9 | 138.85 |
| POWER GRID | 214 | 210.8 |
| RIL | 1180.25 | 1166.25 |
| SBI | 317.15 | 332.2 |
| SUN PHARMA | 425.1 | 426.75 |
| TATA MOTORS | 129.55 | 135.6 |
| TATA STEEL | 420 | 432.05 |
| TCS | 2180.05 | 2205.7 |
| TECH MAHIND | 625.65 | 636.25 |
| TITAN COMPA | 1057.3 | 1056.35 |
| ULTRATECH C | 4231.7 | 4346.9 |
| UPL LIMITED | 576.8 | 595.25 |
| VEDANTA LIM | 145.45 | 154.1 |
| WIPRO LTD | 270.4 | 265.3 |
| YES BANK LI | 88.4 | 91.2 |
| ZEE ENTERTA | 346.85 | 361.6 |

**నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ**

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1352.65 | 1363.1 |
| ACC LIMITED | 1515.3 | 1560.4 |
| AMBUJA CEME | 196.8 | 201.9 |
| ASHOK LEYLA | 68.85 | 69.85 |
| BAJAJ HOLDI | 3354.25 | 3400.5 |
| BANDHAN BAN | 480.25 | 480.75 |
| BANK OF BAR | 105.55 | 106.7 |
| BHEL | 57.55 | 58.9 |
| BIOCON LIMI | 223.55 | 226.55 |
| BOSCH LIMIT | 14643.1 | 14438.8 |
| CADILA HEAL | 226.3 | 227.8 |
| COLGATE PAL | 1183.1 | 1189.75 |
| CONTAINER C | 515.45 | 511.8 |
| DABUR INDIA | 425.4 | 426.45 |
| DLF LIMITED | 172.4 | 178.15 |
| AVENUE SUPE | 1483.6 | 1482.7 |
| GENERAL INS | 186.5 | 190.85 |
| GODREJ CONS | 603.55 | 598.75 |
| HAVELLS IND | 647.75 | 645.3 |
| HDFC AMC LI | 2136.4 | 2149.2 |
| HDFC LIFE I | 487.95 | 493.5 |
| HINDUSTAN P | 263.4 | 266.05 |
| HINDUSTAN Z | 211.5 | 216.95 |
| ICICI LOMBA | 1151.45 | 1207.35 |
| ICICI PRU L | 390.3 | 401.75 |
| VODAFONE ID | 6.65 | 6.85 |
| INTERGLOBE | 1551.6 | 1557.2 |
| L&T FINANCE | 96.2 | 99.05 |
| LUPIN LIMIT | 759.05 | 764.8 |
| MARICO LIMI | 362.6 | 366.8 |
| UNITED SPIR | 575.5 | 594.05 |
| MOTHERSON S | 105.4 | 106.75 |
| MRF LTD | 53355.6 | 53548.75 |
| NHPC LTD | 21.8 | 22.15 |
| THE NEW IND | 111.6 | 114.2 |
| NMDC LTD. | 108.65 | 108.7 |
| ORACLE FIN | 3261.95 | 3394.6 |
| PAGE INDUST | 18435.55 | 18173.1 |
| PIRAMAL ENT | 1765.4 | 1808.85 |
| PETRONET LN | 235.7 | 236.45 |
| P&G HYGIENE | 10749.55 | 10902.35 |
| PIDILITE IN | 1211.4 | 1240.6 |
| STEEL AUTHO | 42.1 | 42.75 |
| SBI LIFE IN | 777 | 797.55 |
| SHREE CEMEN | 20001.75 | 20164.25 |
| SIEMENS LTD | 1119.5 | 1144.75 |
| SHRIRAM TRA | 967.35 | 969.25 |
| UNITED BREW | 1402.6 | 1415.45 |


## రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
### భారత ప్రభుత్వం

BHARATMALA ROAD TO PROSPERITY

**ప్రకటన**

**న్యూ ఢిల్లీ,12 ఫిబ్రవరి, 2019**

**S.O. 823 (E) :-** జాతీయ రహదారుల చట్టం, 1956 (48 ఆఫ్ 1956)లోని సెక్షను 3ఎ లోని సబ్–సెక్షన్ (1) (ఇక మీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రంలో ఎన్‌హెచ్–765డి యొక్క మెదక్ సెక్షన్‌కు ప్రస్తుత కి.మీ 15.97 నుండి ప్రస్తుత కి.మీ. 78.700 వరకు (డిజైన్ కి.మీ 62.920)కు పేవ్డ్ షోల్డర్స్‌తో 2లేన్/4 లేన్‌కు ఔటర్ రింగ్‌రోడ్ పునరుద్ధరణ మరియు స్థాయి పెంపుదల కోసం అవసరమై ఉన్నదని దిగువ షెడ్యూలులో నిర్దేశించిన సంక్షిప్త వివరణగల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని సంతృప్తి చెందిన తర్వాత సదరు అవసరానికి సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి ఇరవై ఒకటి రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్ (1) క్రింద పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి ఆక్షేపణ తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణ సమర్థప్రాధికారికి అంటే రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్, మల్కాజ్‌గిరి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు సమర్థప్రాధికారి ఆక్షేపణదారుకు స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారించబడేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన తర్వాత మరియు సమర్థప్రాధికారి అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తర్వాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీ చేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్ (2) క్రింద సమర్థప్రాధికారిచే చేయబడే ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది.

ఈ ప్రకటన క్రింద కవరయ్యే భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు సమర్థప్రాధికారి యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి మరియు ప్రయోజనంగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

**షెడ్యూలు**

తెలంగాణ రాష్ట్రంలోని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో ఎన్‌హెచ్–765డి (రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ కార్యాలయం:మల్కాజ్‌గిరి) కి.మీ. 15.970 నుండి కి.మీ 78.700 వరకు (డిజైన్ ఛైనేజి 62.920) భూమి స్ట్రెచ్‌లో ఉన్న కట్టడాలతో లేదా కట్టడాలు లేకుండా సేకరించబడనున్న భూమి సంక్షిప్త వివరణ

రాష్ట్రం: తెలంగాణ | రెవెన్యూ డివిజన్: మల్కాజ్‌గిరి | జిల్లా: మేడ్చల్–మల్కాజ్‌గిరి

| క్ర. సం. | సర్వే / ప్లాట్ నంబరు | భూమి రకం | భూమి స్వభావం | విస్తీర్ణం (లోకల్ యూనిట్‌లో) (చ.మీ) | విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| మండలం: దుండిగల్ గండిమైసమ్మ గ్రామం: దుండిగల్ | | | | | |
| 1. | 707 | ప్రైవేట్ | మెట్ట | 22.0000000 | 0.0022000 |
| 2. | 708 | ప్రైవేట్ | మెట్ట | 19.0000000 | 0.0019000 |
| 3. | 709 | ప్రైవేట్ | మెట్ట | 12.0000000 | 0.0012000 |
| మండలం:దుండిగల్ గండిమైసమ్మ గ్రామం: గాగిల్లాపూర్ | | | | | |
| 1. | 119 | ప్రైవేట్ | మెట్ట | 34.0000000 | 0.0034000 |
| 2. | 140 | ప్రైవేట్ | మెట్ట | 4.0000000 | 0.0004000 |
| 3. | 141 | ప్రైవేట్ | మెట్ట | 3.0000000 | 0.0003000 |
| 4. | 184 | ప్రైవేట్ | మెట్ట | 18.0000000 | 0.0018000 |
| 5. | 217 | ప్రైవేట్ | మెట్ట | 3.0000000 | 0.0003000 |
| 6. | 218 | ప్రైవేట్ | మెట్ట | 8.0000000 | 0.0008000 |
| | | | మొత్తం | 123.0000 | 0.0123 |

**[F.No.NH765D TS - 2017-18 - 45/3A4**

**రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ**



కేటీఆర్ బహూకరించిన చీరలో కేథరిన్ హడ్డా

## విలువైన జ్ఞాపకాలతో వెళ్తున్నా: కేథరిన్ హడ్డా

**సాక్షి, హైదరాబాద్:** యూఎస్ కాన్సుల్ జనరల్‌గా బుధవారంతో పదవీ కాలం పూర్తి చేసుకున్న కేథరిన్ హడ్డా.. తన వెంట పలు అమూల్యమైన జ్ఞాపకాలను తీసుకువెళ్తున్నట్లు ట్వీట్ చేశారు. ఇటీవల ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రభుత్వం ఇచ్చిన వీడ్కోలు విందులో ఆమెకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌లు బహూకరించిన చేనేత చీరను కట్టుకుని ఉన్న ఫొటోను ట్విట్టర్‌లో పోస్టు చేశారు. చార్మినార్‌తోపాటు కేథరిన్ దంపతుల చిత్రాలు ముద్రించి ఉండటం ఈ చీర ప్రత్యేకత.

# ఏమిటా స్పీడు... చలాన్ పడుద్ది

### ఔటర్‌పై హెచ్చరికలు జారీ చేయనున్న యంత్రాలు

**హైదరాబాద్:** డ్రైవింగ్... రద్దీ రోడ్లపై నెమ్మదిగా వెళ్లినా, ఖాళీగా కనిపిస్తే చాలు దూసుకుపోతాం. మనలో అనేక మందికి ఇది అలవాటే. ఇక ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) లాంటి మార్గాల్లో వేగానికి పరిమితే ఉండదు. సాధారణ స్పీడ్ దాటినా మీటర్ రీడింగ్ కూడా చాలా మంది చూసుకోరు. ఇదే ప్రమాదాలకు కారణమవుతోంది. ఇదిగో ఇలాంటి వారి కోసమే పోలీసులు కొత్త యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి మీ స్పీడ్‌ను పరిశీలించి హెచ్చరిస్తాయి. 'నో యువర్ స్పీడ్', 'యువర్స్ స్పీడ్'యంత్రాలను ఓఆర్‌ఆర్‌పై ఏర్పాటు చేయనున్నట్లు ట్రాఫిక్ డీసీపీ దివ్యచరణ్‌రావు 'సాక్షి'కి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా తమ పరిధిలోని ఉన్న 62 కి.మీ. ఔటర్‌లో ఒక్కో రోజు ఒక్కో చోట వీటిని వినియోగించనున్నారు.

### యువర్స్ స్పీడ్ పని చేస్తుంది ఇలా..

ఈ యంత్రాన్ని నిర్ణీత ప్రాంతంలో ఏర్పాటు చేస్తారు. ఇది ఎదురుగా వచ్చే వాహనాలను 300-400 మీటర్ల దూరం నుంచే అధ్యయనం చేస్తుంది. రాడార్ టెక్నాలజీతో పని చేసే ఈ యంత్రం వాహన వేగాన్ని అధ్యయనం చేసి అను సంధానించి ఉండే బోర్డు మీద వేగాన్ని (యువర్ స్పీడ్ అంటూ..) అంకెల్లో సూచిస్తుంది. వాహనం సాధారణ వేగంతో ఉంటే గ్రీన్ స్నిగల్‌ను, మితిమీరితే రెడ్ సిగ్నల్ చూపిస్తూ 'డేంజర్'అని హెచ్చరిస్తూ డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. హెచ్చరికను పట్టించుకోకుండా ముందుకు వెళితే అక్కడ ఉండే స్పీడ్ లేజర్ గన్ కెమెరా దీన్ని గుర్తించి ఈ-చలాన్ రూపంలో వాహనదారుడి జరమానా విధిస్తుంది.





### ప్రాథమికంగా రెండు యంత్రాలు...

రోడ్డు ప్రమాద నిరోధం, ప్రాణనష్టం తగ్గించడమే మా లక్ష్యం. ఇందులో భాగంగా రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ ఆదేశాల మేరకు ఓఆర్‌ఆర్‌పై రెండు యంత్రాలను ఏర్పాటు చేస్తున్నాం.
– దివ్య చరణ్ రావు, ట్రాఫిక్ డీసీపీ, రాచకొండ

స్పీడ్ లిమిట్ లోపల వెళ్తే ఇలా 'గ్రీన్' రీడింగ్ చూపిస్తుంది..





స్పీడ్ లిమిట్ దాటి వెళ్తే ఇలా 'రెడ్' రీడింగ్ చూపిస్తుంది..





### ట్యాంక్‌బండ్‌పై ట్రయల్..

ఈ స్పీడ్ డిటెక్టింగ్ టెక్నాలజీని ఇన్‌స్పెక్టర్ ఎం.నర్సింగ్‌రావు నేతృత్వంలోని బృందం గత నెలలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి అధ్యయనం చేసింది. ఈ స్పీడ్ డిటెక్టర్‌లు జర్మనీ టెక్నాలజీతో తయారై రాడార్ పరిజ్ఞానంతో పనిచేస్తాయి. ప్రయోగాత్మక పరిశీలనలో అనేక మంది వాహనచోదకులు 'యువర్ స్పీడ్' చూసుకొని వేగం తగ్గించారని అధికారులు తెలిపారు. మరికొన్ని రోజులు వీటిని అధ్యయనం చేసి, సాధ్యాసాధ్యాలు గుర్తించాక కీలక ప్రాంతాల్లో పెట్టాలని యోచిస్తున్నారు.

# 30 శాతం పిల్లలు ఇతర రాష్ట్రాలవారే!

- 4,097 మంది బాల కార్మికులకు విముక్తి
- 1,192 మంది పొరుగు రాష్ట్రాల వారు
- మధ్యప్రదేశ్, బిహార్ నుంచి అధికం
- ముగిసిన ఆపరేషన్ ముస్కాన్

**సాక్షి, హైదరాబాద్:** బడికెళ్లాల్సిన పిల్లలు పనికెళ్తున్నారు. వసి వాడని 'పసి'డి బాలలు నుసిలో మగ్గుతున్నారు. విధి వంచితులై వీధిపాలవుతున్నారు. తప్పిపోయి అక్రమరవాణా అవుతున్నారు. ఈ నేపథ్యంలో బాలకార్మికుల విముక్తి కోసం అధికారులు ఆపరేషన్ ముస్కాన్-5 చేపట్టారు. జూలై 1 నుంచి 31 వరకు జరిగిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం 4,097 మంది పిల్లలకు వెట్టి నుంచి విముక్తి కల్పించామని విమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ (ఎల్‌అండ్‌వో) స్వాతీలక్రా వెల్లడించారు. ఈ ఆపరేషన్‌ను పోలీసులు, కార్మిక, ఆరోగ్య, శిశు సంక్షేమ, ఎన్జీవోల సాయంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో భారీఎత్తున చేపట్టారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, పుణ్యక్షేత్రాలు, గుళ్లు, ఇటుకబట్టీలు, గాజు పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి బాలలకు విముక్తి కల్పించారు. మరోవైపు ఇంటి నుంచి పారిపోయిన, తప్పిపోయిన పిల్లల కోసం టీఎస్ కాప్, దర్పణ్ సాయంతోనూ ప్రత్యేక బృందాలు గాలించాయి.



**కమిషనరేట్‌లవారీగా కేసులు**

అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో 244 కేసులు, ఖమ్మం 44, రాచకొండ 16, నిజామబాద్ 16 చొప్పున కేసులు నమోదయ్యాయి. వీరిలో బిహార్‌కు చెందిన 56 మంది బాలకార్మికులను రాచకొండ కమిషనరేట్‌లో పోలీసులు రక్షించారు. వీరంతా 8 నుంచి 12 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. ఖమ్మం కమిషనరేట్‌లో పోలీసులు కాపాడిన 29 మంది బాలలు మధ్యప్రదేశ్ నుంచి నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలించబడినవారే. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 478 కేసులు నమోదయ్యాయి.

**అదుపులేని అక్రమరవాణా**

విముక్తి పొందిన బాలల్లో 30 శాతం ఇతర రాష్ట్రాల పిల్లలుండటం రాష్ట్రంలో పెరిగిపోతున్న మానవ అక్రమరవాణాకు నిదర్శనం. ఇతర రాష్ట్రాల్లో పిల్లలను కొన్ని ముఠాలు ఎత్తుకొచ్చి, తల్లిదండ్రులను మభ్యపెట్టి 8 నుంచి 12 ఏళ్ల చిన్నారులను తెలంగాణకు తరలిస్తున్నాయి. వీరిలో చాలామంది తమ చిరునామాలను చెప్పలేకపోతున్నారు. వీరిని తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చడం పోలీసులకు సవాలే. ఈ తరహా పిల్లల్లో చాలామంది తల్లిదండ్రులు బీదవారు/ భిక్షాటన చేసేవారు. రాష్ట్రంలోకి అడుగుపెట్టే అక్రమరవాణా ముఠాలపై కఠినంగా వ్యవహరించాలని ఎన్జీవోలు డిమాండ్ చేస్తున్నాయి.

**దర్పణ్ యాప్ ద్వారా...**

తప్పిపోయిన ముగ్గురు చిన్నారులను దర్పణ్‌యాప్‌తో గుర్తించగలిగారు. జూలై 1 నుంచి 31 వరకు దర్పణ్‌లో 986 కేసులు చేర్చారు. మరో 2,635 కేసులను త్వరలో చేరుస్తారు.

**ఈ సెక్షన్ల కింద...**

ఐపీసీ 374, 353, 26, 79 జువనైల్ జస్టిస్ యాక్ట్ 2015, వెట్టిచాకిరీ నిరోధక చట్టం 1976 సెక్షన్లు 16, 17, 18, చైల్డ్ లేబర్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2016 14(1), 18(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

**విముక్తి పొందిన పిల్లల వివరాలు..**

| | |
|---|---|
| అధికారులు రక్షించిన పిల్లల సంఖ్య: | 4,097 |
| తల్లిదండ్రులు/ సంరక్షకులకు అప్పగించిన పిల్లల సంఖ్య: | 1,648 |
| వివిధ హోమ్స్‌లో చేర్పించిన పిల్లల సంఖ్య: | 2,266 |
| ఈబాలల్లో ఇతర రాష్ట్రాలకు చెందినవారి సంఖ్య: | 1,192 |
| వీధిబాలల సంఖ్య: | 955 |
| వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందినవారి సంఖ్య: | 1200 |
| ఇటుకబట్టీల నుంచి బయటపడ్డవారు: | 25 |
| భిక్షాటన నుంచి విముక్తి పొందినవారు: | 115 |

# గురుకులాల్లో అడ్మిషన్లు ఫుల్

- సీట్లకోసం సొసైటీ కార్యాలయాల వద్ద క్యూలైన్లు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలు
- సీట్లు లేవంటూ తిరస్కరిస్తున్న సొసైటీలు
- అదనపు సెక్షన్లు తెరవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన గురుకుల పాఠశాలలకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. ఆయా పాఠశాలల్లో నిర్దేశిత సంఖ్యలో సీట్లు భర్తీ అయినప్పటికీ అడ్మిషన్ల కోసం సొసైటీ కార్యాలయాల వద్ద ఆశావహులు బారులు తీరుతున్నారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సొసైటీ కార్యాలయాల వద్ద జనజాతర తగ్గడం లేదు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 615 గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు టీజీసెట్-2019 నిర్వహించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలు మినహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో 49,200 సీట్లున్నాయి. అర్హత పరీక్ష నిర్వహించిన గురుకుల సొసైటీలు ఆమేరకు భర్తీ సైతం చేశాయి. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయినట్లు స్పష్టం చేస్తూ సొసైటీ కార్యాలయాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కూడా పెట్టేశాయి. అయినప్పటికీ అడ్మిషన్ల కోసం నిత్యం కార్యాలయాల చుట్టూ విద్యార్థులు, తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు.

**చెల్లని సిఫార్సులు...**

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం సొసైటీ కార్యదర్శులకు పెద్దఎత్తున సిఫారసు లేఖలు అందుతున్నాయి. రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల నుంచి కుప్పలుతెప్పలుగా సిఫారసు పత్రాలు తీసుకొస్తూ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ముఖ్యంగా బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు డిమాండ్ తీవ్రంగా ఉంది. మరోవైపు అమాత్యులు, ప్రజాప్రతినిధుల నుంచి నేరుగా ఫోన్లు సైతం చేయిస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కావడంతో చేసేదేం లేక సిఫార్సులను తిరస్కరిస్తున్నారు. ఇటీవల ఓ మంత్రి ఏకంగా 170 పేర్లతో కూడిన సిఫారసు పత్రాన్ని బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శికి పంపడం గమనార్హం. డిమాండ్‌కు తగినన్ని గురుకుల పాఠశాలలు లేవంటూ విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ వసతులు, సౌకర్యాలున్నచోట అదనపు సెక్షన్లు తెరవాలని వారు కోరుతున్నారు.

# మెట్రో స్టేషన్‌లకు 'రైల్వే' పార్కింగ్

**సాక్షి, హైదరాబాద్:** నిత్యం వేల మంది ప్రయాణించే మెట్రో స్టేషన్లలో పార్కింగ్ సమస్యలకు చెక్ పెట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే ముందుకొచ్చింది. సికింద్రాబాద్ ఈస్ట్, తార్నాక, మెట్టుగూడ మెట్రో స్టేషన్ ప్రాంతాల్లో ఉన్న రైల్వే స్థలాలను పార్కింగ్ యార్డులుగా మార్చబోతుంది. దీనికి గానూ మెట్టుగూడ వద్ద 1,613 చదరపు మీటర్లు, సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ సమీపంలో 875 చ.మీ., తార్నాక స్టేషన్ సమీపంలో రైల్వే డిగ్రీ కళాశాల పక్కన 1,800 చ.మీ. స్థలాన్ని కేటాయించింది. వీటికి ఈ నెల 19న టెండర్లు తెరవనుంది. ఆ వెంటనే పార్కింగ్ యార్డులు ఏర్పాటవుతాయి. సికింద్రాబాద్ ఈస్ట్, తార్నాక, మెట్టుగూడ మెట్రో స్టేషన్ సమీపంలో ఏ సమయంలో చూసినా చాలా వాహనాలు పార్క్ చేసి ఉంటున్నాయి. మెట్రో ప్రయాణికులకు వేరే అవకాశం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలిపేసి రైలు ఎక్కేస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్లపక్క వాహనాలు నిండిపోతున్నాయి. వీటికి తోపుడు బండ్లు తోడవడంతో రోడ్లపై నడిచేందుకు కూడా పాదచారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో ఈ సమస్యను పరిష్కరించాలని మెట్రో రైలు అధికారులు జీహెచ్‌ఎంసీని ఆశ్రయించారు. కానీ పార్కింగ్ ఏర్పాట్లు చేయడం జీహెచ్‌ఎంసీకి కూడా సాధ్యం కాలేదు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు దక్షిణ మధ్య రైల్వేను ఆశ్రయించారు. ఆయా ప్రాంతాల్లో దక్షిణ మధ్య రైల్వేకు స్థలాలుండటంతో పార్కింగ్ యార్డుల ఏర్పాటుకు రైల్వే అధికారులు సమ్మతించారు.











యడియూరప్పకు దండవేసి ఆశీర్వదిస్తున్న చినజీయర్‌స్వామి

## యడియూరప్పకు చినజీయర్ ఆశీర్వాదం

**శంషాబాద్ రూరల్ :** కర్ణాటక ముఖ్యమంత్రి యడియూరప్ప గురువారం రాత్రి త్రిదండి చినజీయర్ స్వామిని దర్శించుకున్నారు. యడియూరప్ప బెంగళూరు నుంచి శంషాబాద్ విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి నేరుగా శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న జీయర్‌స్వామి ఆశ్రమానికి రాత్రి 9:30 గంటలకు చేరుకున్నారు. అహోబిలం జీయర్ స్వామి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం యడియూరప్ప చినజీయర్ స్వామిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. రాత్రికి అక్కడే బస చేసి ఉదయం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

# కొనుగోళ్ల లక్ష్యం అరకోటి మెట్రిక్ టన్నులు

- గతంలో కంటే భారీగా పెరగనున్న ధాన్యం సేకరణ
- అధిక దిగుబడులు ఉంటాయని పౌర సరఫరాల శాఖ అంచనా

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్టుల్లో చేరుతున్న జలాలతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు పెరగనున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లే ధాన్యం దిగుబడులు ఉంటాయని పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. ఇప్పటికే ఏటేటా ధాన్యం సేకరణ పెరుగుతున్న నేపథ్యంలో.. అందుకు తగ్గట్లు ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా ధాన్యం కొనుగోళ్లు ఏ స్థాయిలో ఉండవచ్చో ప్రాథమికంగా తేల్చింది. ప్రస్తుత సీజన్ నుంచి కనీస మద్దతు ధరలు పెరగడంతో మిల్లర్లు కొనుగోళ్లు తగ్గించే అవకాశం ఉంటుందని, ఈ నేపథ్యంలో వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు కొనేలా ప్రాథమిక చర్యలు తీసుకునే పనిలో పడింది. కనిష్టంగా 50 లక్షల నుంచి 55 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని సేకరించాల్సి ఉంటుందని లెక్కగట్టింది.

**భారీ దిగుబడులు..**

తెలంగాణలో గతంలో కంటే ప్రస్తుతం సాగునీటి వ్యవస్థ మెరుగవ్వడం, కాల్వల ఆధునీకరణ జరిగి చివరి ఆయకట్టుకు నీరు చేరుతుండటం, మిషన్ కాకతీయ కింద చెరువుల పూడిక ద్వారా పునరుద్ధరించడం, కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో వరి పంటల సాగు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గతంలో కంటే ధాన్యం దిగుబడులు పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్లే మార్కెట్ వ్యవస్థ బలోపేతం కావడం, రైతులు ధాన్యాన్ని అమ్ముకునేలా పౌర సరఫరాల శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ఏటేటా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెరుగుతూ వస్తోంది. 2014-15లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో కలిపి మొత్తంగా 24.29 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2018-19లో ఏకంగా 77.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి దేశంలో రెండో స్థానంలో ఉంది. గతేడాది ఖరీఫ్‌లో 8,09,885 మంది రైతుల నుంచి 3,297 కొనుగోలు కేంద్రాల ద్వారా 40.41 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 6,63,723 మంది రైతుల నుంచి 3,509 కొనుగోలు కేంద్రాల ద్వారా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ ఏడాది సైతం గతేడాది కన్నా అధికంగా ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ ఉండవచ్చని పౌర సరఫరాల శాఖ అంచనా వేస్తోంది.

**మరో 300 కేంద్రాలు..**

ప్రస్తుత వర్షాలు, సాగునీటి వసతుల కల్పన, పెరిగిన కనీస మద్దతు ధరలతో అధికంగా వరి సాగు జరిగే అవకాశం ఉంది. మద్దతు ధర గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలకు రూ.1,770 నుంచి రూ.1,835కి పెరగడం, సాధారణ రకం రూ.1,750 నుంచి రూ.1,815కి పెరిగిన నేపథ్యంలో ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు ఆసక్తి చూపే అవకాశాలు తక్కువ. ఈ నేపథ్యంలో 50 లక్షల నుంచి 55 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ నేరుగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని గుర్తించింది. గత ఖరీఫ్‌లో కన్నా ఈ ఏడాది మరో 300 కేంద్రాలను అధికంగా పెంచాల్సి ఉంటుందని, ఇక గత కొనుగోళ్లకు రూ.13,300 కోట్ల మేర వెచ్చించగా, ఈ ఏడాది రూ.17 వేల కోట్ల నుంచి రూ.18 వేల కోట్ల మేర వెచ్చించాల్సి ఉంటుందని ప్రాథమిక లెక్కలు వేసింది. దీనికి అనుగుణంగా స్టోరేజీ కెపాసిటీలు పెంచుకోవడం, ఎఫ్‌సీఐతో సమన్వయం వంటి అంశాలపై దృష్టి పెట్టింది.





HDFC BANK We understand your world | Up to ₹10,000 Additional Instant Discount* on HDFC Bank Debit & Credit Cards | Offer valid from 1st Aug to 31st Aug 2019. Not valid on Gold Coins. *T&Cs apply. Tanishq reserves the right to amend the T&Cs without any prior notice.

Buy online at tanishq.co.in
• Check tanishq.co.in/offers for further details
• Follow us on: • Give a missed call on 1800 3010 5002 to know more

వరంగల్ – శ్రీ ప్రకాశ్ ఆర్కేడ్, ములుగు క్రాస్ రోడ్డు; కరీంనగర్ – సిటి సెంటర్ మాల్, ఐ.బి. గెస్ట్ హౌస్ సర్కిల్, సి.వి.ఆర్.ఎన్. రోడ్; ఖమ్మం – వివిసి కాంప్లెక్స్, వైరా రోడ్. హైదరాబాద్ – ఎ.ఎస్.రావ్ నగర్ • హిమాయత్‌నగర్ • బంజారా హిల్స్ • కుకట్‌పల్లి • దిల్‌షుక్‌నగర్ • పంజాగుట్ట. టెలి: 49777450 / 51/52 • కొండాపూర్ • కొంపల్లి – కావేరి ఎన్‌క్లేవ్, సిటీప్లానెట్ సమీపంలో, పేట్ బషీరాబాద్ • మదీనగూడ – సాయి సర్వీస్ మారుతీ షోరూమ్ పక్కన, ఆల్విన్ గి రోడ్ • సికింద్రాబాద్ – రామాలయ బిల్డింగ్ వెస్ట్‌సైడ్‌ని ఆనుకొని, ప్యారడైజ్ సర్కిల్ దగ్గర, ఎస్‌డి రోడ్. టెలి: 47569999 / 9866055555.
ఇంకా ఇక్కడ: విశాఖపట్టణం • విజయవాడ • గుంటూర్ • నెల్లూరు • కాకినాడ • రాజమండ్రి • తిరుపతి • కర్నూల్ • ఒంగోలు • అనంతపురం.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792